జాతీయ

# స్ఫూర్తి

పక్షపత్రిక

2021, ఏప్రిల్ 1-30

వెల : రూ.15/-

మన కాలం మొఘల్ సమ్రాట్!

మధ్యతరగతి మహావిషాదం

పట్టాలు తప్పిన పట్టభద్రులు

తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫతిమా షేక్

స్త్రీలను కించపరిచిన పాఠ్య గ్రంథాలు

సీరియళ్ళు.. స్త్రీలు.. సమాజం..

రొమిలా థాపర్ అసమ్మతి స్వరం

తొలి పార్లమెంటులో డాక్టర్ చెలికాని రామారావు

నిజ జనజీవన దృశ్యాల పరంపర

కార్మికవర్గ చైతన్యపు తొలి మెరుపు పారిస్ కమ్యూన్

మోదీ రాజకీయంలో ప్రత్యేకతలు గ్రాంసీ భావజాలం

గ్రాంస్కీ ఆలోచనలు : ప్రత్యామ్నాయ రాజకీయాలు

13-14

జాతీయ స్ఫూర్తి
పక్షపత్రిక
వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు
2021 ఏప్రిల్ 1-30 సంపుటి : 29 సంచిక : 13,14

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

వెల : 15/- రూపాయలు

## ఈ సంచికలో...

3 మన కాలం మొఘల్ సమ్రాట్ !
రామచంద్ర గుహ
5 మధ్యతరగతి మహావిషాదం
పి. చిదంబరం
7 పట్టాలు తప్పిన పట్టభద్రులు
మాడభూషి శ్రీధర్
9 తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫతిమా షేక్
రేకా చంద్ర శేఖర రావు
11 స్త్రీలను కించపరిచిన పాఠ్య గ్రంథాలు
డాక్టర్ దేవరాజు మహారాజు
12 సీరియళ్ళు.. స్త్రీలు.. సమాజం..
ఎస్. హనుమంతరెడ్డి
14 దేవుడి కవల పిల్లలు!
కె. శ్రీనివాసాచారి
16 రొమిలా థాపర్ అసమ్మతి స్వరం
కొప్పర్తి వెంకట రమణమూర్తి
23 తొలి పార్లమెంటులో డాక్టర్ చెలికాని రామారావు
వి.విజయకుమార్
25 నిజ జనజీవన దృశ్యాల పరంపర
ఎన్ వేణుగోపాల్
28 కార్మికవర్గ చైతన్యపు తొలి మెరుపు పారిస్ కమ్యూన్
తెలకపల్లి రవి
30 కలిదిండి భీమరాజు జయంతి సభ
31 మోదీ రాజకీయంలో ప్రత్యేకతలు గ్రాంసీ భావజాలం
డి వి వి ఎస్ వర్మ
34 గ్రాంస్కీ ఆలోచనలు : ప్రత్యామ్నాయ రాజకీయాలు – పార్టీ వ్యవస్థలు
కొండూరి వీరయ్య

# అసెంబ్లీ ఎన్నికలలో మోదీ రాజకీయం

**సంపాదకీయం**

2021 మార్చి ఏప్రిల్‌లలో 5 అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో మూడు తరహాల రాజకీయ మార్గాలు తలపడుతున్నాయి. అస్సాం, పుదుచ్చేరిలలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిల మధ్య ప్రధాన పోరు నెలకొంది. ఈ రెండు చోట్లా బిజెపి విజయం సాధిస్తే కాంగ్రెస్ భవిష్యత్తు మరింత అగమ్యగోచరం అవుతుంది. కాంగ్రెస్ పుంజుకుంటే భవిష్యత్‌పై దాని ఆశలు చిగురిస్తాయి.

బెంగాల్ తమిళనాడులలో ప్రాంతీయ పార్టీలు నిలదొక్కుకుంటాయా లేక బిజెపి దాని అనుచర పార్టీలకు చోటు కల్పిస్తాయా అన్నది ఈ ఎన్నికలలో తేలనుంది. ప్రాంతీయ పార్టీల అస్తిత్వానికి ఇది ఒక పరీక్ష కానుంది.

కేరళలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన విజయం సాధిస్తే మరో ప్రత్యామ్నాయ రాజకీయానికి కొంత బలం చేకూరుతుంది. అక్కడ బిజెపి సీట్లపరంగా కాకపోయినా ఓట్లుపరంగా ఏ మేరకు బలపడుతుందనేది కేరళ భవిష్యత్ రాజకీయాలకు సూచిక అవుతుంది. మొత్తం మీద బిజెపి అస్సాంతో పాటు, బెంగాల్‌ను పుదుచ్చేరినీ దక్కించుకోవాలని, కేరళ, తమిళనాడులో తన బలాన్ని పెంచుకోవడం అన్న వ్యూహంతో పావుల్ని కదుపుతున్నది.

ఈ ఎన్నికలలో తన ఏడేళ్ల పాలనలో సాధించిన విజయాలను చెప్పుకునే స్థితిలో మోదీ లేరు. ఏటా 2 కోట్ల అదనపు ఉపాధి లేకపోగా వున్న ఉపాధి ఊడిపోతున్నది. నిత్యావసరాల ధరలు, పెట్రోలు, డీజిల్ ధరలు ఎగబాకుతున్నాయి. రైతులు, కార్మికులు ఆందోళనబాటలో వున్నారు. ప్రపంచస్థాయిలో ప్రకటిస్తున్న అనేక సూచీలలో భారత్ స్థానం దిగజారుతున్నది. ఇటీవల ఐ.యం.ఎఫ్. ఆర్థిక నివేదిక మోదీ ప్రభుత్వం గాలి తీసేసింది. తలసరి ఆదాయంలో బంగ్లాదేశ్ కంటే భారత్ వెనకబడిందని ప్రకటించింది.

అందుకే ఎన్నికల్లో మోదీ తాను సాధించిన విజయాలను ప్రచార అస్త్రంగా వాడడం లేదు. బెంగాల్‌లో దుర్గాపూజ, సరస్వతీ పూజ, వివక్షతో కూడిన పౌరసత్వ చట్టాల అమలును ప్రచారం చేస్తున్నారు. కేరళలో అయ్యప్ప ఆలయంలో మహిళల ప్రవేశాన్ని, తమిళనాడులో జల్లికట్టు వివాదాన్ని హిందూ సాంస్కృతిక నినాదాలుగా చేసుకున్నారు.

ఇక ఎన్నికల కోసం, ప్రత్యర్థుల మీద అవినీతి ప్రచారం కోసం సిబిఐని వినియోగించుకోవడం మోదీ ప్రభుత్వానికి అలవాటే. ఈ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీల నాయకుల ఇళ్ళ మీద సోదాలు, కేసులు, వాటిని ప్రచార అంగాలుగా చేసుకుంటున్నారు. ప్రజాసమస్యల మీద దృష్టి మళ్లకుండా హిందూత్వ చుట్టూ, కుట్రల చుట్టూ మోదీ రాజకీయం సాగుతున్నది. ❑


# మన కాలం మొఘల్ సమ్రాట్!



**రామచంద్ర గుహ**
చరిత్రకారుడు

జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ వలే భారతరత్న పురస్కారాన్ని నరేంద్ర మోదీ ఆశించకపోవచ్చు. మొఘల్ చక్రవర్తుల వలే అద్భుత వాస్తునిర్మాణాలతో దేశ రాజధానికి కొత్త రూపునివ్వడం ద్వారా చరిత్రలో నిలిచిపోవాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. 'సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్' మోదీ స్వప్నాలకు ఒక తార్కాణం.

ఒకప్పుడు నరేంద్ర అనే రాజు ఉండేవాడు. ఒక సంస్థానానికి ఆయన అధిపతి. హిందూమత పుణ్య క్షేత్రం ఒకటి ఆయన రాజ్యంలోనే ఉంది. రాజవంశాచారం ప్రకారం ఆయనే ఆ సుప్రసిద్ధ ఆలయానికి పోషకుడు. నరేంద్రుడు దైవస్వరూపుడని ప్రజలు భావించేవారు. అయితే తన పూర్వీకులు, భావి వారసుల కంటే తాను ఒక విశిష్టరీతిలో చరిత్రలో నిలిచి పోవాలని నరేంద్రుడు ఆకాంక్షించాడు. తన కోసం, తన ప్రజల కోసం ఒక కొత్త రాజధానిని నిర్మించాడు. దానికి నరేంద్రనగర్ అని పేరు పెట్టాడు.



ఇదొక వాస్తవ గాథ. నేను ప్రస్తావించిన సంఘటనలు కేవలం వంద సంవత్సరాల క్రితం సంభవించాయి. రాజు నరేంద్ర షా తెహ్రీ గఢ్వాల్ సంస్థానాధిపతి. కొత్త రాజధాని నిర్మాణం 1919లో పూర్తయింది. గఢ్వాల్ పర్వత ప్రాంతాలలో పెరిగిన నేను నరేంద్రనగర్‌ను సందర్శించాను. అహ్మదాబాద్‌లోని ఒక క్రికెట్ స్టేడియానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరు పెట్టారని విన్నప్పుడు నాకు నరేంద్రషా గాథ జ్ఞప్తికి వచ్చింది. అహ్మదాబాద్ స్టేడియానికి మోదీ పేరిట పునః నామకరణం చేయాలని ఎవరు సూచించి ఉంటారు. బహుశా, క్రికెట్‌లో ఆసక్తి ఉన్న ఒక గుజరాతీ రాజకీయవేత్త కావచ్చు. 1930లలో అడాల్ఫ్ హిట్లర్ కూడా స్టట్‌గార్ట్‌లో ఒక ఫుట్‌బాల్ స్టేడియానికి తన పేరు పెట్టడాన్ని అనుమతించాడు, ప్రోత్సహించాడు.

రాజకీయవేత్తలందరూ తమ గురించి తాము గొప్పగా ఊహించుకుంటారు. అయితే ఒక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంలో వారు తప్పనిసరిగా ప్రజాస్వామ్య పద్ధతులను ఆచరించాలి. నిర్వహిస్తున్న పదవి కంటే తాము గొప్పవారమనే భావనకు వారు తావివ్వకూడదు. ఒక రాచరిక పాలకుడు తన రాజ్యంతో తనను తాను సమానం చేసుకుంటాడు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధానమంత్రిగానీ, దేశాధ్యక్షుడు గానీ ఎట్టి పరిస్థితులలోనూ తనను తాను దేశంతో సమానం చేసుకోకూడదు. ప్రపంచపు పురాతన ప్రజాస్వామిక రాజ్యాధిపతులు సైతం ఈ ఆవశ్యక పాఠాన్ని సరిగ్గా నేరుకున్నారని చెప్పలేము. 1960లలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఛార్లెస్ డీ గాల్ తనను తాను ఫ్రాన్స్‌తో సమానం చేసుకున్నారు. అమెరికాను ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన నాయకుల వలే కాకుండా, చక్రవర్తుల మాదిరిగా పాలించిన శ్వేతసౌధాధిపతులను 'ఇంపీరియల్ ప్రెసిడెంట్స్' అని ఒక చరిత్రకారుడు అభివర్ణించాడు.

మన గణతంత్ర రాజ్య చరిత్రలో గర్వాతిశయులైన ముగ్గురు ప్రధానమంత్రులు ఉన్నారు. వారు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, నరేంద్ర మోదీ. నెహ్రూ, ఇందిరలు అధికారంలో ఉన్నప్పుడే అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'ను పొందారు. మోదీ వంతు కూడా రాబోతుందా? అహ్మదాబాద్‌లో సర్దార్ పటేల్ స్టేడియానికి నరేంద్ర మోదీ పేరిట పునఃనామకరణం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా పాల్గొనడం విస్మయకరంగా ఉంది. 2022 లేదా 2023లో నరేంద్రమోదీకి భారతరత్న పురస్కారాన్ని ప్రదానం చేయడానికి ఇది నాందీ సూచకమా?

అలా జరగదని నేను భావిస్తున్నాను. ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి– మోదీ ఉద్దేశపూర్వకంగా తన పూర్వపు ప్రధానమంత్రుల కంటే భిన్నంగా వ్యవహరిస్తున్నారు. భారతరత్న విషయంలోనూ ఆయన అదే రీతిలో ఉండవచ్చు.

రెండు– చరిత్ర నిర్మాతగా వెలుగొందే విషయంలో మోదీకి గొప్ప ఆకాంక్షలు ఉన్నాయి. ఆయన స్వప్నాలు విలక్షణమైనవి. నెహ్రూ, ఇందిర తమకు భారతరత్నను ప్రకటించడాన్ని అనుమతించారు. ఆనందంగా ఆ పురస్కారాన్ని అందుకున్నారు. అంతకంటే అద్భుతమైన గౌరవాన్ని పొందాలని మోదీ ఆశిస్తున్నారు. దేశ రాజధానికి ఒక కొత్త రూపునివ్వడం ద్వారా చరిత్రలో సుప్రతిష్టుడిగా భాసిల్లేందుకు ఆయన ఆరాటపడుతున్నారు. 2014 మే లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత లోక్‌సభలో తొలిసారి ప్రసంగిస్తూ పన్నెండు వందల సంవత్సరాల బానిసత్వానికి చరమ గీతం పాడడం తన ధ్యేయమని ఉద్ఘాటించారు. ఆ సందర్భంలో ఒక యువ రచయిత నాతో మాట్లాడుతూ మోదీ ప్రసంగం ఆయన రాజకీయ, వ్యక్తిగత ఆకాంక్షలను వ్యక్తం చేసిందని వ్యాఖ్యానించారు.

హిందువులు శతాబ్దాలుగా విదేశీయుల పాలనలో ఉన్నారని మోదీ భావిస్తున్నారు. ఇప్పుడు వారి ఆత్మగౌరవాన్ని పునరుద్ధ రించేందుకే తాను ప్రభవించానని ఆయన విశ్వసిస్తున్నారు. పన్నెండు శతాబ్దాల బానిసత్వాన్ని రూపుమాపుతానని ప్రకటించడంలో ఆయన ఉద్దేశ్యం ఇదేనని నా యువమిత్రుడు వ్యాఖ్యానించాడు. దేశ ప్రజలందరినీ విజయవంతంగా సమైక్యం చేసిన ప్రప్రథమ హిందూ పాలకుడిని తానేనని మోదీ ఆ ప్రకటన ద్వారా సూచించారని నా మిత్రుడు పేర్కొన్నారు. శివాజీ, పృథ్వీరాజ్‌లు మహావీరులు అయినప్పటికీ ఈ సువిశాల దేశంలో వారి రాజ్యాలు చాలా చిన్నవి. ప్రాదేశికంగా గానీ, రాజకీయంగా గానీ బౌద్ధ అశోకుడు, ముస్లిం మొఘల్స్, క్రైస్తవ బ్రిటిషర్ల వలే దేశాన్ని సమైక్యపరచడంలో ఆ ఇరువురూ విఫలమయ్యారు. శివాజీ, పృథ్వీరాజ్‌లు సాధించలేకపోయిన మహత్కార్యాన్ని విజయవంతంగా నిర్వర్తించడం ద్వారా హిందువుల గొప్పదనాన్ని ప్రపంచానికి చాటడానికి నరేంద్ర మోదీ సంకల్పించారు.

తమ ప్రాధాన్యాన్ని చాటేందుకు, తమ ఆధిక్యతను నిరూపించేందుకు, తమ సార్వభౌమత్వాన్ని చెలాయించేందుకు రాజులు, చక్రవర్తులు కొత్త రాజధాని నగరాలను నిర్మించడం పరిపాటి. గఢ్వాల్ పాలకుడు నరేంద్ర షా కొత్త రాజధాని నిర్మాణానికి పూనుకోవడానికి కొన్ని సంవత్సరాల ముందే ఆనాటి మన 'భారత భాగ్య విధాత' అయిన ఇంగ్లాండ్ రాజు ఐదవ జార్జి, బ్రిటిష్ ఇండియాకు కొత్త రాజధానిని నిర్మించనున్నట్టు ప్రకటించారు. పాత ఢిల్లీకి సమీపంలోని గ్రామాల నుంచి సమీకరించిన భూములలో కొత్త రాజధాని నిర్మాణానికి బ్రిటిష్ వలసపాలకులు పూనుకున్నారు.

బ్రిటిష్ వలస పాలకులకు మూడు శతాబ్దాల పూర్వం షాజహాన్ చక్రవర్తి మొఘల్ సామ్రాజ్య రాజధానిని ఆగ్రా నుంచి ఢిల్లీకి మార్చాడు. తాను నిర్మించిన కొత్త రాజధానికి షాజహానాబాద్ అని పేరు పెట్టారు. షాజహాన్ చక్రవర్తి వలే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఆడంబరంగా, విశిష్టంగా కన్పించేందుకు ప్రాధాన్యమిస్తారు. మధ్యయుగాల చక్రవర్తికి అందుబాటులో లేని నవీన సాంకేతికతలు ఎన్నో మోదీకి అందుబాటులో ఉన్నాయి. రేడియో, టెలివిజన్, వార్తాపత్రికలు, వెబ్‌సైట్స్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ మొదలైన వాటితో ప్రజలను నాటకీయంగా ప్రభావితం చేయడంలో నరేంద్రమోదీ సిద్ధహస్తులు. ఆ విధంగా ఆయన అసంఖ్యాక భారతీయులకు చేరువయ్యారు.

ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రవర్తించే తీరు దర్పంతో కూడుకుని ఉంటుంది. రాజకీయ సహచరులు, ప్రత్యర్థులతో వ్యవహరించే తీరులోనూ, బహిరంగసభల్లో ఆయన కన్పించే తీరులోనూ ఆ దర్పం స్పష్టంగా గోచరమవుతుంది. పార్లమెంటులో చర్చల్లో పాల్గొనడంలో విముఖత ప్రదర్శించడంలో కూడా ఆయన గర్వాతిశయమే వ్యక్తమవుతుంది. ఆయన 'మన్ కి బాత్' ప్రసంగాన్ని మొఘల్ చక్రవర్తి ఫర్మానాతో పోల్చవచ్చు. మొఘల్ చక్రవర్తుల వలే నరేంద్రమోదీ కూడా అద్భుత వాస్తునిర్మాణాలతో దేశ రాజధానికి కొత్త రూపునివ్వడం ద్వారా చరిత్రలో నిలిచి పోవాలని ఆకాంక్షిస్తున్నారు. మొఘల్ చక్రవర్తుల, బ్రిటిష్ వలసపాలకుల పాలనను మోదీ తరచు విమర్శిస్తుంటారు. అయితే వారిని అనుకరించడం ద్వారానే చరిత్రలో శాశ్వతంగా నిలిచి పోయేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. మూడు శతాబ్దాల అనంతరం హిందూత్వ రాష్ట్ర భావిపౌరులు తాను కొత్త రూపునిచ్చిన న్యూఢిల్లీని చూసి గర్విస్తారని ఆయన భావిస్తున్నారు. అయితే ఆయన ఆశ నెరవేరే అవకాశం లేదు.

రాచరిక దురహంకారంతో ఆయన నిర్మించనున్న నూతన రాజభవనాలు లాల్ ఖిల్లా, జమా మస్జీద్, నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లకు సాటి వచ్చేది ఒక్కటీ ఉండకపోవచ్చు. న్యూఢిల్లీకి కొత్తరూపునిచ్చే ప్రాజెక్టుకు 'సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్' అని పేరు పెట్టారు. కొత్త పార్లమెంటు, కేంద్ర ప్రభుత్వ సచివాలయ భవనాల సముదాయం నిర్మాణం పూర్తయిన తరువాత దేశ రాజధానితో వలస పాలనానుబంధం స్థానంలో ఆత్మనిర్భర్ చోటు చేసుకోవడం ఖాయం. ఇప్పటికే ఒక శతాబ్దం కింద నిర్మించిన ఒక 'నరేంద్ర నగర్' ఉంది. బహుశా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కొత్తగా రూపుదిద్దుకోనున్న న్యూఢిల్లీని ఏమని పిలుస్తారు? బహుశా 'నరేంద్ర మహానగర్' అంటారా? లేక 'మోదీయబాద్' అని నామకరణం చేస్తారా? ❑

# మధ్యతరగతి మహావిషాదం



**పి. చిదంబరం**
**కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు**

ఆర్థికవేత్తల వర్గీకరణల్లో మాత్రమే మధ్యతరగతి కన్పిస్తోంది. సమస్త జీవనరంగాల నుంచి వారు పలాయనం చిత్తగించారు. దేశ వ్యాప్తంగా మధ్యతరగతి ప్రజలు తమను తాము గేటెడ్ మినీ-రిపబ్లిక్స్‌లోకి ఉపసంహరించుకున్నట్టుగా ఉంది సుమా! ప్రజా జీవితంలో మధ్యతరగతి వారి క్రియాశీల పాత్ర కానరాకపోవడం మన ప్రజాస్వామ్య పరిసమాప్తిని త్వరితం చేస్తుందనడంలో సందేహం లేదు.

ఏమి దేశం మనది? 138 కోట్ల జనాభా, రూ.98,000 తలసరి ఆదాయం, తీవ్ర అసమానతలతో వర్థిల్లుతోన్న ఈ పురా నవ భారతభూమిలో మధ్యతరగతి (ప్రజల) పరిమాణాన్ని అంచనా వేయడం ఒక క్లిష్ట కార్యం!

మొదటి అవరోధం నిర్వచనపరమైనది. ఒక వ్యక్తిని మధ్యతరగతికి చెందినవాడుగా పరిగణించేందుకు ఆధారమైన ఆదాయ స్థాయి ఏమిటి? దేశ జనాభాలో కేవలం 1 శాతం మంది జాతి సంపదలో 73 శాతానికి యజమానులు. ఏ అభివృద్ధి చెందుతున్న దేశంలోనైనా క్రింది స్థాయి 20 శాతం మందిని పేదలుగా పరిగణించి తీరాలి. మధ్యతరగతి భారతీయులు పది కోట్ల మంది అని భావించినా ఈ జనసంఖ్య 14 దేశాలు మినహా ప్రపంచంలోని ఏ దేశ జనాభా కంటే అధికం.

రెండో అవరోధం జీవన నాణ్యత. దీన్ని మధ్యతరగతి ప్రజల జీవితంగా అభివర్ణించవచ్చు. రూ.98 వేల తలసరి ఆదాయంతో ఎటువంటి జీవితాన్ని సమకూర్చుకోవడం సాధ్యమవుతుంది? ఒక్కో వ్యక్తికి రూ.8000 నెలసరి ఆదాయం కూడు, గుడ్డ, గూడు, విద్య, ఆరోగ్యం, వినోదం, ఎంతో కొంత పొదుపునకు సరిపోతుంది. ప్రతి వ్యక్తికి కనీస మాత్రంగా ఇంత ఆదాయం ఉండి తీరాలి. కనుక మధ్యతరగతి మహారాజుగా పరిగణన పొందాలంటే ఆ మొత్తానికి కనీసం రెండు లేదా మూడు రెట్ల వార్షిక ఆదాయం ఉండి తీరాలి. మధ్యతరగతి భారతీయుల సంఖ్య ఆదాయపు పన్ను చెల్లించే వారి సంఖ్య కంటే అధికంగా ఉండదని నేను భావిస్తున్నాను. మరి 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను చెల్లించిన వారి సంఖ్య 3.29 కోట్లు. దేశ జనాభాలో వీరు మహా అయితే 2.4 శాతం మంది మాత్రమే.

మధ్యతరగతి భారతీయుల సంఖ్య 3 నుంచి 10 కోట్ల మధ్య ఉండవచ్చు. 6 కోట్ల మంది మధ్యతరగతి భారతీయులు ఉన్నారని అనుకుందాం. వీరిలో వ్యాపారస్తులు, రైతులు, జడ్జీలు, న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజనీర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, నటులు, రచయితలు, ఇతర వృత్తి నిపుణులు ఉంటారు. మరి ఈ ఆరు కోట్ల మంది 'మధ్యతరగతి' భారతీయులు ఏం చేస్తున్నారు? ఇదే ఈ వ్యాస వివేచనాంశం.

భారత స్వాతంత్ర్యోద్యమానికి మధ్యతరగతి ప్రజలు సమున్నత మేధోవనరులుగా ఉన్నారు. ఈ శ్రేణికి చెందిన ఎంతో మంది, రాజకీయ నాయకులకు స్నేహితులు, సలహాదారులుగా ఉన్నారు. అత్యున్నత స్థాయి అధికార పదవులను నిర్వహించిన వారితో కలిసి తిరిగారు. వారి అభిప్రాయాలను ప్రజా చర్చలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేశాయి. బెంగాల్‌లో వారిని భద్రలోక్ అనేవారు. తమిళనాడులో వారు ది హిందు, దినమణి చదివేవారు. సంగీత కచేరీలకు వెళ్ళేవారు. సినిమాలు చూసేవారు. తెప్పం, థేర్ మొదలైన మతోత్సవాలలో శ్రద్ధాసక్తులతో పాల్గొనేవారు. మహారాష్ట్రలో సాహిత్యాన్ని, రంగస్థలాన్ని అమితంగా ఆదరించే వారు. కేరళ, కర్ణాటకలలో చర్చిలు, మఠాల కార్యకలాపాలలో పాల్గొనేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే మధ్యతరగతి వారు సమాజ సమస్త వ్యవహారాలలోనూ కీలక వ్యక్తులుగా ఉండేవారు.

మధ్యతరగతి వ్యక్తులు ప్రవేశించిన తరువాత రాజకీయాలు సమున్నతమూ, నాగరీకమూ అయ్యాయి. అభ్యర్థులుగా కాకుండా ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్దే ప్రభావశీల మేధావులుగానే వారు రాజకీయాలను సదా నవపథాల నడిపించారు. ఈ మధ్యతరగతి ప్రజల నుంచే దక్షిణాదిన అచ్యుత మీనన్, సి.సుబ్రమణియం, వీరేంద్ర పాటిల్, సంజీవయ్య మొదలైన వారు; ఉత్తరాదిన ఎంతో మంది ప్రభవించారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రైతుల ఉద్యమాలు, కార్మిక సంఘాల ఆందోళనలు, విద్యార్థుల నిరసనలు ఇత్యాది ప్రజా పోరాటాలను మధ్యతరగతి వారు తమ ధీశక్తితో ప్రభావితం చేశారు. ఆ పోరాటాలకు ప్రయోజనకరమైన ముక్తాయింపులను ఇచ్చారు. సహానుభూతి, వివేచన, నిష్పాక్షికత,


సమధర్మం మొదలైన సమున్నత విలువలతో వ్యవహరించడం ద్వారా సమాజ జీవితాన్ని మానవతా ప్రదీప్తం చేశారు.

ఆహా, కాలవైపరీత్యం! మనుషులు మారారు. ఆ మధ్యతరగతి ప్రజలు కానరావడం లేదు. ఆర్థిక వేత్తల వర్గీకరణల్లో మాత్రమే మధ్యతరగతి కన్పిస్తోంది. సమస్త జీవనరంగాల నుంచి వారు పలాయనం చిత్తగించారు. పూర్తి స్థాయి రాజకీయవేత్తలు క్లబ్‌లు, సొసైటీలు, క్రీడాసంఘాలు, సహకార సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, ఆలయ ధర్మకర్తల మండళ్లు, ఒకటేమిటి సమాజ జీవితంలోని ప్రతి విభాగాన్ని స్వాయత్తం చేసుకున్నారు. సర్వత్రా వారిదే పెత్తనం. బహుశా ఈ కారణంగానే ప్రజాజీవితం, ముఖ్యంగా రాజకీయాలు కపటత్వానికి నెలవులయ్యాయి. ధన బలమే ప్రధానమైపోయింది. ప్రజా చర్చల స్థాయి పూర్తిగా పతనమై పోయింది. సభ్యతా సంస్కారాలకు తావు లేకుండా పోయింది. విద్వత్తుకు గౌరవం లోపించడంతో చర్చలు నిస్సారమై పోయాయి.

కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా న్యూఢిల్లీ శివారు ప్రాంతాలు సింఘు, టిక్రిలలో 100 రోజులకు పైగా ప్రజ్వరిల్లుతోన్న రైతుల నిరసనల పట్ల మధ్యతరగతి ప్రజలు ఉదాసీనంగా ఉండిపోవడం నిరుత్సాహం కలిగిస్తోంది. నిర్భయ కిరాతకం చోటు చేసుకున్నప్పుడు మినహా మధ్యతరగతి చైతన్యశీలంగా వ్యవహరించలేదు. జెఎన్‌యూ, అలీగఢ్ వర్సిటీలో పౌరసత్వ చట్టాలకు వ్యతిరేకింగా ఉద్యమిస్తున్న విద్యార్థులపై పోలీసులు అనాగరిక దాష్టీకాన్ని మధ్యతరగతి ప్రజలు ప్రశ్నించనే లేదు. షహీన్‌బాగ్‌లో పౌరసత్వ చట్టాలకు వ్యతిరేకంగా మహిళల అపూర్వ పోరాట పటిమకు మధ్యతరగతి వారు సంఘీ భావం తెలిపారా? సిగ్గుచేటు. 2020 మార్చి 25న ఆకస్మికంగా లాక్‌డౌన్ విధించిన ఫలితంగా లక్షలాది వలస కార్మికులు వందల, వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న స్వస్థలాలకు కాలినడకన పయనమయి నప్పుడు వారు ఎదుర్కొన్న అవస్థలు వర్ణనాతీతం. మధ్యతరగతి ప్రజలు ఎలా స్పందించారో మరి చెప్పాలా? హర్యానా, కర్ణాటక లలో కార్మిక పోరాటాలు దేశ ప్రజల దృష్టికి రానే లేదు పోలీసు కాల్పులు, బూటకపు ఎన్‌కౌంటర్లు వారి అంతరాత్మలను కదిలించలేకపోతున్నాయి.

సామాజిక కార్యకర్తల, రచయితల, కవుల అక్రమ అరెస్టులను ప్రశ్నించడాన్ని మధ్యతరగతి వారు మరచిపోయారు. ప్రతిపక్ష నాయకులను నానా వేధింపులకు గురిచేయడాన్ని కూడా పూర్తిగా ఉపేక్షిస్తున్నారు. ఎందుకు ఇలా జరుగుతోంది? దేశవ్యాప్తంగా మధ్యతరగతి ప్రజలు తమను తాము గేటెడ్ మినీ-రిపబ్లిక్స్‌లోకి తమను తాము ఉపసంహరించుకున్నట్టుగా ఉంది సుమా! కళ్ళకు గంతలు కట్టుకున్న, చెవుల్లో దూది పెట్టుకున్న, నోరు కట్టేసుకున్న మూడు కోతుల కథ గుర్తుందా? ఆ కథలోని నీతిసూత్రాన్ని మన మధ్యతరగతి వారు పాటిస్తున్నారు కాబోలు! ప్రజా జీవితంలో మధ్యతరగతి వారి క్రియాశీల పాత్ర కానరాకపోవడం మన ప్రజాస్వామ్య పరిసమాప్తిని త్వరితం చేస్తుందనడంలో సందేహం లేదు. ❑

## కార్ల్ మార్క్స్ జయంతి జాతీయ స్ఫూర్తి ప్రత్యేక సంచిక



**2021 మే 5 కార్ల్ మార్క్స్ 204వ జయంతి సందర్భంగా**
**జాతీయ స్ఫూర్తి ప్రత్యేక సంచికను తేవాలని సంకల్పించింది.**

మార్క్స్ జీవిత విశేషాలు, స్వీయరచనలతో పాటు మార్క్స్ రాసిన పుస్తకాలను పరిచయం చేసే వ్యాసాలు, ప్రస్తుత పరిస్థితులకు అన్వయిస్తూ మార్క్స్ రచనలలోని ప్రత్యేక అంశాలను విశ్లేషించే వ్యాసాలతో (100 పేజీలకు మించి) అపురూపమైన సంచికగా రూపొందిస్తున్నాం.


ఈ సంచిక ప్రజా ఉద్యమకారులకు దారిదీపం అవుతుందని భావిస్తున్నాం.

ఈ సంచికకు మీ సంస్థ పేరుతో ఒక ప్రకటన ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.
అదనంగా కాపీలు కావలసినవారు ఏప్రిల్ 20 లోగా చెప్పండి.

వివరాలకు : **డి వి వి ఎస్ వర్మ,** సంపాదకులు
✆ 85006 78977, dvvsvarma@yahoo.com

సంపాదకవర్గం

# పట్టాలు తప్పిన పట్టభద్రులు



మాడభూషి శ్రీధర్
బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్

ఓట్లు అమ్ముకోవడమూ, కోట్లు పెట్టి కొనుక్కోవడమూ మనం రుజువు చేయలేని బహిరంగ రహస్య నేరాలు. ఈ కొన్న, అమ్మిన నేరగాళ్లంతా తమ చదువులకు తగినట్టుగా వ్యవహరిస్తామని పట్టభద్రులు కాగానే స్నాతకోత్సవంలో ప్రతిజ్ఞ చేసినవారే అయి ఉంటారు. ఎన్నికల్లో గెలిచిన వారూ పాత పట్టభద్ర ప్రమాణం మరిచిపోయినట్టే రాజ్యాంగం ప్రకారం వ్యవహరిస్తామని రేపు చేయబోయే ప్రతిజ్ఞనూ మరిచిపోతారు. చదువును కొని, ఓట్లను కొని, సీట్లను కొని ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వాడు దేశాన్ని రాష్ట్రాన్ని, జిల్లాను, నియోజకవర్గాన్ని, గ్రామాన్ని అమ్ముకోకుండా ఉంటాడా?

శాసనమండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల్లో ప్రతి వెయ్యి ఓట్లకు యాభై చెల్లకుండా పోవడమేమిటి? ఎంఎల్‌సీ ఓట్ల లెక్కింపు చేస్తున్న వారు, చూస్తున్న వారు ఆశ్చర్యపోయారని పత్రికలు వెల్లడించాయి. ఇది చదివిన వారికి ఆ చదువుకున్న వారి గురించి బాధ, విచారం కలుగకుండా ఉంటుందా?

అంకెలు అక్షరాలు ఓటింగ్‌లో వాడడం తెలియని ఈ అంకుళ్లను ఏం చేయాలి? పంతులు గారు బెత్తంతో కొడితేనైనా బుద్ధి వస్తుందంటారా?

నేను ముందే చెప్పినట్టు నిరక్షరాస్యులే విద్యావంతులు. అవును, వారే చైతన్యవంతులు. ఓటరు కార్డు లేకపోతే ఓటు వేయకపోతే బతికి ఉన్నట్టు కాదు అని నమ్మే ప్రజాస్వామ్య ప్రియులు అంతగా చదువు రాని ఓటర్లు. వారి ఓట్లతోనే ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి, మారుతున్నాయి. మరి చదువుకున్న వారి గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? ముందుగా వారు తమ ఓటును నమోదు చేసుకోలేని బద్ధకస్తులు.

రెండోది, వారిలో చాలామంది పోలింగ్ నాడు బూత్‌కు వెళ్లకుండా భూతవర్తమాన బూతులతో కాలం గడుపుతుంటారు. లేదా మ్యాచ్ ఫిక్సింగ్ పోటీలే ఎక్కువ అని తెలిసినా నోరెళ్లబెట్టి, ప్యాకేజి తిండి తింటూ, పంచదార నీళ్లు తాగుతూ క్రికెట్ చూస్తూ ఈ దేశం సంగతి నాకెందుకు, నా ఇఎంఐలకు కావలసిన జీతం వస్తే చాలనుకునే జీతగాళ్లుగా మిగిలిపోతారు.

విద్యావంతులైన పట్టభద్రులు పట్టాలు తప్పిపోయారనిపిస్తుంది. పట్టాతో బతుకు భద్రం చేసుకుంటున్నా మనుకుంటారు కాని ఎందుకు పనికిరాని ఆలోచనలతో పతనమై పోతున్నారనిపిస్తుంది. చాలా మందికి రూ.2000 నుంచి రూ.10,000 దాకా నోట్లిచ్చి ఓట్లు కొనుక్కున్నారని చాలా వర్గాలలో వినిపిస్తున్నది. ప్రొఫెసర్ నాగేశ్వర్ గానీ, ప్రొఫెసర్ కోదండరాం గానీ, తీన్మార్ మల్లన్న గానీ,రాణి రుద్రమ గానీ లేదా అటువంటి కొందరు నిజమైన స్వతంత్ర అభ్యర్థుల కంటే వీర 'కొంటె' అభ్యర్థులు ఓట్లు కొంటే గెలిచినవారవుతారని, ఓడిపోతే అది వారి వ్యక్తిగత ఓటమి కాదనే తత్వం ప్రస్తుతం బోధపడుతుంది.

సరే, ఓట్లు అమ్ముకోవడమూ, కోట్లు పెట్టి కొనుక్కోవడమూ మనం రుజువు చేయలేని బహిరంగ రహస్య నేరాలు. ఈ కొన్న, అమ్మిన నేరగాళ్లంతా తమ చదువులకు తగినట్టుగా వ్యవహరిస్తామని పట్టభద్రులు కాగానే స్నాతకోత్సవంలో ప్రతిజ్ఞ చేసిన వారే అయి ఉంటారు. విచిత్రమేమంటే అట్లా ప్రతిజ్ఞ చేసామని గానీ, ఆ ప్రతిజ్ఞలో ఉన్న విషయం గానీ తెలియని మేధావులే ఎక్కువగా ఉన్నారు. ఎన్నికల్లో పోటీచేసే వారు రాజ్యాంగం ప్రకారం చట్టం ప్రకారం వ్యవహరిస్తామని డిక్లరేషన్లు చేయాలి. తమ చదువులు, నేరాలు, ఆర్థిక వ్యవహారాల చరిత్ర వారే చెప్పుకోవాలి. ఇక వీరిలో గెలిచిన వారు రాజ్యాంగం ప్రకారం వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేయాలి. విచిత్రం కాని సాధారణ విషయమేమంటే వీరంతా పాత పట్టభద్ర ప్రమాణం మరిచిపోయినట్టే రేపు చేయబోయే ప్రతిజ్ఞ కూడా సిగ్గులేకుండా మరిచిపోతారు. పోటీ దశలోనే చట్టాలు, రాజ్యాంగ నియమాలు ఉల్లంఘించే ఈ చదువుకొన్న వారు రాబోయే ఆరేళ్లలో చట్ట ప్రకారమే వ్యవహరిస్తారని అనుకుంటే గొర్రె నక్కలను తోడేళ్లను నమ్ముకున్నట్టే కాదూ? చదువును కొని, ఓట్లను కొని, సీట్లను కొని ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వాడు దేశాన్ని రాష్ట్రాన్ని, జిల్లాను,

నియోజకవర్గాన్ని గ్రామాన్ని అమ్ముకోకుండా ఉంటాడా? మనం నమ్ముకుని గెలిపించిన వారు దేశాన్ని అమ్ముకుని బతకడం మనం చూడడం లేదా? మీరు నమ్ముతారు. వారు అమ్ముతారు. ఇక మీరే అమ్ముకుంటే వారెందుకు అమ్ముకోరు? ఇదంతా అమ్ముకునే విద్యావంతులైన ఓటర్ల గురించి. ఇక ఓటు వేయడం అంటే ఏమిటో తెలియని వారి గురించి ఏం చెప్పేది? బహుశా ప్రతి గ్రాడ్యుయేషన్ కోర్సులో మొదటి పాఠం ఒరే సన్నాసుల్లారా ఓట్లు వేసే పద్ధతి ఇదిరా అని తిట్టి పాఠం చెప్పాలి. అర్థం కాకపోతే బెత్తంతో కొట్టి మరీ చెప్పాలి. జర్నలిస్టు మిత్రుడు ఒకరు శాసనమండలి పట్టభద్రుల నియోజక వర్గం నుంచి పోటీ చేసాడు. ఓడిపోయాడు. పలకరిద్దామని ఫోన్ చేస్తే ఒకటే నవ్వుతున్నాడు. ఏమిటి సంగతి అని అడిగాను. నేను ఎందుకు ఓడిపోయానో తెలిస్తే మీరూ నవ్వుతారు అన్నాడు. అదేమిటన్నాను. ఆ అభ్యర్థి ఈ విధంగా వివరించాడు.

"నా సీరియల్ నెంబర్ 16. కనుక మీరు 16 నెంబర్ ఎదురుగా నా పేరు పక్కన గడిలో ఒకటో నెంబరు వేయండి అని నేను ప్రతిచోటా చెప్పాను. ప్రచార ప్రసంగానికి ముందు ఆ తరువాత కూడా చాలా జాగ్రత్తగా ఈ వాక్యాన్ని చెబుతూనే ఉన్నాను. ఒక్కో సందర్భంలో నమూనా బాలెట్ చూపుతూ ఏ విధంగా ఓటు వేయాలో కూడా చెప్పాను". బాగానే ఉంది కదా మరెందుకు ఓడిపోయావు బ్రదర్ అని నేను మళ్లీ అడిగాను. అక్కడే ఉంది రహస్యం అని మళ్లీ నవ్వాడు. బ్యాలెట్ పత్రంలో నా సీరియల్ నెంబరు, నా పేరు ముందు 16 అని నెంబరు వేసారు చాలామంది చదువుకున్న ఓటర్లు అని మళ్లీ పగలబడి నవ్వాడు. అంటే ఈ అభ్యర్థిని గెలిపించాలనుకుని కష్టపడి ఓటు నమోదు చేయించుకుని, బూతు వెతుక్కుని లోపలికి వచ్చి చాంతాడంత బ్యాలెట్ పేపర్లో నెంబరు వెతుక్కుని దాని ముందు 16 నెంబర్ వేసారన్నమాట. అంటే పదహారో ప్రాధాన్యత ఓటు ఇచ్చారు. అంటే ఈయనకన్న పదిహేను మంది అభ్యర్థులకు గెలిచే ఓట్లు రాకపోతే ఈయన గారి ఓటు లెక్కిస్తారు. కనుక గెలిచే ప్రసక్తే లేదు. ఓటు చెల్లకుండా పోదు కాని పనికి రాకుండా పోతుంది.

సింగిల్ ట్రాన్సఫరబుల్ ఓట్ తెలియని విద్యావంతులను ఓటేయడం రాని... అని తిట్టాలనిపిస్తుంది. కాని సభ్యత సంస్కారం అడ్డు వచ్చి కలం మూసుకుంటున్నాను. కొందరు రైట్ గుర్తు పెట్టారట. మరికొందరు సంతకం పెట్టారట. ఇంకొకడు చుక్కలు పెట్టాడు. నెంబర్ వేసిన వాడికన్న వీరు గొప్ప దద్దమ్మలు. ఎందుకంటే ఈ ఓట్లు చెల్లకుండా పోతాయి.

ఇవన్నీ విన్న ఒక మేధావి ఒక సలహా ఇచ్చాడు. 'సార్ తెలియని వారిని పట్టుకుని తిట్టడం సరికాదు. చుక్క పెట్టినా సంతకం పెట్టినా, గీత పెట్టినా సరే ఓటును మొదటి ప్రాధాన్యం ఓటుగా పరిగణించాలని చట్టాన్ని సవరించాలి' అన్నాడు. ఓటు వేసే విధానాల్లో పార్టీ గుర్తుమీద ముద్ర వేయడం ద్వారా అభ్యర్థికి ఓటు వేయడం అనేది చాలా సులువైన విధానం. కాని ఇదీ రాని వారు వేలాది మంది. అవన్నీ చెల్లకుండా పోయే ఓట్లు. వీటికి తోడు మేధావులు వేసే నోటా ఓట్లు కొన్ని. ఈ రెండూ కలిపితే గెలిచిన అభ్యర్థిని ఓడించేన్ని ఓట్లవుతాయి. ఓడిన వాడు అయ్యో నేనే గెలిచేవాడినే అని ఏడుస్తూ ఉంటాడు. ఒక రాజ్యసభ స్థానాలకు ఓట్లు వేసే ఎమ్మెల్యేలు, ఎంఎల్సీలు కూడా తత్తరపడి ఓట్లు పాడు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. పట్టభద్ర, పంతుళ్ల స్థానాలకు పోటీచేసే వారిలో ప్రాధాన్యతా క్రమంలో చాలామంది అభ్యర్థులకు ఓటు వేసే విచిత్ర అద్భుత అవకాశం ఈ ఎన్నికల్లో లభిస్తుంది. హాయిగా పది మంది కన్న ఎక్కువ మిత్రులకు ప్రాధాన్యతా అంకెలు వేస్తే ఓట్లు వేసుకోవచ్చు. కాని ఆ విషయం తెలియదు చాలా మందికి.

ఈ ఓటు వేయడం తెలియని పెద్దల్లో ఎంపీలు కూడా ఉంటారు. బిల్లుల మీద పార్లమెంటు సభ్యులు ఓటు వేయించు కొమ్మని అడగరు. అడిగినా రాజ్యసభలో చైర్మన్, ఉపాధ్యక్షుడు అంగీకరించాడు. ఐసావిట్, నోసావిట్ అంటూ డెమాక్రసీని చంపేస్తారు. ఒకవేళ ఓటింగ్‌కు ఒప్పుకుంటే మహా ఘనత వహించిన ఎంపీలకు కూడా ఓటు వేయడం రాదని తెలుస్తుంది. వారి ఓటు చెల్లకుండా పోయిందని ఎన్ని సార్లు మనం పత్రికల్లో చదవలేదు?

పట్టాలు పుచ్చుకుని కూడా బతుకు రైలు పట్టాలు ఎక్కలేని వారు పట్టాలు తప్పిన వారు. పట్టభద్ర ఓటర్ల తీరు ఇలా ఉంటే గెలిచేవారు ఏ మార్గాలు అనుసరిస్తారో మనం ఊహించవచ్చు. వీరు పట్టాకు తగని పట్టభద్రులు. పట్టాలు తప్పిన ఓటర్లు. ప్రజాస్వామ్యాలను పట్టు తప్పిస్తారు. భ్రష్ట ప్రజాస్వామ్యాలను వీరే పుట్టిస్తారు. ❑

# తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫతిమా షేక్

రేకా చంద్ర శేఖర రావు




## చరిత్ర చీకటి కోణంలో మరుగున పడిన ఆణిముత్యం

ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కాన్పించని కథలన్నీ కావాలిప్పుడు ! – శ్రీశ్రీ

మన దేశంలో 1848 లో ప్రారంభమైన కొత్త చరిత్రను – మహాత్మా జోతిరావు పూలే – సావిత్రీ బాయి పూలే దంపతుల చరిత్రను తెలుసుకోడానికి షుమారు 150 సంవత్సరాల కాలం మనకు పట్టింది.

దాచి వేయబడిన పూలే మహత్ముని జీవిత చరిత్ర సామాజిక అవసరంగా ముందుకు నెట్టుకు రాబడింది. అలాటి అవసరమే లేకపోతే వారి చరిత్ర మనకు తెలియటానికి ఇంకా ఎంత కాలం పట్టేదో? పూలే దంపతుల చరిత్ర నూతన భారత నిర్మాణానికి ఎంతో స్ఫూర్తిదాయక పాత్ర నిర్వహించగలుగుతున్నది.



ఈ పరిస్థితిలో : మనువాద బ్రాహ్మణ పండితుల కారణంగా జోతిరావు పూలే తన చదువును మానవలసిన పరిస్థితి ఏర్పడితే, జ్యోతిబా పూలే తండ్రి గోవిందరావు పూలేకి నచ్చచెప్పి పూలే చదువు కొనసాగేలా చేసింది ఎవరు?

అలాగే, విద్య అంటే ముక్కోటి దేవతల స్తోత్ర పాఠాలుగా మార్చివేయడమే గాక; వేలాది సంవత్సరాలుగా విద్యకు దూరం చేయబడిన శూద్ర– అతిశూద్రులకు మరియు స్త్రీలు అందరికీ చదువును పూలే దంపతులు నేర్పుతున్నందుకు మనువాద పండితులు రెండో సారి పన్నిన కుట్ర ఫలితంగా గోవిందరావు తన కుమారుడిని, కోడలిని ఇంటి నుండి బయటకు పంపితే వారికి ఆశ్రయం ఇవ్వడమే గాక, తన స్థలంలో పాఠశాల ఏర్పాటు చేసుకునే అవకాశం ఇచ్చింది ఎవరు?

సావిత్రి బాయి పూలేకి విద్యా సంస్థల నిర్వహణలో అండగా వుండి సాయపడడమే గాక, ఆమె కష్టాలలో కూడా తోడునీడగా నిలచినది ఎవరు?

ఈ మూడు ప్రశ్నలకు సమాధానమే "ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు : ఫాతిమా షేక్" పుస్తకం.

– – –

సుప్రసిద్ధ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ ఇటీవల కొత్తగా రాసిన పుస్తకం పేరిది.

గత 20 సంవత్సరాల పైగా ఒక ఉన్నత లక్ష్యంతో, భారత దేశ చరిత్రలో అట్టడుగున పడి కనిపించని ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను, దేశం కోసం వారి రక్త తర్పణలను తన పరిశోధనాత్మక రచనల ద్వారా మన ముందు నశీర్ వుంచుతున్నారు.

టిప్పు సుల్తాను కాలం నుండి, అంతకు ముందు కాలాల నుండి కూడా ఈ దేశం మట్టిలో మట్టిగా, చెమటలో చెమటగా, రక్తంలో రక్తంగా కలసి పోయి దేశ చరిత్రలో ఏ ఒక్క సమూహానికి తక్కువ గాకుండా చేసిన ముస్లిం ప్రజల త్యాగాలు అమూల్యమైనవే గాక, ఏ కొలతల ప్రమాణాలతో కొలవడానికి ఆ కొలతలు చాలవని చక్కగా తన కలం ద్వారా తవ్వి వెలికి తీస్తున్నారు సయ్యద్ నశీర్ అహమ్మద్.

తన లక్ష్యం అజ్ఞాత ముస్లిం వీరుల త్యాగాలను వెలికి తీయడమే గాక, హిందూ – ముస్లిం సమైక్యతకు దోహదపడాలని బలంగా కోరుకుంటున్నారు నశీర్.

– – –

విద్య మీద ఎంతో ప్రేమతో జోతిరావు పూలే తన చదువును కొనసాగిస్తుండగా, శూద్రులు తమ కుల వృత్తినే చేసుకోవాలి గానీ చదువుకోవడం చాలా వ్యర్ధం అయిన పని అని గోవిందరావు పూలే గారికి బాగా పరిచయం వున్న మనువాద పండితులు ఆయనను బ్రెయిన్ వాష్ చేసిన ఫలితంగా మధ్యలోనే పూలే చదువు ఆగిపోయింది.

ఈ సందర్భంలో గోవిందరావు గారి ముస్లిం మిత్రుడు "మున్షి గఫ్ఫార్ బేగ్" గారు ఈ విషయాన్ని తెలుసుకున్నారు. ఆయనకు బాల జ్యోతిబా పూలే అంటే చాలా ప్రేమ.

"చాలా గొప్పవాడు అయ్యే నీ కొడుకు చదువుని మానిపిస్తావా! ఆ బ్రాహ్మణ పండితులకు శూద్రుల పిల్లలు చదువు కోవడం ఇష్టం వుండదు గదా!" అని ఎంతో అనునయంగా మాట్లాడి, నచ్చచెప్పి మరల పూలే విద్యను కొనసాగించేలా చేశారు గఫ్ఫార్ బేగ్.. ఆ రకంగా పూలే గనుక చదువుకోకపోతే మన

దేశపు భారత రత్నము, మహాత్ముడు అయిన పూలే మనకు వుండేవాడు కాదు.

పూలే విద్యావంతుడిగా తయారు కావడానికి కారకుడయిన మున్షి గఫ్ఫార్ బేగ్‌కి మన భారత జాతి ఎంతో రుణ పడి వుంది. 1848 ప్రాంతంలో విద్యాసంస్థలను పూలే ప్రారంభించారు. యాదృచ్ఛికంగా 1848 సంవత్సరానికి చాలా ప్రాధాన్యత వుంది. మార్క్స్– ఎంగెల్స్‌లు ఆ 1848 లోనే "కమ్యూనిష్టు ప్రణాళిక" విడుదల చేసి ప్రపంచం మొత్తంగా వున్న దోపిడీ వ్యవస్థపై తిరుగుబాటు ప్రకటించారు.

అదే సంవత్సరం మహాత్మా జోతిబా పూలే "స్త్రీలు, శూద్ర, అతి శూద్రులవిద్య" ద్వారా మనువాద వ్యవస్థ పైన పోరాట శంఖారావం పూరించారు. స్త్రీలు, శూద్ర, అతిశూద్రులు పూరించిన ఆ విద్యా శంఖారావానికి భయపడిన మనువాద పండితులు తమ కుయుక్తులతో గోవిందరావు పూలే మనసులో జ్యోతిబా పూలే దంపతులపై విషాన్ని నింపారు. దీని ఫలితంగా ఎంతో ప్రేమించే తన కొడుకుని, కోడలిని గోవిందరావు ఇంటి నుండి వెళ్ళగొట్టాడు.

ఈ పరిస్థితిలో స్నేహానికి, పూలే భావాలకు విలువను ఇచ్చే ఉస్మాన్ షేక్ తన ఇంటిలో ఆ దంపతులకు ఆశ్రయం ఇవ్వడమే గాక, తన ఖాళీ స్థలంలో పాఠశాల నడుపుకునేందుకు అవకాశం ఇచ్చి ప్రోత్సహించాడు. అన్న ఉస్మాన్ షేక్ చేసిన మంచి పనికి అతడి చెల్లెలు ఫాతిమా షేక్ ఎంతో సంతోషించి, తన అన్న కోరిక మేరకు ఇంట్లో నివాసానికి కావలసిన వస్తు సముదాయాన్ని, వంట సామాగ్రిని అన్నిటిని ఉచితంగా సావిత్రీబాయి కుటుంబానికి అందుబాటులో ఉంచింది.

– – –

సావిత్రి బాయి పూలేతో పాటు విద్యాబోధన శిక్షణ పొందడమే గాక, పూలే ఏర్పరచిన స్కూళ్ళ పనులలో సావిత్రి బాయికి ఎంతో అండ దండలుగా ఫాతిమా షేక్ నిలచారు. సావిత్రి బాయి, ఫాతిమా షేక్ లు ఇద్దరూ విద్యా బోధనలో ఒకే విధంగా ఆలోచించేవారు. అంతే కాదు, సావిత్రి బాయికి కొండంత అండగా ఫాతిమా షేక్ నిలిచారు.

మనువాదులు చేసిన దుష్ప్రచారాలను తిప్పికొట్టడంలో సాయపడడమే గాక; మనువాద భావజాల స్త్రీ – పురుషులు వీరిని తిట్టడం, పేడ కళ్ళాపి చల్లడం వంటి పనులు చేసినప్పుడు ఫాతిమా షేక్ ఎంతో అండగా సావిత్రి బాయితో నిలబడ్డారు.

స్కూలు నిర్వహణలో కూడా ఫాతిమా శక్తి సామర్థ్యాల పట్ల సావిత్రి బాయికి ఎంతో నమ్మకం వుండేది. సావిత్రి బాయి పూలే అనారోగ్య కారణంగా తన పుట్టింటిలో వుండవలసిన కాలంలో జ్యోతిబాకు 1856లో రాసిన ఉత్తరంలో " పాఠశాల నిర్వహణలో తనకు ఫాతిమా షేక్ మీద ఎంతో విశ్వాసం వుంది" అని రాశారు.

పూలే దంపతుల జీవితంలో పైన చెప్పిన ముగ్గురు ముస్లింలు కీలక పాత్ర నిర్వహించారు. ఈ విషయాలను అద్భుతమైన కథన శైలితో సయ్యద్ నశీర్ అహమ్మద్ రాశారు. ప్రతి పేజీలో తనకు ఆధార సహిత పుస్తకాల నుండి విషయాలను ఉటంకించడం, 72 పుటలు గల "ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు : ఫతిమా షేక్" పుస్తకానికి చాలా సాధికారతని ఇచ్చింది.

మనం చదివే ప్రతి పేజీలో నశీర్ శ్రమ కనపడుతుంది. ఇలాటి పుస్తకాలకు విలువ పెరగాలంటే ఆధారాలను సాధికారంగా పాఠకుల ముందు వుంచాలి, ఆ పనిలో నశీర్ శ్రద్ధ, దీక్ష మనకు ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని కలిగిస్తుంది.

– – –


సయ్యద్ నశీర్ అహమ్మద్ గురించి నేను మొదటగా చెప్పిన మాటలలో భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ముస్లిం యోధుల మరుగున పడిన చరిత్రను వెలికి తీయడం , హిందూ – ముస్లిం భాయీ భాయీ అను సమైక్యతా నినాదాన్ని మరింత బలంగా ముందుకు తీసుకు వెళ్ళడంతో పాటు; పూలే దంపతుల కృషిని ప్రస్తుతించడమే గాక, వారి సేవలన్నిటికీ దోహద పడిన ముగ్గురు ముస్లిం మహనీయుల విషయాలను చరిత్ర గని నుండి తవ్వి , వెలికి తీయడం ద్వారా శూద్ర , అతి శూద్ర – బహుజనులు అందరూ ముస్లిం ప్రజల పట్ల ప్రేమను పెంచుకునేలా చేశారు.

ఈ దేశపు మట్టి బిడ్డలయిన ముస్లిం సోదరులపై మనువాద దుష్ట శక్తుల దాడులను ఎదుర్కొనేందుకు, ఆ ముస్లిం ప్రజలకు ఇతర ప్రజా సమూహాల నుండి గట్టి మద్దతును ఈ "ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు : ఫాతిమా షేక్" పుస్తకం అందించగలదు. ఇది భారత దేశంలోనే తొలి పుస్తకం కావడం విశేషం.

సయ్యద్ నశీర్ అహమ్మద్ రచనలలో నా పైన ఎక్కువ ప్రభావం చూపిన పుస్తకం ఆయన రాసిన " మైసూరు పులి : టిప్పు సుల్తాన్" ఆ పుస్తకాన్ని మించిన ప్రభావం నాకు " ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు : ఫాతిమా షేక్" పుస్తకం కలిగించింది.

ఈ పుస్తకం కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర లలో 200 పట్టణాలలో శ్రీమతి సావిత్రి బాయి పూలే 124వ వర్ధంతి సందర్భంగా ఆవిష్కరణ జరుపుకోవడం విశేషం. తెలుగు సాహిత్య చరిత్రలో ఇదొక రికార్డుగా చెప్పుకోవచ్చు. ఈ తరహా పరిశోధనా కృషిలో ఇప్పటికే 20 పుస్తకాలు రాసిన నశీర్ గారు ఇంతకు అనేక రెట్లు రాయాలని; నిరంతరం ఆ కృషి కొన సాగించ గలందులకు మంచి ఆరోగ్యంగా సయ్యద్ నశీర్ అహమ్మద్ వుండాలని కోరుకుంటాను. సామాజిక వందనాలు. ❑

# స్త్రీలను కించపరిచిన పాఠ్య గ్రంథాలు



**డాక్టర్ దేవరాజు మహారాజు**
సుప్రసిద్ధ సాహితీవేత్త, సైన్సు ప్రొఫెసర్

స్త్రీలను గాడిదలని, వారి వల్లే ఉద్యోగాలు లేకుండా పోయాయని, మాంసాహారులంతా నీతి మాలిన వారని చెపుతూ ఏ సమాజాన్ని నిర్మించాలని ప్రభుత్వం కలలు కంటోంది? జనాభాలో సగభాగమైన మహిళలను హీనంగా చూపిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని రూపొందించగలరా? పాఠశాల స్థాయి నుండే పిల్లలకు అసత్యాలను నూరిపోస్తే పర్యవసానం ఎలా ఉంటుంది? ఎలాగైనా సరే మళ్ళీ మనువాదాన్ని నిలబెట్టే ప్రయత్నం బిజెపి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నట్టుగా లేదూ? ఇలాగైతే భవిష్యత్తు అంతా అంధకారమే కదా ?

వరుసగా జరిగిన మానవ వాదుల హత్యలు, హేతువాదులపై దాడులు, ఆలోచనాపరులైన రచయితలపై ఒత్తిళ్ళు, నోట్ల రద్దు, జిఎస్‌టి, బ్యాంకుల దివాళా, రైతుల లాంగ్ మార్చ్ వంటివన్నీ భవిష్యత్తు చీకటిగా వుండబోతోందని హెచ్చరిస్తున్నాయి. ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. అందుకు కేంద్ర ప్రభుత్వ విధానాలు ఒక కారణమైతే, వివిధ రాష్ట్రాలలోని పాఠ్యపుస్తకాల్లోని అంశాలు మరొక కారణం. పాఠ్యపుస్తకాలలో అసంబద్ధమైన అంశాలు, అసత్యాలు ఎలా చోటు చేసుకున్నాయో గమనించండి. పదమూడు పదిహేను సంవత్సరాల మధ్య వయసున్న బాలబాలికలకు తప్పుడు సమాచారం అందించడమంటే, వారిని తప్పుడు వ్యక్తులుగా తయారు చేయడమే కదా? గుజరాత్‌లో యాభై వేలమంది చదువుకునే ఒక సామాన్య శాస్త్ర పాఠ్య గ్రంథంలో రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో జపాన్, అమెరికాపై అణుయుద్ధం ప్రకటించిందని ఉంది. వక్రీకరించిన చారిత్రక అంశాలు చదువుకుని భావి భారత పౌరులు ఎలా తయారవుతారన్నది ఆందోళన పడాల్సిన విషయం.



అదేవిధంగా స్త్రీల గౌరవాన్ని దిగజార్చే అంశాలు పాఠ్య గ్రంథాల్లో చేర్చడం వల్ల భవిష్యత్తులో మహిళల పరిస్థితి ఏమిటి? రాజస్థాన్‌లో బోధిస్తున్న ఒక పాఠ్య గ్రంథంలో స్త్రీలను గాడిదలతో పోల్చారు. ఉదయం నుండి రాత్రి వరకు స్త్రీలు గాడిదల్లా చాకిరి చేయాల్సి ఉంటుందని హిందీ పాఠ్య పుస్తకంలో సెలవిచ్చారు. గాడిదలకు చెట్టు కింద కాసేపు విశ్రాంతి ఇవ్వొచ్చు. కానీ స్త్రీలకు ఇవ్వకూడదు. 'పావం గాడిదలు పారిపోయినా వెంటనే మళ్ళీ దొరుకుతాయి. వాటికి స్త్రీల వలే పుట్టింటికి పారిపోయే సౌకర్యం లేదు' అని ఆ పాఠం రాసిన రచయిత ఓ చమక్కు విసిరాడు. ఆ విషయాన్ని కింది స్థాయి నుండి పై స్థాయి అధికారుల దాకా అందరూ ఆమోదించారు. కాస్త సున్నిత మనస్కులు, ఇంగిత జ్ఞానం ఉన్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఎవరైనా ఉంటే ఆ పాఠం పిల్లలకు ఎలా చెప్తారు?

మనసు చంపుకొని ఉద్యోగధర్మంగా పాఠం చెప్పడమంత శిక్ష మరొకటి ఉండదు కదా? 'పిల్లల పాఠంలో అలాంటి అంశం ఎందుకుంద'ని ఒక జాతీయ పత్రికా విలేకరి సంబంధిత అధికారిని అడిగారు. దానికా అధికారి... ఏదో పిల్లలకు కాస్త సరదాగా ఉంటుందని అలా పెట్టి ఉంటారు? అదో పెద్ద విషయమా? అని ఎదురు ప్రశ్నించాడు. "భార్యలు గాడిదల్లాంటి వారు" అన్న వాక్యంలో అతనికి ఏ తప్పూ కనిపించ లేదు. బిజెపి ప్రభుత్వాలున్న గుజరాత్, రాజస్థాన్‌లలో అధికారులకు, మంత్రులకు, ముఖ్యమంత్రులకు అలాగే కేంద్ర ప్రభుత్వం వారికీ ఎవరికీ అందులో తప్పే కనిపించలేదు. వీళ్ళంతా ఆధునిక మనువాద ప్రతినిధులన్న మాట!

సెంట్రల్ బోర్డ్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) పాఠ్య పుస్తకంలో పది, పదకొండేళ్ళ పిల్లలు చదువుకునే పుస్తకంలో మాంసాహారం తినేవారి వల్ల సమాజంలో దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఉంది. మాంసాహారం తీసుకునేవారు అవలీలగా అబద్ధాలు చెప్తారని, ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోరని, అల్లర్లు, అలజడులు సృష్టిస్తారని, ముఖ్యంగా లైంగిక దాడులకు పాల్పడతారని, వారికి నిజాయితీ నిబద్ధత ఉండదని, ఊరికే ఆవేశపడి బూతులు మాట్లాడతారని ఉంది. ఇలా దోషాలన్నీ మాంసాహారులకు అంటగట్టి పసి మనసుల్ని ప్రభావితం చేయడం ఎంత వరకు సబబు? ఏ ఆహారం తీసుకుంటే ఏయే లాభాలున్నాయి? ఎందులో ఎన్ని నష్టాలున్నాయి? అనేది

☞ మిగతా 13వ పేజీలో



# సీరియళ్ళు.. స్త్రీలు.. సమాజం..

ఎస్. హనుమంతరెడ్డి

మాధ్యమాల్లో విలువల పతనానికి లాభాపేక్ష గల బాధ్యతారహిత పెట్టుబడిదారీ పత్రికా వ్యవస్థ ఓ కారణం. పఠన, శ్రవణ మాధ్యమాల కంటే దృశ్య మాధ్యమాల ప్రభావం తీవ్రమైంది. సీరియళ్ళు చూసేది ఎక్కువ స్త్రీలే. ఇవి వారి మెదళ్లను పాడుచేసి, సమాజాన్ని సర్వనాశనం చేస్తున్నాయి. సీరియళ్ళ కథనాలు, స్త్రీ పాత్రల చిత్రీకరణ అసహజంగా, మానవత్వ విచ్ఛిన్నంగా ఉంటున్నాయి. సమాజంలోని నైతిక విలువల ప్రభావం సీరియళ్ళలో, సీరియళ్ళ ప్రభావం సమాజంలో పరస్పరం ప్రతిఫలిస్తున్నాయి.

టీవీ సీరియళ్ళన్నీ కల్పనలే. వాటి లక్ష్యం వినోదమే. ఈ వినోదపు తీరుతెన్నులు, సామాజిక ప్రయోజకత్వం, ప్రత్యేకించి స్త్రీలపై వీటి ప్రభావం రచయిత అవగాహనపై ఆధారపడి ఉంటాయి. శాస్త్రీయ దృక్పథం, సామాజిక స్పృహ, సమాజం పట్ల బాధ్యతలు లేని రచయితలు సమాజ వినాశక రచనలు చేస్తారు. నిర్మాతలు దర్శకులు వాటిని చిత్రీకరిస్తారు. పౌరాణిక కవులు ఒక పాత్రలో ఒక గుణాన్ని ఎత్తిచూపడానికి ఆ పాత్ర మానవత్వాన్నే హత్య చేశారు. పరశురాముని పితృభక్తిలో ఆయన మాతృప్రేమను, మానవత్వాన్ని మంట కలిపారు. సీరియళ్ళ పాత్రల చిత్రీకరణలోనూ ఇదే జరుగుతోంది. 15 ఏండ్ల క్రితం ఒక మహిళా అధ్యయన సంస్థ నివేదిక ఇలా ఉంది. "ఉదయం 11 నుంచి రాత్రి 11 వరకూ కొందరు స్త్రీలు క్రమం తప్పక సీరియళ్ళు చూస్తారు. వారి ప్రవర్తనలో ఊహించని మార్పొస్తుంది. కుటుంబ సభ్యులు, బంధువులు, ఇరుగుపొరుగువారు, స్నేహితులతో సంబంధాల్లో గణనీయమైన మార్పు వస్తుంది. తోటి స్త్రీలపై నమ్మకం పోతుంది. వారితో మనసు విప్పి మాట్లాడే అలవాటు, స్నేహభావం మాయమవుతాయి. సీరియళ్ళలోని ఆడంబరతలతో తమ స్థితిగతులను పోల్చుకొని న్యూనతాభావం చోటు చేసుకుంటుంది. మానసికరోగులుగా మారతారు. సీరియళ్ళ తో ప్రయోజనం లేదని, అన్నీ నష్టాలేనని వీక్షకులు గమనించాలి." 40-60 ఏండ్లవారు సీరియళ్ళ పాత్రల్లో దూరుతున్నారు. ప్రమాదకర మానసిక స్థితికి చేరుతున్నారు. సీరియళ్ళలో స్త్రీని స్త్రీకి శత్రువుగా చూపిస్తున్నారు. అత్తాకోడళ్ళు, తోడుకోడళ్లు, అక్కాచెల్లెళ్లు, ఆడపడుచులు, అమ్మా కూతుర్లు కొట్లాడుకుంటారు. కుట్రలు పన్నుతారు. పరపతి, ఆస్తి, అధికారం, ఉద్యోగం ఉన్న మగాడిని, పెళ్ళైనవాడైనా సరే, వలలో వేసుకోడానికి చేయరాని పనులు చేస్తారు. మగాడికి ఇద్దరు పెళ్ళాలుంటారు. ఆ మగాడి అమ్మ, లేదా అమ్మాయి అమ్మ వంత పాడతారు. ఆ మగాడి తప్పేమి లేనట్లు, భార్యలతో భర్త తెగ బాధపడి పోతున్నట్లు, తీవ్ర కష్టానష్టాలు భరిస్తున్నట్లు చూపిస్తారు. గయ్యాళ్ళు కాని స్త్రీలంతా ఏడుస్తూనే ఉంటారు. ఎంత పేరు ప్రఖ్యాతులున్నా అవివాహిత స్త్రీలను ఉన్నతంగా, ఆదర్శంగా చూపరు. నీచులుగా, మగాళ్లను మోసగించేవాళ్లుగా చిత్రిస్తారు. ఇవన్నీ వాస్తవ విరుద్ధాలు. నిజజీవితానికి దూరమైనవి. సీరియళ్ళ స్త్రీలకు సౌందర్య పిచ్చి ఎక్కువన్నట్లు చూపుతారు. 24 గంటలూ అలంకరించుకునే ఉంటారు. కట్టుబొట్టు, అలంకరణ, ఆహార్యం వికారంగా, వెటకారంగా ఉంటాయి. అలాంటి ఆభరణాలు, అలంకారాలు లేని బతుకు సాధారణ స్త్రీలకు దండగనిపిస్తుంది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలు కూడా అసభ్య వస్త్రధారణతో, జుగుప్సాకర అలంకారాలతో ఉంటారు. స్త్రీలు అందంగా ఉండాలన్న భావన కల్పిస్తారు. వారి శరీరసౌందర్యానికే కాని, వృత్తి, శక్తి సామర్థ్యాలు, వ్యక్తిత్వాలకు విలువనివ్వరు. చదువుకున్న పట్టణ ప్రాంత కోడలు గ్రామీణప్రాంత తోడుకోడలు ను రాచిరంపాన పెడుతుంది. సీరియళ్ళలో శారీరక శ్రమకు విలువ ఉండదు. శ్రమ సంస్కృతిని నాశనం చేశారు. కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేశారు. చదువుకున్న స్త్రీలను సంస్కార హీనులుగా, దుర్మార్గురాళ్ళుగా చూపిస్తారు. జాతీయ భాష హిందీతో సహా ప్రాంతీయ భాషల సీరియళ్ళన్నీ ఒకేలా ఉంటాయి. హిందీ సీరియళ్ళ మహిళా నిర్మాత ఏక్తా కపూర్, స్త్రీ పాత్రలను హీనంగా చిత్రీకరించారు. ఈ ఒరవడి ఇతర సీరియళ్ళకు ప్రాకింది. మగాళ్లు మద్యపాన, వ్యభిచార ప్రియులు. స్త్రీలు వాళ్ళను సహిస్తారు. భరిస్తారు. యువ పాత్రలు గడ్డాలతో ఉంటాయి. వీటిని చూసేనేమో నేటి యువకులు పెళ్ళిలో కూడా గడ్డం తీయరు. పెళ్ళికూతుర్లు భరిస్తారు. సీరియళ్ళలో కామన్ మ్యాన్ అస్సలు కనపడడు. అంతా ధనవంతులే. ఇళ్ళు రాజభవనాలే. మానవ సంబంధాలను అమానవీకరిస్తారు. అడుగడుగునా లింగవివక్ష కన్పిస్తుంది. మోసాలు, హత్యలు, శృంగారం, క్షుద్ర పూజలు ప్రదర్శిస్తారు. పూజలు, ఆచారాలు, యజ్ఞయాగాలు, క్రతువులు,

పుట్టినరోజులు, నామకరణాలు, అక్షరాభ్యాసాలు, కర్మకాండలు ఆడంబరంగా చేయిస్తారు. ఆడంబరాలు, గుడ్డినమ్మకాలను పెంచుతున్నారు.

విరామ సమాజం హానికరం. సీరియళ్ళు విరామ సమాజపు ఫలితాలు. సమాజంలో సగమైన స్త్రీలు సీరియళ్ళ మత్తులో మునిగితే సామాజిక ప్రగతి కుంటుపడి సమాజం వెనకకు నడుస్తుంది. సీరియళ్ళలో డైలాగులు నిదానంగా పట్టి పట్టి పలుకుతారు. సాధారణంగా ఒకరు మాట్లాడేటప్పుడు మరొకరు మాట్లాడరు. ఈ లక్షణాలు మంచివే. అయితే కెమెరా ఒకరిని మార్చి ఒకరిపై నిలిపి వెలుతురు పెంచి, చుక్ చుక్ అన్న విచిత్ర శబ్దాలతో ప్రసారం చేస్తారు. ఇవి వీక్షకుల కళ్ళకు హానికరం. అరగంట సీరియల్‌లో ఐదు నిమిషాల కథ కూడా నడవదు. కాలమంతా ప్రకటనలతో, జరిగిన కథతో, జరగబోయే కథతో గడిచిపోతుంది. సీరియల్ ఏండ్ల తరబడి సాగుతుంది. వీక్షకుల కాలం వృధా అవుతుంది. వారు ఏమౌతుందోనన్న వత్తిళ్లకు లోనవుతూనే ఉంటారు. సీరియళ్ళ నిర్మాతలు విపరీత లాభార్జన పొందుతారు. మంచి సీరియళ్ళు ఉండవు కాని కొన్నింటిలో మంచి అంశాలు ఉంటాయి. ఒక సీరియల్‌లో కొడుకు వదిలేసిన కోడలుతో అత్త చాలా ప్రేమగా వ్యవహరిస్తారు. వీటిని ప్రచారం చేయాలి.

మహిళలు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాలి. స్త్రీలు పాల్గొంటేనే ఏ పనైనా విజయవంతమవుతుంది. నల్ల సాగు చట్టాల వ్యతిరేక రైతు ఉద్యమంలో స్త్రీల పాత్ర తాజా ఉదాహరణ. సీరియళ్ళ నియంత్రణ ప్రజల చేతుల్లోనే ఉంది. వీటిని చూడకపోవడమే పరిష్కారం. ప్రజల్లో సామాజిక స్పృహ, చైతన్యం పెంచటానికి పౌరసంఘాలు కృషిచేయాలి. వీక్షకులు తమను తాము సంస్కరించుకోవాలి. మంచీచెడుల అవగాహనకు రావాలి. చెడు సీరియళ్ళను చూడొద్దని ప్రచారం చేయాలి. దీనితో క్రమేపీ మంచి సీరియళ్ళు నిర్మిస్తారు. సీరియళ్ళను స్త్రీలు వినోదాత్మకంగా కాక విమర్శనాత్మకంగా చూడాలి. స్త్రీ వ్యతిరేక సీరియళ్ళకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. ఇందుకు మహిళా సమాఖ్యలు చొరవ తీసుకోవాలి. ❑

## స్త్రీలను కించపరిచిన పాఠ్యగ్రంథాలు

**(11వ పేజీ తరువాయి)**

శాస్త్రీయంగా వివరించాలి. ఆహారం ఎంచుకునే స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వాలి. అంతేగాని నైతికంగా దిగజారిన వారి లక్షణాలన్నీ గుదిగుచ్చి మాంసాహారులకు ఆపాదిస్తే అది నిజమైపోదు కదా? ఒక రకంగా చూస్తే మాంసాహారులు, శాఖాహారులు ప్రపంచంలో సమానంగా ఉండి ఉంటారు. లేదా మాంసాహారుల సంఖ్యే ఎక్కువగా ఉండి ఉంటుంది. అట్లని శాఖాహారులంతా సచ్చీలురు, సత్యవ్రతులు, సత్ప్రవర్తన గల మహనీయులు కాదు గదా? ఈ విషయమే సిబిఎస్ఇ డైరెక్టర్‌ని అడిగితే పాఠ్యాంశాలపై దేశంలో నియంత్రణ లేదని, ఒక్కో ప్రాంతంలో ఒక్కో భాషలో విషయాలు ఒక్కో రకంగా ఉన్నాయని ఒప్పుకున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఏళ్ళయిపోయినా బాలబాలికలకు చెప్పాల్సిన పాఠ్యాంశాలపై నిర్దిష్టమైన ప్రణాళిక లేకపోవడం ఘోరం! ప్రభుత్వాలు మారినప్పుడుల్లా అంశాలు, వక్రీకరణలు మారుతూ ఉండడం మరో ఘోరం!

మధ్య భారతంలోని ఛత్తీస్‌గఢ్‌లోని హైస్కూలు విద్యార్థుల పాఠ్య గ్రంథంలో 'దేశంలో నిరుద్యోగ సమస్యకు మూల కారణం– మహిళలు' అని ఉంది. 'మహిళలు అన్ని రంగాల్లో విజృంభించడం వల్ల, అన్ని రకాల ఉద్యోగాల్లో చేరుతున్నందు వల్ల పోటీ ఎక్కువైంది. అభ్యర్థుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వచ్చింది. ఫలితంగానే నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది' అని ప్రభుత్వం వారు నిర్ధారించారు. స్త్రీ, పురుషులందరూ దేశ పౌరులైనప్పుడు పౌరులకు సమాన హక్కులున్నప్పుడు అందుకు తగిన విధంగా ప్రభుత్వాలు పని చేయాలి. ఉద్యోగావకాశాలు కల్పించాలి. అంతేగాని, మహిళలు చదువుకుని ఉద్యోగాలకు పోటీ పడడం వల్ల నిరుద్యోగ సమస్య పెరిగిందనడం అసంబద్ధంగా ఉంది. స్త్రీలను గాడిదలని, వారి వల్లే ఉద్యోగాలు లేకుండా పోయాయని, మాంసాహారులంతా నీతి మాలిన వారని చెపుతూ ఏ సమాజాన్ని నిర్మించాలని ప్రభుత్వం కలలు కంటోంది? జనాభాలో సగభాగమైన మహిళలను హీనంగా చూపిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని రూపొందించగలరా? పాఠశాల స్థాయి నుండే పిల్లలకు అసత్యాలను నూరిపోస్తే పర్యవసానం ఎలా ఉంటుంది? ఎలాగైనా సరే మళ్ళీ మనువాదాన్ని నిలబెట్టే ప్రయత్నం బిజెపి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నట్టుగా లేదూ? ఇలాగైతే భవిష్యత్తు అంతా అంధకారమే కదా? అచ్చే దిన్, స్వచ్ఛ భారత్– నినాదాల కింద ఎంత మురుగు పేరుకుపోతోందో ప్రజలు తెలుసుకోవాల్సి ఉంది. ఒక్కటంటే ఒక్కటి ముందడుగు వేయకపోగా, దేశం వెయ్యడుగులు వెనక్కి వేస్తున్నట్టుగా ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులూ నిజాలు గ్రహించి, పిల్లలకు వాస్తవాలు చెప్పాలి. వారికి హేతుబద్ధంగా ఆలోచించడం నేర్పాలి. ❑



# దేవుడి కవల పిల్లలు!

**కె. శ్రీనివాసాచారి**
**మనో విజ్ఞాన శాస్త్ర అధ్యాపకులు**

మానవుడు నిత్య సత్యాన్వేషి. నిత్య సత్యాన్వేషణా క్రమంలో ప్రకృతిని గురించి మానవుడు రోజురోజుకు మరింత ఎక్కువగా అవగాహన చేసుకుంటూ ముందుకు సాగిపోతున్నాడు. ఈ కారణంగానే విజ్ఞాన శాస్త్రం (Science) పెరుగుతూ వస్తున్నది. విజ్ఞానశాస్త్రం పెరుగుతున్న స్థాయిలో మనిషి స్వేచ్ఛ కూడా వివృతమవుతున్నది; విస్తృతమౌతున్నది.

విజ్ఞానశాస్త్రం (Science) పెరగడం వల్ల ప్రకృతి గురించిన అధ్యయనం విపరీతంగా పెరిగి ఎప్పుడూ తెలియని ప్రకృతి రహస్యాలు, సత్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. ఫలితంగా నిన్న తెలియనిది నేడు, నేడు తెలియంది రేపు తెలుసుకుంటూ మనిషి క్రమ వికాసం చెందుతున్నాడు.

ఒక వైపు విజ్ఞానశాస్త్రం ప్రకృతిని గురించి, దాని సత్యాలను గురించి మదింపు వేస్తుంటే విజ్ఞాన శాస్త్ర బై ప్రాడక్ట్‌గా సాంకేతిక శాస్త్రం (Technology) మనిషి సౌకర్యవంతమైన జీవితానికి కావలసిన వస్తువులను అందిస్తున్నది. వీటన్నింటికీ కారణం మనిషే. మనిషి మెదడే. అయినా ఈ ప్రయత్నాలు చేస్తున్నది కొందరు తమలో ఉన్న సహజ హేతుత్వ శక్తిని బయటకు తీస్తున్న మనుషులు మాత్రమే. అయితే అందరూ “స్వేచ్ఛాలోచన” చేయలేకపోతున్నారు. ఎందుకు?

## స్వేచ్ఛాలోచన మనిషి నైజం !

అవును. మానవ సత్యాన్వేషణ – స్వేచ్ఛాన్వేషణే, దానికి సాధనం–స్వేచ్ఛాలోచనే. ప్రకృతి నుండి పరిణమిల్లిన మనిషి ప్రకృతినే అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడమే మనిషి గొప్పతనానికి గీటురాయి అని చెప్పవచ్చు. ప్రకృతిని ఏ మేరకు అర్థం చేసుకుంటే ఆ మేరకు మనం ప్రకృతిని జయించగలం, ప్రకృతి నిరంతరం విసిరే సవాళ్లను ఎదుర్కోగలం. సత్యం అంటే భౌతిక సత్యమే అయినప్పుడు స్వేచ్ఛ కూడా ముందుగా భౌతిక స్వేచ్ఛగా మొదలై క్రమంగా మానసిక స్వేచ్ఛకు, ఆ తరువాత భావాల స్వేచ్ఛకు దారి తీస్తుంది.

స్వేచ్ఛాన్వేషణ ఈ రోజుది కాదు. మానవుడు తనను తాను అవగాహన చేసుకున్న నాటి కంటే ముందే ప్రకృతిని పరిశీలించడం మొదలైంది. ప్రకృతి సంఘటనలను అపురూపంగా, ఆశ్చర్యంగా చూడడం మొదలైంది. అందులో జంతువులు మొక్కలు పరిసరాలు మనిషికి నిరంతరం ప్రశ్నలు విసురుతూనే ఉన్నాయి. ఆకాశం మనిషికి ఈనాటికి అద్భుతమే. వీటన్నింటినీ గమనించడంలో మనిషికి తనకు తన ఎరుక (Self Awareness) ఏర్పడింది. తనకు వస్తున్న కలలు, ఊహలు వేరే లోకాలకు సంబంధించినవనే భ్రమ (Illusion) కలిగింది. ఇలాంటి వేలాది భ్రమల ఫలితమే– దైవం (God).

## అతి పెద్ద భ్రమ - దైవమే !

ప్రకృతిని హేతుబద్ధంగా అర్థం చేసుకునే క్రమంలో మనిషి దైవమనే అతిపెద్ద భ్రమను కల్పించుకున్నాడు. భౌతిక సత్యాలను ఆవిష్కరిస్తున్న మనిషి అభౌతిక దైవాన్ని తన జీవితంలోకి ఆహ్వానించాడు. దైవం భావం అజ్ఞానం అని, తాను తప్పుడు అడుగు వేశానని గుర్తించకుండా దానికే పరమాత్మ (Ultimate Soul) అని నామకరణం చేసుకున్నాడు. తన పుట్టుక (Soul)కు ఇతర జంతువుల మొక్కల పుట్టుకకు ఆ పరమాత్మే కారణం అనుకున్నాడు. అంతటితో ఆగకుండా చివరికి నిర్జీవ జగత్తుకు కూడా ఆ పరమాత్మే కారణం అన్నాడు. ఇదంతా పరమాత్ముని సృష్టి అని నమ్మబలికాడు. మానవుని సత్యాన్వేషణ, స్వేచ్ఛాన్వేషణ క్రమంలో ఇది మొదటి విషాద సంఘటన అని చెప్పవచ్చు. ఎందుకంటే దైవ భావన మానవునిలో మొట్టమొదట ప్రత్యక్షంగా మానవ సత్యాన్వేషణ ఆసక్తిని చంపింది. ఆ తరువాత పరోక్షంగా మనిషిని మనిషి చంపుకునేలా ప్రేరేపించింది.

## దైవ భావన మనిషికి చేసిన రెండవ అపకారం !

అన్నింటి ఉనికికి కారణం దైవమే అయినప్పుడు అసలు కారణాలతో ఏం పని? అన్ని సంఘటనలకు కారణం దైవమే అయినప్పుడు జరిగిన, జరుగుతున్న సంఘటనలకు కారణాలను అన్వేషించడం ఎందుకు? అన్నింటికీ మూలం దైవమే అయినప్పుడు మానవ సంకల్పానికి విలువ ఎక్కడ? అంతా దేవుడే చేస్తున్నప్పుడు ఇక తాను మాత్రం ఏం చేయగలడు చేతులు కట్టుకొని ముడుచుకు కూర్చోవడం తప్ప?

మానవుడి స్వేచ్ఛకు, సంకల్పానికి అపరిమితమైన శక్తి సామర్థ్యాలు ఉన్నాయనే విషయాన్ని మరుగునపరచడం దైవ భావన చేసిన రెండో అతి పెద్ద విషాదం. తమ స్వేచ్ఛకు, సంకల్పానికి దైవమే సంకెళ్లు బిగించిందనే స్పృహ ఇప్పటికీ ఆధునిక మానవుడిని వదలడం లేదంటే దైవ భావన మానవ

మనస్తత్వంలో ఎంత బలంగా పెనవేసుకొని ఉందో అర్థం చేసుకోగలం. ఈ విధంగా మనిషి సృష్టించుకున్న దైవ భావం మనిషిని తోలు ఉన్న కీలుబొమ్మను చేసింది. మనిషి స్వేచ్ఛను దారుణంగా హరించి వేసింది. మరోరకంగా చెప్పాలంటే మనిషి తన సౌఖ్యం కోసం ఏర్పాటు చేసుకున్న అన్ని వ్యవస్థలు కూడా మనిషిని బానిసగానే చేశాయని మనం గుర్తించాలి. ముఖ్యంగా మానవ అజ్ఞాన ఫలితమైన దైవ భావన (Concept of God) భయము, భక్తి అనే కవల పిల్లలను ప్రసవించింది.

## భయము, భక్తి ఉండాల్సిందేనా ?


దేవుడి కవల పిల్లలు అని ఎందుకంటున్నానంటే భయం ఉన్న చోటనే భక్తి, భక్తి ఉన్నచోటనే భయం మేట వేసుకొని కూర్చుంటాయి కనుక. ఇవి రెండు ఒకటి లేకపోతే మరొకటి మనుగడ సాగించలేవు. ఇవి రెండు దైవ భావాన్ని అంటి పెట్టుకునే ఉంటాయి.

దైవ భావన చుట్టూ బిగుసుకున్న మత భావజాలం అంత మనుషుల్లో భయాన్ని భక్తిని పెంపొందించడానికే నిరంతరం పని చేస్తున్నదని చెప్పాలి. మనిషిలో భయము భక్తి లేకపోతే సమాజం అంతా అల్లకల్లోలం అవుతుందని తరచూ మనం వింటూనే ఉంటాం. గతంలో జరిగిన, నేడు జరుగుతున్న, రేపు జరగబోయే అన్ని ఉపద్రవాలకు దైవం పట్ల మతం పట్ల సాంప్రదాయాల పట్ల ఆచారాల పట్ల కట్టుబాట్ల పట్ల మనిషిలో సడలుతున్న భయ భక్తులు ఫలితమే అంటుంటారు అనేకులు. కానీ ఇందులో ఎంత మాత్రం నిజం లేదని మన అనుభవాలు చెబుతున్నాయి. భయభక్తులు కలిగిన వారే అత్యధికంగా హింసకు, దౌర్జన్యాలకు, దోపిడీలకు, హత్యలకు పాల్పడుతున్నట్లు ప్రపంచ గణాంకాలు చెబుతున్నాయి. అసలు దైవభావనే మనుషుల్లో విభజనకు సిసలైన కారణమని నా ప్రగాఢ విశ్వాసం. దైవ భావన ప్రజలలో ఎంతగా విస్తృతంగా ప్రబలుతున్న కొద్దీ దైవాలు (Godes) కోకొల్లలుగా వెలుస్తున్నాయి. ప్రపంచంలో ఉన్న దైవాలను లెక్కించ తరమా చెప్పండి? ఒక్కో దైవం చుట్టూ ఒక్కో కోటరీ ఏర్పడింది. దైవం చుట్టూ ఆంక్షల పేరుతో ఆచారాలు మత రూపంలో వ్యవస్థీకరణ చెందాయి. వాటి ఫలితంగానే మనుషులు స్వ మనుషులని, పర మనుషులని లేదా స్వ మతస్తులని, అన్యమతస్తులని రెండు మూకలు (Mobs) గా ఏర్పడి తమను తాము మనుషులం అనే సంగతి మరచి పోయి–తామే నిజమైన దైవజనులమని పవిత్ర యుద్ధాలు (Crusades) చేస్తున్నారు. నిజానికి ప్రపంచంలో ఏ మూలన ఏ పేరుతో ఏ స్థాయిలో జరిగే యుద్ధాలైన హింస అయినా మత యుద్ధాలే అని మనము గుర్తించవలసి ఉంటుంది. బయటకు ఏ వంకతో చేసేవైనా కానీయండి, వారిలో వారు ఏ పేరైనా పెట్టుకోనీయండి. అవన్నీ తమ దైవాన్ని వీలైనంత ఎక్కువ మంది తల మీద ఎక్కించడానికే అనే సంగతి మనం మరువరాదు. అజ్ఞానం మనిషి తలఎక్కితే విజ్ఞానం హేతువు క్రమంగా దారితప్పి మనిషి మెదడు అంతా మౌఢ్యం విస్తరిస్తుంది. ఒక్క మనిషి భ్రమ పడితే పిచ్చి అంటాం కదా! కోట్లాది ప్రజలు సామూహికంగా భ్రమ పడితే ఏమనాలి?

## మనం ఏమి చేయాలి ?

1. ఈ విశ్వానికి మూలం దైవం కాదనే నిజాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.
2. దైవ భావన కేవలం భావనే (Concept) తప్ప దానికి ఎలాంటి ఉనికి లేదని తెలుసుకోవాలి.
3. మనిషి తన భవితకు తానే కర్త అని, ఏ వ్యవస్థకు, ఏ వ్యక్తికి, ఏ సిద్ధాంతానికి, ఏ విధానానికి ఏ కాలంలోనూ బానిస కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.
4. మనిషిని ముందుకు నడుపుతున్నది ప్రకృతి పరంగా వచ్చిన హేతువాద శక్తి, మానవవాద స్పృహ అనే విషయం అనుక్షణం గుర్తెరిగి ప్రవర్తించాలి.
5. తోటి మానవుల పట్ల సామరస్య భావాన్ని ప్రకటించాలి.
6. గతమంటూ, మతమంటూ మానవత్వాన్ని మట్టుబెట్టే ఆలోచనలు మానుకోవాలి.
7. సహకార భావం వల్ల మాత్రమే మానవ ప్రగతి జరుగుతుందని తెలుసుకోవాలి.
8. విజ్ఞాన శాస్త్రం మాత్రమే సర్వమానవ సంక్షేమాన్ని అభివృద్ధిని సాధించగలిగే ఏకైక సాధనమని గుర్తించాలి.
9. స్వతంత్రఆలోచన, స్వేచ్ఛాలోచనా ధోరణి పెంచుకోవాలి. ఇతరులలో ప్రోత్సహించాలి.
10. ఆధునిక విజ్ఞాన శాస్త్రలన్నింటిని జీవితానికి సమన్వయం చేసుకుంటూ ఆనందకరమైన, సుఖకరమైన, సౌకర్యవంతమైన జీవితాన్ని సుసంపన్నం చేసుకోవాలి.
11. జాతీయ భావన, పార్టీ భావన, అధికార లాలస మానవ స్వామ్యానికి గొడ్డలిపెట్టు అని గుర్తించాలి.
12. విశ్వమానవ హక్కులను గుర్తించి గౌరవించాలి.

చివరగా దైవ భావము, భయము, భక్తి, మతము ఇవేవీ కూడా మానవుని నైతిక ప్రవర్తనకు మూలము కానేరవు. నైతిక ప్రవర్తన పూర్తిగా మానవుడికి సంబంధించినది. అంటే మానవికం. మానవవిలువలు, నైతిక విలువలు ఈ లోకానికి సంబంధించినవి. అంటే లౌకికమైనవి అని అర్థం. భయము భక్తి అనేవి మానవ జీవితాన్ని దుర్భరం చేస్తాయి తప్ప గొప్పగా తీర్చిదిద్దలేవు. ఎవరో శిక్షిస్తారనే భయం, మరెవరి మీదో భక్తి భావన మానవుల మంచి ప్రవర్తనకు, నైతిక వర్తనకు దారి తీయదు. అలా అనుకోవడమే పూర్తిగా భ్రమ. ❏




# రొమిలా థాపర్ అసమ్మతి స్వరం

కొప్పర్తి వెంకట రమణమూర్తి

ప్రశ్నించడమూ, అసమ్మతి తెలియచెయ్యడమూ, విభిన్నమైన గొంతును వినిపించడమూ నేరమౌతున్న కాలంలో, పశ్చిమం నుంచే అసమ్మతి దేశంలోకి ప్రవేశించిందని అంతకు ముందు అసలది ఇక్కడ లేనేలేదని బుకాయిస్తున్న కాలంలో ఆ వాదనని సాధికారికంగా పూర్వపక్షం చేశారు ప్రముఖ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ తన కొత్త పుస్తకం Voices of Dissentలో. పరిచయం అవసరం లేని ఈ ప్రజామేధావి ప్రజాస్వామ్యానికీ లౌకికత్వానికి భంగం వాటిల్లిన అనేక సందర్భాలలో తన తిరుగుబాటు స్వరంతో పతాక శీర్షికల్లో నిలిచారు. మళ్లీ ఇప్పుడు అక్టోబరు 2020లో మన దేశంలో విడుదలై మార్చి 2021 లో అంతర్జాతీయ మార్కెట్‌లో విడుదల కాబోతున్న నూట డెబ్భై ఐదు పేజీల ఈ సుదీర్ఘ వ్యాసంలో భారతదేశ చరిత్ర పొడవునా వినిపించిన అసమ్మతి స్వరాలను సోదాహరణంగా ఉపపత్తులతో నిరూపించారు. ఎవరో ప్రవేశించేవరకూ ఇక్కడ అసమ్మతి లేదంటూ దీన్నొక అఖండ సంస్కృతిగా చిత్రీకరిస్తూ ఇప్పుడు కూడా అసమ్మతిని రూపుమాపడానికి జరుగుతున్న ప్రయత్నాల మీద అసమ్మతి అస్త్రంగా ఈ వ్యాసాన్ని ప్రయోగించారు.






ఆమోదం పొందిన భావనలు, సిద్ధాంతాలు, సంప్రదాయాలు, నమ్మకాల పట్ల అసమ్మతి అన్ని సమాజాల్లోనూ నాగరికతల్లోనూ ఉందనీ అది మరీ ముఖ్యంగా జ్ఞానాన్వేషణలో, తాత్త్విక దృక్పథంలో స్పష్టంగా కనిపిస్తుందనీ అంటారు ఈ జె ఎన్ యూ ఎమిరిటస్ ప్రొఫెసర్. ఇందుకు భారతదేశం మినహాయింపు కాదనీ అంటూ భారతీయ చింతనలో అది సమ్మిళితమై తద్వారా దాన్ని సంపద్వంతం చేసిందని కూడా అంటున్నారు. అసమ్మతి చైతన్యమూ అది నిర్వహించిన పాత్ర భారత చరిత్ర అధ్యయనంలో తగినంత గుర్తింపు పొందలేదని అంటున్న ఈ క్లుగ్ బహుమతి విజేత తన తొలినాళ్ల పరిశోధనల్లో రేఖామాత్రంగా చోటు చేసుకున్న ఈ అంశానికి ఈ వ్యాసంలో నిర్దిష్ట రూపాన్నివ్వడం ద్వారా వర్తమానంలోని అసమ్మతికి ఉపోద్ఘాతం భారతీయ గతంలో ఉన్నదని చెప్పదలిచానంటున్నారు.

థాపర్ అభిప్రాయంలో ఒక వ్యక్తి కానీ, ఒక సమూహం కానీ తమ మీద ఆధిపత్యం చెలాయించే లేదా తమ జీవితాల్ని ప్రభావితం చేసే వ్యవస్థల పట్ల వాటి విధివిధానాల పట్ల అనంగీకారమూ లేదా అసంతృప్తి కలిగి ఉండడవే అసమ్మతి (dissent). అసమ్మతి కొత్త భావన కానే కాదు, కానీ దాని అనేక పార్శ్వాలని గుర్తించడం కొత్త. నిజమైన ప్రజాస్వామిక సమాజంలో ఆ ప్రక్రియ నిరాకరింపబడదు. ప్రశ్నించే హక్కును ఇప్పుడైతే ప్రతీ పౌరుడూ ఉపయోగించుకో గలుగుతున్నాడు కానీ, గతంలో అది బలవంతులు మాత్రమే పొందగలిగినది. ఆధునిక సమాజాల్లో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ లో భాగంగా పౌరులందరికీ ఈ హక్కు ఉండాల్సి ఉంది. అయితే ఈ ప్రశ్నించే హక్కే చరిత్రలో నిరంతరం ప్రశ్నించబడింది. నిరాకరింపబడింది. మనమెంత కాదనుకున్నా భారతీయ సమాజం చరిత్ర పొడవునా వైరుధ్యాలు లేని అద్భుత సామరస్యంతో ఏమీ మనలేదు. మనకూ మన భాగం అసహనం, హింస, భావ సంఘర్షణ ఉన్నాయి. అసమ్మతి స్వరాల సంఖ్య, విస్తృతి కూడా మనం అంగీకరించడానికి సిద్ధంగా ఉన్న దానికన్నా ఎక్కువే ఉంది.

చారిత్రకంగా సామాజిక సంబంధాలు భూమి, సంపద, కర్మకాండలు మొదలైన అధికార కేంద్రాలను చేజికించుకున్న వర్గాలు వాటిని దక్కించుకోలేని వర్గాల నడుమ నెలకొని ఉండేవి. ఉదాహరణకు రాజు–ప్రజలు, భూస్వామి–రైతు, ఫాక్టరీ యజమాని–ఉద్యోగి, వలసాధిపతి–వలస ప్రజ ఇట్లా. అయితే

రెండు వందల సంవత్సరాల క్రితం పారిశ్రామికీకరణ, పెట్టుబడిదారీ విధానం, మధ్యతరగతి ఆవిర్భావం, కార్మికవర్గ అవతరణల పర్యవసానంగా ఒక చారిత్రక పరిమార్పు సంభవించి నూతన సమాజం అవతరించింది. ఈ పరిమార్పుకు ప్రజలు తామంతా ఒక జాతికి చెందినవారమనే జాతీయభావం ప్రోద్బలం చేసింది. ఈ జాతీయతలో ఇమిడి ఉన్న మూలకం పాత వ్యవస్థను విచ్ఛిన్నం చేసి ప్రజలందరు పౌరులు అనీ, వాళ్లంతా కలిసి సృష్టించుకున్న రాజ్యం అనీ రెండు కొత్త వ్యవస్థల్ని నిర్మించింది. వాటి మధ్య సంబంధాలే సామాజిక గమన సూత్రాలయ్యాయి. రాచరికాలు పడిపోయి ప్రజాస్వామ్యాలు ఏర్పడడం ఈ చారిత్రక దశలో ముఖ్య ఘట్టం. ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలలోనూ ప్రతి పౌరుడికీ సమాన హక్కుతో ప్రాతినిథ్యం ఉండడం వల్ల అవి లౌకికంగా మాత్రమే ఉండగలవు. ఈ లక్షణం. లౌకికత్వాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ, జాతీయతనీ ముప్పేటలా ముడివేస్తుంది. నిజమైన ప్రజాస్వామ్యంలో అసమ్మతి ప్రకటించే హక్కు, సామాజిక న్యాయాన్ని కోరే హక్కు కేంద్ర బిందువులుగా ఉంటాయి.

అసమ్మతి పాశ్చాత్యుల రాకతోనే దేశంలోకి ప్రవేశించిందంటారు కొందరు. ఈ వాదన చేసే వారి దృష్టిలో భారతీయ గతం అపవాదాలకు అతీతమైంది. అందువల్ల అక్కడ అసమ్మతి లేదు, ఉండదు. అదొక అద్భుతమైన నాగరికత. ఉత్కృష్టమైన సంస్కృతి. వారిది వెల కట్టలేని ఘనత. అది దోష రహితం. సర్వజన సమ్మతం. దాని మూలాలన్నీ ఆ నేలలోనే ఉన్నాయి. దాని జ్ఞాన వ్యక్తీకరణ అంతా ఆ ఒక్క భాషలోనే జరిగింది. ఆ ఏకైక మతమే దానికంతటికీ ఒక అస్తిత్వాన్నిచ్చింది. ఆ న్యాయస్మృతే ఆ వ్యవస్థకొక నిర్మాణాన్నిచ్చింది.

అయితే మరికొందరు. ఏకశిలాసదృశమైన ఈ అభిప్రాయాన్ని ఖండించి, సవాళ్లనూ, అసమ్మతిని ఎదుర్కొనకుండా ఏ నాగరికత వికసించలేదని ప్రతిపాదించారు. అసమ్మతిని ఎంత లోచూపుతో అర్థం చేసుకుంటే సమ్మతి అంత సమగ్రంగా అర్థమౌతుందన్నారు. వీటికి పేరు పెడుతూ సమ్మతిని 'నేను' (the Self) అనీ, అసమ్మతిని 'ఇతరులు' (the Other) అనీ అన్నారు థాపర్. ఈ మొత్తం వైనాన్ని విశదం చెయ్యడానికి మతానికి సమాజానికి ఉన్న సంబంధాల మీద 'నేను' కు 'ఇతరుల' కు ఉన్న వైవిధ్యాన్ని అంచనా వెయ్యడానికి కొన్ని ఉదాహరణలను వివరించారు ఈ వ్యాసంలో. ఇందుకు హింసాత్మకం వైపు పోకుండా అహింసాపూర్వక సంఘటనలను ఎంచు కున్నట్లు చెప్పారు.

కొందరిని ఇతరులుగా గుర్తించడం వల్ల కొందరికి కొన్ని ప్రయోజనాలు ఉంటాయి. వారిని మార్జిన్ అవతలకి నెట్టేయవచ్చు. నిషేధిత ప్రాంతాలకూ అవసరమైతే దేశాంతరవాసానికి పంపవచ్చు. దేశ పౌరసత్వాన్ని నిరాకరించవచ్చు. కొందరిని ఇతరులుగా చూడడమనేది గతంలో లేకపోలేదు. మన నాగరికత లన్నీ రకరకాల పోగులతో అల్లిన దారాలే. ఆ పాయలలో కొన్ని సంస్కృతిలోనే పుట్టినవైతే మరికొన్ని వలసల రూపంలో బయటి నుంచి వచ్చి చేరినవి. కాగా, రాజ్యాన్నీ, దేశాన్నీ కాదని ఇతర ప్రాంతాలకు తరలివెళ్లి స్థాపించుకున్న వలసలూ ఉన్నాయి. ఈ క్రమంలో 'నేను' 'ఇతరుల' స్థితులు స్థాన భ్రంశం చెంది ఉండవచ్చు కానీ అసలంటూ లేకపోలేదు అంటున్నారు థాపర్.

ఇందుకు థాపర్ ఆధునిక యుగ పూర్వ చరిత్ర నుంచి ఒక్కో సహస్రాబ్దికి ఒక్కో ఉదాహరణగా మూడింటినీ, ఆధునిక యుగం నుంచి రెండింటినీ తీసుకున్నారు. దీని విస్తృతి దాసి పుత్ర సమస్య దగ్గర మొదలై షహీన్ బాగ్ ఉద్యమం దాకా సాగింది. ఇందులో గాంధీ సత్యాగ్రహాన్ని ఒక ప్రధాన అసమ్మతిగా గుర్తించి విశ్లేషించారు. ఆ ఉదాహరణలని సంక్షిప్తంగా చూద్దాం.

మొదటిది క్రీపూ రెండవ సహస్రాబ్దికి చెందింది. ఇది భిన్న సంస్కృతికి చెందిన దాసి పుత్రుడు బ్రాహ్మణుడు కావడం గురించి. అప్పటి ప్రబల మతం వేదానుగుణంగా బ్రాహ్మణుల చేత నడుపబడుతూ వారికి మాత్రమే ఆ నిర్వహించే హక్కును దఖలు పరిచింది. ఇప్పటి కొందరి అభిప్రాయంలో అప్పటికి ఒకే సంస్కృతి నెలకొని ఉండేది. కానీ, రుగ్వేదం ఆర్యులు కాక దాసదస్యులు అనే భిన్నమైన ప్రజల్ని పదేపదే ప్రస్తావించింది. ఎవరీ దాసులు ? వీళ్లు ఆర్య భాష సంస్కృతం మాట్లాడలేని ఇతరులు. అమానుషులు. రాక్షసులు. యజ్ఞ యాగాలను చెయ్యరు. ఇతర దేవతలను పూజిస్తారు. విగ్రహారాధకులు. లింగ పూజ చేస్తారు. వారికి తాంత్రిక విద్య తెలుసు. వారంటే అయిష్టం. కొంచెం అసూయ. వారిలో కొందరికి పశుసంపద ఉంది. పురాలు ఉన్నాయి. ఇంతకీ ఎవరీ దాసులు ? గుర్తించడం కష్టం కానీ, పురావస్తు పరిశోధనలు వైవిధ్య భరిత సంస్కృతుల మూలాలను బహిర్గతం చేస్తున్నాయి. వేద సంచయాన్ని అనుసరించి చూస్తే దాసులు స్థానికులనీ, దేశంలోకి ప్రవేశించి నిలదొక్కుకున్న ఆర్యులతో వీరికి సంపర్కం కుదిరి సామాజిక విభజన జరిగిందని అర్థమౌతుంది. ఆధిక్యం ఉన్నవాళ్లూ ధనికులు ఆర్యులలో కలిసిపోగా పేదలు సేవలకు పరిమితమయ్యారు. దాస స్త్రీలు ఆర్య గృహాలలో దాసీలయ్యారు. సంఘర్షణల్లో పట్టుబడినపుడు

భార్యలయ్యారు. బానిసలయ్యారు. ఈ సందర్భంగానే 'దాసి పుత్ర బ్రాహ్మణుడు' అనే మాట వినిపిస్తుంది. రుగ్వేదంలో కొన్ని రుక్కులు రాసిన రుషి కక్షీవంతుడు దీర్ఘతమస్సుడనే బ్రాహ్మణుడికీ ఉషిజ అనే దాసి భార్యకు జన్మించాడు. ఐతరేయ బ్రాహ్మణాన్ని అనుసరించి రుషి కావశ ఐలూషుడు దాసి పుత్రుడు. సోమ క్రతు నిర్వహణకు అనర్హుడిగా ప్రకటింపబడ్డాడు. అతను నిర్గమిస్తూ కొన్ని శ్లోకాలను గానం చేసే సరికి సరస్వతి అతని వెంట ప్రవహించింది. బ్రాహ్మణులు అతన్ని దేవతలకు ప్రియమైన వాడిగా గుర్తించి తమలో కలుపుకున్నారు. సత్యకామ జాబాలి కథ ఉండనే ఉంది. ఇవన్నీ సమ్మతి, అసమ్మతి సంస్కృతుల మధ్య జరిగిన సంభాషణలకు నిదర్శనాలు. 'ఇతరులు' ' నేను' లో మిళితమైన సందర్భాలు.

రెండవ ఉదాహరణ క్రీపూ మొదటి సహస్రాబ్దికి చెందింది. ఇది అస్తిత్వంలో ఉన్న ఒక నేనుకు ప్రత్యామ్నాయంగా అందులో నుంచే ఇతరం ఆవిర్భవించి ఆదరణ పొంది అదే నేనుగా మారినపుడు అందులో నుంచే దానికి అనేక ఇతరాలు ఆవిర్భవించడం, చివరికి మొదటి నేను ఇతరంను అనుకరించి నూతన నేనుగా నిలదొక్కుకోవడం ఇక్కడి కథాంశం. ఇక్కడ తొలి నేను వైదిక మతం. ఇతరులు శ్రమణులు. వారి నుంచి పుట్టిన ఇతరులు ఆయా మతశాఖలు. చివరికి నేనుగా నిలదొక్కుకున్న మొదటి నేను మారిన రూపమే పౌరాణిక హిందూమతం. జైనులు, బౌద్ధులు, అజవికులు అందర్నీ కలిపి శ్రమణులన్నారు. చార్వాకుల్ని కూడా కొందరు వీరిలో కలుపుతారు. వీళ్లంతా వైదిక బ్రాహ్మణ మతాన్ని నిరసించారు. వారి దేవతల్ని ప్రశ్నించారు. యజ్ఞ నిర్వహణను ఖండించారు. వైదిక సాహిత్యం వీళ్లని నాస్తికులనీ, అవిశ్వాసులని నిందించింది. బ్రాహ్మణేతర మతాల వారిని శతాబ్దాల పాటు నాస్తికులనే అన్నారు కదా. శ్రమణ మతాలు అగ్ర వర్ణాలకెంత అవకాశం కల్పించాయో నిమ్నవర్ణాలకూ అంతే అవకాశం కల్పించాయి. కర్మకాండల ప్రాధాన్యత తగ్గించబడింది. వాటి నిర్వహణలో వర్ణ గుత్తాధిపత్యం రద్దు చేయబడింది. సమ్మతి అసమ్మతుల నడుమ స్పర్థ ఉచ్ఛ స్థితి నందుకున్నట్లు ఆధారాలు చెబుతున్నయ్. గ్రీకు రాయబారి మెగస్తనీస్ దేశంలో ఏడు కులాలు ఉన్నాయంటూ బ్రాహ్మణుల్నీ, శ్రమణుల్నీ అగ్రస్థానంలో నిలబెట్టాడు. శ్రమణుల్ని తాత్వికులన్నాడు. అశోకుడి శాసనాలు పదే పదే బ్రాహ్మణ శ్రమణ సామరస్యాన్ని కాంక్షించాయి. పతంజలి బ్రాహ్మణ శ్రమణ వైరాన్ని పాము ముంగిస వైరంతో పోల్చాడు. ఇక్కణ్ణుంచీ మొదలై నేను' ను త్రోసిరాజని ఇతరులు' దూసుకెళ్లారు. శ్రమణ మతాలు రాజాదరణ వర్తకాదరణ చివరికి ప్రజాదరణ పొందాయి. శ్రమణులు తమ నిష్ఠతో ప్రజల నమ్మకం పొందారు. వారి స్థాపాలు విహారాలు ఆరామాలు నిర్మితమై మోక్ష కేంద్రాలయ్యాయి. వైదికం వెనక్కు తగ్గింది. సమ్మతి నుంచి పుట్టిన అసమ్మతి సమ్మతిస్థాయి నందుకున్న అరుదైన సందర్భమిది. శ్రమణుల్లో బలమైన విభాగాలు తమను అనుసరించిన వారి రాజకీయాల్లో జోక్యం చేసుకున్నాయ్. సమాజం నుంచి తమను తాము దూరం చేసుకున్న పరిత్యాగులు మళ్లీ తిరిగి సమాజ సంక్షేమానికి పాటుపడడం అప్పుడు మొదలై ఇప్పటికీ కొనసాగుతోంది.

ఆకాశంలోకి విసరబడిన రాయి ఉచ్ఛదశ నందుకున్నాక కింద పడడం మొదలైనట్లు శ్రమణ మతాల పతనం ప్రారంభ మైంది. అసమ్మతి మతాలలోకి సమ్మతి లక్షణాలు ప్రవేశించి అందులో నుంచి 'ఇతరులు' బయలుదేరారు. బౌద్ధం హీనయాన మహాయానాది తెగలుగా విడిపోయింది. జైనమూ ముక్కలయ్యింది. శ్రమణుల నిష్ఠ సందేహాస్పదమైంది. ఈ నేపథ్యంలో వైదికమతం శ్రమణమతాల స్ఫూర్తితో మొదట భాగవత మతంగా క్రమంగా శైవ వైష్ణవాల రాకతో పురాణ లేదా పౌరాణిక మతంగా మార్పు చెందింది. పౌరాణిక మతంలో చాలా శ్రమణ లక్షణాలు చేరాయి. పురాణమత మూల గ్రంథాలైన పురాణాలు మొదట సులభ సంస్కృతంలో తర్వాత్తర్వాత స్థానిక భాషల్లో రాయబడ్డాయి. వేదాల మాదిరి కాకుండా ఇవి అన్ని వర్ణాల ప్రజలకు వినిపించబడ్డాయి. వైదిక కాలానికి భిన్నంగా విగ్రహారాధనను అంగీకరించాయి. దేవాలయ నిర్మాణం ప్రారంభ మైంది. ఇవన్నీ శ్రమణసంప్రదాయ స్ఫూర్తితో జరిగిన పరిణామాలే! అసమ్మతి ప్రభావంతో సమ్మతిలో మార్పులు జరుగుతాయనడానికి ఇది ఉదాహరణ. విశాలమైన భూములూ, భూరి విరాళాలు అందుకున్న శ్రమణులు 'ఇతరులు'గా నిర్వర్తించే పాత్రను విస్మరించారు. క్రమంగా రాజాదరణ శ్రమణమతాల నుంచి పౌరాణిక మతం వైపు మళ్లింది. ఈ దశలోనే వర్తక వాణిజ్యాల పతనంతో వ్యాపార వర్గాల ఆదరణ పొందిన శ్రమణ మతాలు క్షీణదశ పట్టాయి. అవిప్పుడు ఏ మాత్రమూ అసమ్మతి మతాలు కావు అందులో నుంచే అనేక చిన్న చిన్న అసమ్మతులు పుట్టాయి. క్రమంగా పౌరాణిక మతమూ అందుకు మినహాయింపు కాలేక పోయింది. శైవ, వైష్ణవ, శాక్త, శక్తి, కాపాలిక, పాశుపత అంటూ చీలింది. ఫలితం అందరికీ ఆమోదయోగ్యమైన ఏకైక మతం కానీ, ఏకైక పవిత్ర గ్రంథం కానీ లేకపోవడం. ఏది ఏమైనా ఇది సమ్మతి అసమ్మతుల మధ్య శతాబ్దాలపాటు సుదీర్ఘంగా జరిగిన సంభాషణ. ఇందులో ఎవరెంత ఇచ్చిందీ పుచ్చుకున్నదీ తేల్చడం

కష్టం. యుగం పొడవునా సమ్మతి, అసమ్మతి ఉండడం మాత్రం వాస్తవం.

ఇతరత్వం అనేది అన్నిసార్లూ 'నేను' మీద తిరుగుబాటు కాకపోవచ్చునంటారు థాపర్. ఒక్కోసారి 'నేను' ఉద్దేశ్యపూరితంగా 'ఇతరుల్ని' సృష్టిస్తుంది. చాలా సమాజాలు కొందరిని సేవకులుగా మార్చుకోవడానికి ఈ పద్ధతిని పాటిస్తాయి. వారిని లొంగదీసుకోవడానికీ, సేవకత్వంలోకి నెట్టడానికీ, లేదా బహిష్కరించడానికి ఉద్దేశిస్తాయి. వారికి స్వేచ్ఛ, హక్కులు లేకుండా చేస్తాయి. ఇట్లా సృష్టించబడిన సామాజిక అంతరం అసమ్మతిగా పరిణమిస్తుంది. ఈ తరగతికి చెందినవారే నిమ్న కులస్థులు, అంటరానివారు, ఆదివాసీలు అంటున్నారు ఈ వ్యాస రచయిత్రి.

మూడవ ఉదాహరణ క్రీశ రెండవ సహస్రాబ్దికి చెందింది. క్రీ.శ. 15,16 శతాబ్దాలకు చెందిన ఈ పరిణామంలో అనేక సమ్మతులూ, అనేక అసమ్మతులూ ఉన్నాయి. ఇది భారతదేశ మతచరిత్రలో ఒక గొప్ప ఘట్టం. మతానికీ సమాజానికి జరిగిన అపూర్వ సంభాషణ. సమాజం అనేక సంస్కృతులతో సమ్మిళితమైన ఈ సందర్భం బోధనల్లో, పద్యాల్లో, గీతాల్లో, గానాల్లో ప్రతిఫలించింది. భక్తి , సూఫీ ఉద్యమాల పేరిట ఉపఖండమంతా విస్తరించిన ఈ చైతన్యంలో సంత్‌లని, పీర్‌లని పిలువబడిన మతగురువులదే ప్రధాన పాత్ర. వీళ్లంతా అప్పటికి అస్తిత్వంలో ఉన్న ప్రధాన మతాలైన పురాణ హైందవానికీ, ఇస్లాంకీ ఇతరులు. దీనికి దేశంలోనే రూపుదిద్దుకుంటున్న తాత్విక చింతన కొంత కారణమైతే, మధ్య ఆసియా, పర్షియాల నుంచి వచ్చిన ఆలోచనలు కొంత కారణమయ్యాయి. మొత్తం మీద మత సామాజిక రంగాల మీద దేదీప్యమానమైన వెలుగు ప్రసరించిందీ యుగంలో.

ఒకేసారి అనేక నేనులు అనేక ఇతరాలు ఉన్న కాలంలో ఈ వేర్వేరు విశ్వాసాలకు సౌకర్యం కోసం హిందు అనీ, ముస్లిం అనీ సార్వత్రిక ఉల్లాకు (లేబుల్) లంటించబడిన దశ ఇది. కలగాపులగమైన మూలాల నుంచి వచ్చిన విశ్వాసాలను ఆ రెండు మతాలుగా ముడిపెట్టే వేగిరపాటులో వాటి మధ్య ఉన్న సున్నితమైన వైరుధ్యాలను, సందిగ్ధతలను, మార్మికతను విస్మరించిన స్థితి ఇది. బ్రాహ్మణాధిక్యతతో, భారీ దేవాలయాలతో అపారమైన సంపదతో రాజకీయంలో సమాజంలో జోక్యం చేసుకోగలిగిన ఆధిక్యతతో అలరారుతున్న పురాణ హైందవం సమ్మతి అయితే, ప్రధానంగా మధ్యస్థాయి కులాల నుంచి లేదా అవర్ణాల నుంచీ వచ్చిన కబీరు, దాదు, రవిదాస్, చోఖమేళ, చైతన్యుడు, నానక్ వంటి సంత్‌లు ఒక ప్రధాన దేవత లేక అమూర్త భావన కేంద్రాలుగా కర్మకాండలకన్న భక్తి కలిగి ఉండడమే ప్రధాన లక్షణంగా భక్తి ఉద్యమం పేరిట సాగించిన తాత్విక తిరుగుబాటు ఈ యుగ అసమ్మతి. ప్రధాన ఇస్లాం శాఖలు సమ్మతి అయితే, నమాజ్ మీద, హజ్ యాత్రల మీద, ఉపవాసాల మీద అవిశ్వాసంతో అహింస, భక్తి, సంయమనం వంటి లక్షణాలను అంది పుచ్చుకున్న సూఫీతత్వం మరొక అసమ్మతి. ఈ రెండిటి మూలాలు ఒకనాటి శ్రమణ సంస్కృతిలో ఉన్నట్టు అనిపిస్తుంది. భక్త సంత్‌లు గానీ, సూఫీ పీర్‌లు గానీ కొత్త మతాల్ని స్థాపించలేదు. వాళ్లు మతాన్నీ తత్వాన్నీ ఆధిపత్య వర్గాలనుంచి విముక్త చేసే ప్రయత్నం చేశారు. కులవివక్షను తోసిపుచ్చారు. తమ శిష్యులు ఏ మతానికి చెందిన వారనే విషయాన్ని గణించలేదు. ప్రజల భాషలో గొంతు విప్పారు. కబీరుకు దైవం రూపరహితం. నానక్‌కూ అంతే. కొందరికి కృష్ణుడు. రవిదాస్ స్వప్నం సామాజిక అసమానతలు లేని ఒక నగరం. కాశ్మీరుకు చెందిన లాల్ దేద్ బోధనలు నంద రుషి అని పిలువబడిన షేక్ నూరుద్దీన్ అనే సూఫీ కవిని ప్రభావితం చేశాయి. నానక్ భావనల మీద సూఫీ గురువు బాబా ఫరీద్‌తో పాటు కబీరు రవిదాస్‌ల ప్రభావం కూడా ఉంది. ఈ ఆదాన ప్రదానాలు, అంతర్నిహిత చైతన్యాలూ ఈ యుగ భావనల్ని ఉద్దీపింప చేశాయి. ఇవి వర్తమానంలో తలెత్తిన అనేక ప్రశ్నలకు సమాధానాలు సూచిస్తున్నాయి. ఇందులో రాధ కేంద్రంగా సాగిన రాధాకృష్ణ భక్తి సంప్రదాయం స్త్రీ అస్తిత్వాన్ని గుర్తించింది. లాల్ దేద్, మీరాబాయ్ వంటి మహిళా బోధకుల్ని అంగీకరించడం కూడా అంత తేలికగా జరగలేదు. అది అటుంచితే , బుల్లేషా, మాలిక్ మహమ్మద్ జైసీ, సయ్యద్ ముబారక్ ఆలి బిల్ గ్రామీ వంటి వారు తమ కృష్ణభక్తిని ప్రదర్శిస్తూ అద్భుతమైన గీతాలు రాశారు. అవి ఇప్పటికీ హిందూస్తానీ సంగీత కచేరీలలో, నాట్య ప్రదర్శనల్లో గానం చేయబడుతూనే ఉన్నాయ్. వీళ్లని ఆధునిక చరిత్రకారులు ముస్లిం వైష్ణవులని అన్నారు గానీ, వీరు మాత్రం తమను కృష్ణభక్తులుగానే పిలుచుకున్నారు. భారతీయ సంస్కృతికి ఇస్తున్న సమకాలీన సంకుచిత నిర్వచనం కన్న ఇది భిన్నమైంది. అట్లాగే, మొఘల్ రాజపుత్ర సంబంధాలు కేవలం రాజకీయమైనవి కావు. ఇండో పర్షియన్ లేదా మొఘల్ రాజపుత్ర శిల్పకళా శైలీ సమ్మేళనంతో నిర్మించబడిన బృందావనంలోని గోవింద దేవుని ఆలయం ఇందుకు ఉదాహరణ. ఈ దేవాలయ నిర్వహణకు రెండు వర్గాల నుంచి లభించిన ఆదరణలో రాజకీయాలను మించిన ఆత్మ సంలీనం ఏదో ఉంది. అది అట్లా ఉంచితే ఈ దశలో పురాణ హైందవం స్వయంప్రతిపత్తి శాఖలుగా ఎదగగలిగిన కొన్నిటిని తనలో విలీనం చేసుకుంది. ఒడిశాలో

జగన్నాథ ఆరాధన, మహారాష్ట్ర లో విఠల భక్తి, సింధ్‌లో హింగ్లజ్ మఠం, సుందర్బన్ బోనీబీబీ భక్తి ఈ కోవలోనివే. ఇవన్నీ పురాణ హిందూ మతంలోకి అతుకులుగా కుట్టబడ్డాయి. ఇవి స్థానిక మతాలుగా తమ అస్తిత్వాన్ని నిలుపుకుంటూ కొన్ని సందర్భాల్లో పురాణ వాచకాల కన్న భిన్నమైన గొంతును వినిపించాయి.

ఇక మహమ్మదీయులు ఇస్లాం మత అనుయాయులుగా ఎప్పుడూ ఇతరులుగానే చూడబడడం గురించి. నిజానికి ఈ రెండు మతాల మధ్య సమ్మతి అసమ్మతి, సర్దుబాటు తిరుగుబాటుల స్వరూపం మనం అనుకున్న దానికన్నా సంక్లిష్టంగా ఉంది. ఇస్లాంతో సంబంధం ఉన్న వారినందరినీ మనం ఇప్పుడు గంపగుత్తగా ముస్లింలు అంటున్నాం కానీ, అప్పట్లో అట్లా పిలవలేదు. సంస్కృతంలోనూ, ఇతర భాషల్లోనూ ఉన్న ఆధారాలు వీరిని యవనులుగా, శకులుగా, తురుష్కులుగా ప్రస్తావించాయి. అవి జాతి సంబంధమైన పేర్లే గానీ మత సంబంధమైనవి కావు. విశేషం వీటికి పూర్వ చరిత్రలతో కూడా లంకెలుండడం. యవనులు అని మొదట పశ్చిమం నుంచి వచ్చిన గ్రీకులను అన్నారు. తర్వాత పశ్చిమం నుంచే వచ్చిన అరబ్బులు మొదలుకుని అందర్నీ, చివరికి విక్టోరియా మహారాణిని కూడా అదే పేరుతో పిలిచారు. ప్రాచీన శకులు మధ్య ఆసియా నుంచి వచ్చారు. తురుష్కులదీ మధ్య ఆసియాయే. రాజతరంగిణి రాసిన Kalhanudu శకులైన కుషాణుల్ని తురుష్కులనే ప్రస్తావించాడు. కాబట్టి అటు నుంచి వచ్చిన అరబ్బులు, ఆఫ్ఘనులు, టర్కులు, మొఘలులు యవనులుగా పిలువబడి తొలినాటి యవనుల వారసులుగానే గుర్తించబడ్డారు. చారిత్రకంగా కూడా అందులో కొంత సత్యం లేకపోలేదు. ఇస్లాం కన్నా ముందునుంచే అరబ్బులు పశ్చిమ తీరాన వ్యాపారం చేశారు. వారినే మనం ఇప్పుడు ముస్లింలు అంటున్నాం. అక్కడ స్థిరపడిన వీరు స్థానిక ప్రజలతో వివాహ సంబంధాలు నెలకొల్పుకున్నారు. రాష్ట్రకూటుల ఆస్థానాల్లో పని చేశారు. బ్రాహ్మణులకు దానాలిచ్చారు. వారికి స్థానిక హిందు జైన సంస్కృతులతో మేళవింపు జరిగింది. ఫలితంగా ఆవిర్భవించిన వాళ్లే పశ్చిమ భారతంలో బోహ్రాలు, ఖోజాలు, కేరళలో మోప్లాలు, దక్షిణ కొసన నవయతులు. అయితే సవర్ణ అవర్ణ బేధాలు ఇస్లాంలోకి మారిన వారిలోనూ, శిక్కులలోనూ కొనసాగాయి. వీళ్లంతా ప్రధాన మతాలనుంచి వీలైనంత దూరంగా ఉంటూ తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నించిన వాళ్లే. కాగా పదహారవ శతాబ్దికి చెందిన సంస్కృత పండితుడు మధుసూదన సరస్వతి దేశంలో వివిధ తాత్విక చింతనలని బౌద్ధులు, జైనులు, తురుష్కులు అంటూ ప్రస్తావిస్తూ తనని బ్రాహ్మణుడిగా ప్రస్తావించుకున్నాడు గానీ హిందువుగా కాకపోవడం గుర్తించదగిన అంశం. ఇక భక్తి సూఫి తత్వవేత్తల కలయిక మరొక అంశం. భక్తి ప్రధాన అంశం కావడం, వారిలో కొందరు భగవంతుణ్ణి రూపరహితంగా ఆరాధించడం వీరిని దగ్గరకు చేర్చింది. అసలు విషయం ఇద్దరూ ఆయా ప్రధాన మతాలకు 'ఇతరులు' కావడం. మధ్య ఆసియా నుంచి వచ్చిన సూఫీయిజంలో అంతకు ముందే అక్కడకు చేరిన బౌద్ధమత మూలాలుండడం.

ఆధునిక యుగారంభంలో బ్రిటీష్ వలసవాదుల దృక్పథం ఈ పరిస్థితిని పూర్తిగా మార్చివేసిందంటారు ఈ చరిత్రకారిణి. అన్నిటినీ ఒక త్రాటి మీదకు తెచ్చే ప్రయత్నంలో భాగంగా ఇస్లాం క్రైస్తవ జొరాష్టర్ మతాలు మినహా మిగిలిందంతా హైందవంగా ముద్ర వేయబడిందనీ, ఈ క్రమంలో రకరకాల అసమ్మతులు విలీనం చేయబడి లేదా ఉపేక్షించబడి హైందవం అగ్రవర్ణాలకు అప్పగించబడిందనీ అంటారీమె. వలసవాదులు ప్రారంభించిన భారత దేశ చరిత్ర సంస్కృతుల అధ్యయనం (ఇండాలజీ) కేవలం వలస దృక్పథంతో చూడబడిన అగ్రవర్ణ సాంస్కృతిక అధ్యయనమే నంటూ ఇది నిమ్న కులాల సంస్కృతుల అధ్యయనాన్నీ వివిధ సాంస్కృతిక అసమ్మతుల అస్తిత్వాన్ని నిరాకరించేటట్టు చేసిందనీ అంటారు థాపర్. ఆమె ఇంకా ఇలా అంటారు : హిందూ సమాజానికి చెందిన ఒక చిన్న సమూహం మాత్రమే దీన్ని అనుసరిస్తుందనీ అత్యధిక సంఖ్యాకులు కాదని అర్థం చేసుకోవడంలో వలసవాదులు విఫలమయ్యారు. వారు పరిశీలించిన సంస్కృత ఆధారాలు ఒక హిందువు ముందుగా ఒక కులం చేత గుర్తించబడతాడు గానీ, మతం చేత కాదనే విషయాన్ని చెప్పలేకపోయాయి.

ఆధునిక యుగప్రారంభాన మతం ఆధునిక అవసరాలను తీర్చడానికి బ్రహ్మసమాజం, ఆర్యసమాజం వంటివి స్థాపితం అయ్యాయి. ఈ సామాజిక మత సంస్కరణ సంస్థలు భారత జాతీయ భావ పుట్టుకకు ఉత్ప్రేరకాలుగా పనిచేశాయి. క్రమంగా మతం, రాజకీయం ఒక వైపుకు చేరుకున్నాయి. ఒక జాతిని నిర్మించడానికి మతం అవసరమైతే అది హిందూత్వ వంటి ఏకాండీ శిల రాజకీయ ప్రణాళికగా మారుతుంది. హిందూత్వ నిర్వచనంలో ఒక భౌగోళిక సరిహద్దు లోపల ఉండే వారంతా హిందువులే. ఆ సరిహద్దు బ్రిటీష్ ఇండియాయే. బ్రిటీష్ ఇండియాలో అధిక సంఖ్యాకులు హిందువులు కాబట్టి వారు ప్రాధాన్యత గల పౌరులుగా ఉండాలి. జాతీయభావనకు సరిహద్దులు అవసరం గానీ మతం కాదు. అవసరమనుకుంటే

మతం రాజకీయ ఏజెంటు అవుతుంది అని విశ్లేషించారు రెండు సార్లు భారత ప్రభుత్వం ఇవ్వజూపిన పద్మ భూషణ్ పురస్కారాన్ని తిరస్కరించిన ఈ విద్యావేత్త.

నాల్గవ ఉదాహరణగా భారతదేశాన్ని ప్రజాస్వామిక స్వేచ్ఛా దేశంగా మార్చడానికి సహకరించిన అసమ్మతిగా గాంధీ సత్యాగ్రహాన్ని గుర్తించారు రొమిలా థాపర్. గత కాలపు అనేక సమ్మతి అసమ్మతుల సంగ్రహ రూపంగా, హిందూత్వ మౌలిక భావనల్ని ప్రశ్నించగల సత్తా కలిగిందిగా ఆమె దీన్ని కనుగొన్నారు. సత్యాగ్రహం పట్ల తన ఆసక్తి గాంధీ మీద కన్నా ప్రజల అధోచేతనలో మిళితమై సత్యాగ్రహాన్ని అంగీకరించిన వారి భావజాలం మీద వుందంటారు వామ పక్ష భావజాలం కలిగిన ఈ చరిత్ర వ్యాఖ్యాత. ఎందువల్ల గాంధీ సత్యాగ్రహానికి అంత ప్రతిస్పందన లభించిందనే ప్రశ్నకు ఉప్పు అత్యంత అవసరమైన ఆహార పదార్థం కావడం వల్లనా, గాంధీ కరిష్మా వల్లనా అంటూ అనేక ప్రశ్నలు వేసుకుంటూ భారతీయ సమాజం యుగాలుగా అసమ్మతిని అంతర్లీన శక్తిగా కలిగి ఉండడమేనంటారు థాపర్. బ్రాహ్మణ సంప్రదాయం పట్ల శ్రమణులు అసమ్మతి చూపితే వారి నుంచి సంత్‌లు, పీర్‌లు ప్రభావానికి లోనైన నేపథ్యంలో గాంధీ ఆ శ్రమణ సంప్రదాయం నుంచి స్ఫూర్తి పొందాడు అంటారీమె. ప్రత్యామ్నాయ సామాజిక వ్యవస్థ హింసాత్మక విప్లవం వల్ల రాదని వారు భావించారు. సామాజిక నీతికి ప్రాధాన్యత నిస్తూ తమకు నచ్చిన ఆరాధనను ఎన్నుకునే స్వేచ్ఛ నిచ్చిన ఈ సందర్భం సంత్‌లను, పీర్‌లను నైతిక శక్తితో నింపింది. ప్రజల దృష్టిలో పడిన ఈ నైతిక శక్తే సత్యాగ్రహంలో కీలక పాత్ర వహించింది. పరిత్యాగం అసమ్మతికి ప్రతీకగా ఉంటూ వచ్చింది. సత్యాగ్రహులకు పరిత్యాగులతో పోలికలున్నాయి. సత్యాగ్రహులకు కూడా ఆశ్రమ జీవితమూ, శిక్షణ, క్రమశిక్షణ నియమావళి ఉన్నాయి. బ్రహ్మచర్యం అనివార్యం చేయబడలేదు కానీ హర్షించదగిన నియమంగా ఉండేది. గాంధీ చర్యలు కొన్ని సంత్‌ల చర్యలతో పోల్చబడ్డాయి. తొలిదశలో ఆయనకు కొన్ని మహత్తులున్నాయని భావించబడింది. వాటితో ఆయన బ్రిటీష్ ప్రభుత్వాన్ని లొంగదీయ గలడని అనుకున్నారు. గాంధీ బ్రహ్మచర్యం ఉద్యమానికి గొప్ప నైతిక బలాన్ని ఇచ్చింది. ఆయన చెప్పిన ఆత్మశక్తి (Soul Force) మొత్తం సత్యాగ్రహానికి చోదకశక్తిగా పనిచేసింది. గాంధీ తనను 'మహాత్మ' అని పిలవడాన్ని నిరాకరించకపోవడం ఆసక్తికరం. దాన్ని తాను నైతిక బలాన్ని కలిగి ఉండడానికి ప్రతీకగా స్వీకరించి నట్టనిపిస్తుంది. దాని బలమంతా సమాజానికి నైతికత అవసరమన్న దానిలో ఉంది. దాన్ని తమను నడిపించే నాయకుడికి కట్టబెట్టడంలో ఇమిడి ఉంది. శ్రమణ సంప్రదాయంలో మాదిరిగానే సత్యాగ్రహంలోనూ హింసకు దూరంగా ఉండడం అవసరం. హింస నైతిక బలాన్ని ధ్వంసం చేస్తుంది. సత్యానికి అహింసకూ కట్టుబడి ఉండడం సహనానికి దారి తీస్తుంది. అధికారంలో ఉన్న వాళ్లకు అది లేకపోవడం వల్లే అనేక అనర్థాలు జరుగుతున్నాయ్.

మతం రాజకీయం చేయబడిన వర్తమాన నేపథ్యంలో మతానికి మనం ఏ రూపం ఇస్తున్నామో పరిశీలించవలసి ఉంది అంటున్న ఈ వ్యాస రచయిత్రి గత రెండు శతాబ్దాలుగా భారతీయ మతాలు వలసవాద పండితుల జాడలలోనే పునర్నిర్మించబడినాయి అంటారు. ప్రధాన దృష్టి అంతా నమ్మకాలు, కర్మకాండలు, వాచకాల మీదే ఉంది కానీ సామాజిక రాజకీయ మార్పులలో మతం నిర్వహించిన పాత్ర ప్రజాబాహుళ్యంలో చర్చకు రాలేదు ఆమె దృష్టిలో. ఈ సందర్భంగా ఆమె జాతీయభావం గురించీ మతతత్వ రాజకీయ మూలాల గురించి కొంత చర్చ చేశారు. భారతదేశంలో ప్రధాన స్రవంతి జాతీయభావం పౌరుల స్వేచ్ఛను నిరాకరించిన రాజకీయవ్యవస్థను ధిక్కరించింది. పారిశ్రామికీకరణ, మధ్యతరగతి ఆవిర్భావం సమాజానికి కొత్త చూపునిచ్చాయి. జాతీయ భావం ప్రాచీన రాచరిక వ్యవస్థల స్థానంలో స్వతంత్ర జాతీయ రాజ్యాల స్థాపనను ముందుకు తెచ్చింది. ఇది ఒకనాటి పాలితుల స్థానంలోకి పౌరుల్ని తెచ్చింది. ఇది పౌరులకూ రాజ్యాని మధ్య నిరంకుశమూ విదేశీయమూ కాని ప్రభుత్వాన్ని ప్రతిపాదించింది. ప్రభుత్వం అంటే పౌరుల ప్రతినిధి అనే ఇంతకుముందు లేని నిర్వచనాన్ని ఇచ్చింది. ఈ వ్యవస్థ పౌరుల హక్కులను కాపాడవలసిన బాధ్యతను రాజ్యం మీద పెట్టింది. పౌరులకూ రాజ్యానికీ కుదిరిన ఈ ఒప్పందాన్ని రాజ్యాంగం నిక్షిప్తం చేసింది. కాబట్టి జాతీయభావం అంటే సమాన హోదా, సమాన హక్కులూ ఉన్న ప్రజలందరూ కలిసి స్వతంత్ర జాతీయ రాజ్యాన్ని ఏర్పరచుకోవడం. అందువల్ల మతం, జాతి, భాష ప్రాతిపదికన వారి పట్ల వైమనస్యం చూపడానికి వీల్లేదనీ, ఒక మతం పట్ల అపేక్ష, విమతాల పట్ల వివక్ష జాతీయభావం కాజాలదనీ అంటున్నారు థాపర్.

మతతత్వ రాజకీయాల మూలాల గురించి ఆమె వివరణ ఇలా ఉంది. సాధారణంగా దేశవిభజనకు దారితీసిన పరిణామాల విశ్లేషణలో బాధ్యతంతా మతతత్వం మీదే వేసి దాని వెనుక ఉన్న వలసవాద ఆలోచనాముద్రను విస్మరిస్తాం. వలసవాదులు వలస ప్రజల ప్రాచీన చరిత్ర రచనకు పూనుకున్నపుడు వారి దృక్పథమే

వలస ప్రజల మూలాలను అస్తిత్వాన్ని నిర్ణయిస్తుంది. ఈ నేపథ్యంలో రూపుదిద్దుకుంది ద్విజాతి సిద్ధాంతం. 1817లో జేమ్స్ మిల్ భారతదేశ చరిత్ర హిందు, ముస్లిం అనే రెండు జాతుల చరిత్ర అనీ అవి నిరంతరం సంఘర్షించుకున్నాయని ప్రతిపాదించాడు. దేశచరిత్రని హిందు, ముస్లిం, బ్రిటీష్ యుగాలుగా విభజించాడు. ఈ దారుణ చారిత్రక విభజన అర్ధ శతాబ్దం క్రితమే ప్రశ్నించబడి, ఖండించబడి, నిరాకరించబడింది. కానీ ఈ ఆలోచనని హిందు ముస్లిం మతతత్వవాదులు మాత్రం విడిచిపెట్టలేదు. అది ఇస్లామిక్ రాజ్యం, హిందు రాష్ట్రం అనే భావనలుగా పురి విప్పి, ఒకదానికొకటి ఎదురుగా నిలుస్తూ రెండూ ప్రధాన స్రవంతి జాతీయోద్యమానికి దూరమయ్యాయి. ఈ క్రమంలో ఆయా మతాల్లో ఉన్న అసమ్మతుల్ని ప్రణాళికా బద్ధంగా అణచివేశాయి. హిందురాష్ట్ర భావనని బలంగా ముందుకు తేవడానికి హిందుత్వ ప్రణాళికకు అనుగుణంగా చరిత్రను వ్యాఖ్యానించుకున్నారు. హిందూ మత రూపాన్ని సారాన్ని కూడా మార్చేశారు. దీనికి సమాంతర పరిణామాలు ఇస్లాంలోనూ జరుగుతూ వచ్చాయి. కానీ, ప్రధాన స్రవంతి జాతీయోద్యమం పౌరులందరినీ వారి మూలాలతో సంబంధం లేకుండా ఒకే అస్తిత్వం, సమాన హోదా కలిగిన వారుగా స్వతంత్ర లౌకిక ప్రజాస్వామిక రాజ్యస్థాపనని కాంక్షించే వారిగా పరిగణించింది.

అనాదిగా మొదలైన అసమ్మతి కథనం వర్తమానంలో కూడా కొనసాగుతూ ఉందనీ, అది అత్యమంత సమీప గతంలో ప్రతిధ్వనించిదనీ అంటారు మతతత్వవాదులకు అనేక సార్లు లక్ష్యం అయిన రొమిలా థాపర్. అనేక రకాలుగా అది గాంధీ సత్యాగ్రహానికి కొనసాగింపుగా పేర్కొంటూ ఇటీవల న్యూఢిల్లీ షహీన్ బాగ్‌లో ప్రారంభమై దేశమంతా విస్తరించిన పౌరసత్వ సవరణ చట్ట, జాతీయ పౌరపట్టిక వ్యతిరేక ఉద్యమాన్ని ఐదవ, ఆఖరి ఉదాహరణగా స్వీకరించారు. దాని విస్తరణ, తీవ్రతల గురించి చెబుతూ కోవిడ్-19 మాత్రమే దాన్ని నిలువరించ గలిగిందంటారు. ఒక రోజు ఇద్దరు మిత్రులతో కలిసి షహీన్ బాగ్‌ను సందర్శించిన సందర్భాన్ని రొమిలా ఇట్లా వివరించారు. "అదొక పెద్ద మహిళల సమూహం. అందులో ముస్లిములు ఎక్కువగా ఉన్నారు. వారితో మాట్లాడిన తర్వాత తాము నిరసన తెలుపుతున్న దాని పట్ల వారికి స్పష్టత ఉందని నాకు అర్థమైంది. వారి ప్రధానమైన కోరిక ప్రభుత్వం వారి భయాలు తొలగిపోయే విధంగా చర్చలు జరపడం. తమ పౌర హక్కులు రద్దు కాబడవనే హామీ ఇవ్వడం. అంతే. వాళ్లేమీ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడడం లేదు. ఉగ్రవాదులకు సహకరించడం లేదు. అసోంలో సృష్టించబడిన అయోమయం వల్ల కలిగిన సంశయంలోంచి ఉత్పన్నమైన న్యాయమైన కోరిక వాళ్లది. అక్కణ్ణుంచి కదిలే సమయానికి నిరసన తెలుపుతున్న మహిళల హుందాతనానికీ వారి సమస్య తీవ్రతకీ కదలిపోయాను నేను. అది పెద్ద సమూహమే. అయితే ఎంతో క్రమశిక్షణ కలిగి అప్పుడొకటీ అప్పుడొకటీ చొప్పున చిన్న చిన్న ప్రసంగాలూ, అరుదుగా జాతీయగీతాలాపన, లోగొంతుకలో సాగుతున్న సంభాషణలూ తప్ప ఎంతో ప్రశాంతంగా ఉంది. ఎక్కడా దుర్భాషలు లేవు. ఎవర్నో చంపేయమనే కేకలు లేవు. అది ఒక పరమ అహింసాయుతమైన ఉద్యమం. ఇదంతా ఈ దేశపు అన్ని నేపథ్యాల నుంచీ, ముఖ్యంగా గొంతులు నొక్కబడిన వర్గాల నుంచి వచ్చిన మహిళలు సాగిస్తున్న ఉద్యమం. ఒక భారతదేశ మహిళగా నా సహవాసుల పట్ల, వారి న్యాయబద్ధమైన నిరసన పట్ల గౌరవమూ, గర్వమూ కలిగాయి." అని అంటూ 'ఒక వ్యక్తి పుట్టుక, పుట్టిన చోటు, పౌరసత్వం గురించి మాట్లాడ డానికి మహిళల కన్నా అర్హులెవరుంటారు?' అనే గొప్ప అర్థవంతమైన ప్రశ్నను సంధించారు థాపర్. ఇది లౌకికత్వంతో ముడిపడిన పౌరసత్వానికి సంబంధించిన ఉద్యమం. ముస్లిం క్రైస్తవ మతాలకు చెందినవాళ్లు భారతదేశపు సరిహద్దుల లోపల జన్మించిన మతాల వారు కాదు కాబట్టి వారిని విదేశీయు లంటుంది హిందుత్వ. ఆత్మగౌరవం కోసం పోరాడుతున్నందుకు దళితులన్నా ఇష్టం లేదు వాళ్లకు. యువత నుంచి ఉద్యమానికి లభించిన భాగస్వామ్యం చూస్తే భవిష్యత్ పట్ల ఆశ కలుగుతున్నది అని కూడా అన్నారు.


ప్రభుత్వాలు ప్రజలందరి హక్కులు కాపాడడానికి నిర్దేశించినవే కానీ, ఏ కొందరివో కాదు. మానవ సమాజాల్లో ప్రభుత్వాలకు ప్రజలందర్నీ సమానంగా చూడగలిగే నైతిక నియమావళి ఉండాలి. అది కేవలం సిద్ధాంతంగా పుస్తకాలకు పరిమితం కాకూడదు. ఆచరింపబడాలి. పౌరస్వరం క్రమంగా అందరికీ వినిపించడమే ఆధునిక యుగ లక్షణం. పౌరులు మాట్లాడినప్పుడు ప్రభుత్వాలు వారి నోళ్లు నొక్కడానికి చేసిన ప్రయత్నాలు విఫలమై, వినడం విధాయకమౌతున్న సందర్భం ఇది. భవిష్యత్ అంతా రాజ్యానికీ పౌరులకూ ఒకరి పట్ల ఒకరికి ఉన్న హక్కులు, బాధ్యతల పట్ల జరిగే శక్తివంతమైన సంభాషణ మీద ఆధారపడి ఉంటుంది అని ఈ సుదీర్ఘ వ్యాసాన్ని ముగించారు రెండు నెలల క్రితం తొంభయ్యో పడిలో పడిన వృద్ధ నారి, ప్రొఫెసర్ థాపర్. ❑

*'వీక్షణం' మాసపత్రిక సౌజన్యంతో..*

# తొలి పార్లమెంటులో డాక్టర్ చెలికాని రామారావు

**సంపాదకులు :** డా॥ సి. కృష్ణ మోహనరావు
**అనువాదం :** డా॥ ప్రకాశ రావు, బి.ఎస్. శ్రీనివాస్
**పరిచయం:** వి.విజయకుమార్

రావు కృష్ణారావు గారు ఒకానొక సందర్భంలో చెలికాని రామారావు గారి గురించి చెబుతూ ఆయన నాకు దేవుడు అన్నారు. మార్క్సిస్టులు గానీ, నాస్తికులు గానీ అవిశ్వాసులు గానీ ఆ పదాన్ని వాడటానికి సంశయించడం చూస్తాం. అసలు దేవుడు లాంటి మనుషులు ఉంటారా? వుంటారు. ఎక్కడ చూసినా వాళ్ళే వుంటారు! కానీ ఒక సుందరయ్య లాంటి దేవుడో, చెలికాని రామారావు గారి వంటి దేవుడో మాత్రం వుండే అవకాశమే లేదు, ఎందుకంటే మానవుడు కల్పించి రాసుకున్న కట్టుకథల్లో కనబడే దేవుళ్ల గుంపంతా తిరుగుబోతులు, విషయాలంపటులు, రవ్వంత కనికరం లేనివాళ్ళు, తమని కీర్తించేవారికి వరాలూ, వ్యతిరేకించే వారికి శాపాలూ, కోపాలూ, మూడో కన్నుతో భస్మాలూ, వదో చేత్తో కుత్తుకలుత్తరించడాలూ, తోకలు కత్తిరించడాలూ తప్ప దేవుళ్ళకు పేదవాళ్ళతో పనిబడదు. పెద్ద వారితోనే పని!!




అందుకే పేదవాళ్ళపట్ల సానుకూలమైన వైఖరి లేని దేవుడితో పోల్చడం సుతరామూ నప్పదు! అందుకే మార్క్సిజం నేర్చుకున్న మనిషి మానవసమాజపు అజ్ఞానాంధకారంలో నుంచి పుట్టుకొచ్చిన దేవుడి కంటే ఉన్నతుడిగా, దేవుడికి కూడా ఆపాదించలేనంత గొప్ప గుణాలతో ఉండటం చూస్తాం. గొప్ప గుణాలంటే, నిస్వార్థంగా, తనకంటే పరుల మేలు కోరే విధంగా, భజనలు చేసే వారికి దూరంగా వుండడం.

ఇవి దేవుళ్ళకు అసాధ్యం కాబట్టి చాలామంది మార్క్సిస్టు ఆలోచనాపరులు ఉన్నతంగా ఉండటం ఆనవాయితీ!!

చెలికాని రామారావు గారి లాంటి వ్యక్తుల గురించి తెలుసుకోవడం కంటే గొప్ప ఎడ్యుకేషన్ ఒక మార్క్సిస్టు ఆలోచనా పరుడికి ఇంకేదో ఉంటుంది అనుకోను. సైద్ధాంతిక జ్ఞానం మనిషిని మనిషిగా మార్చకపోతే దాని విలువ శూన్యం. మార్క్సిజం సిద్ధాంతం కాదు ఆచరణ అన్నది అందుకే! ఆచరణలో చూపే మార్క్సిస్టులు ఎందరికో స్ఫూర్తి ప్రదాతలు. కమ్యూనిస్టు అనగానే అవును ఏ 'సుందరయ్య' గారో తప్ప అనడం ఆనవాయితీ. ఎందుకంటే ఆచరణాత్మక జీవితాన్ని గడిపే వారి ప్రభావం అంతా ఇంతా కాదు!

రావు కృష్ణారావు గారు రాసిన వ్యాసంలో కొన్ని విషయాలు ఆ గొప్ప వ్యక్తి తాలూకు జీవితంలోని కొన్ని పార్శ్వాలు ఏనాడో చదివినా, ఇప్పటికీ గుర్తే నాకు! రావు కృష్ణారావు గారనే ఈ వారాలబ్బాయి లాంటి అబ్బాయి, అన్నం తిని లేచిపోతే, తిన్న పళ్ళాన్ని స్వయంగా చెలికాని రామారావు గారు కడిగేవారట! అంతేకాదు అర్ధరాత్రి ఆస్మాటిక్ వీజింగ్‌తో ఊపిరాడకుండా ఆయాసపడుతుంటే సూది మరిగించి ఇంజెక్షన్ చేసేవారట! కంభంపాటి, ఏటుకూరి, రాజేశ్వరరావు, భీం రెడ్డి, సుందరయ్య గారి లాంటి వాళ్ళు వచ్చి వెళ్లే ఇంట్లో సైతం, బయట నిలబడ్డ డ్రైవర్‌కు, వంట చేసిన మనిషికీ ముందు ఆహారం అందిందో చూసేవారట! కొడుకు డాక్టరు స్టాలిన్‌కు స్కూటర్‌కు డబ్బులు అవసరపడ్డాయ్! అప్పుడే ఏదో కొంత సొమ్ము రామారావు గారికి వచ్చింది. దాన్ని వారు కొడుక్కి ఇవ్వకుండా ఒక పేద కుటుంబ అవసరార్థం ఇచ్చేయడం జరిగింది. కొడుక్కి ఇవ్వడం కంటే ఒక పేదింటికి సాయం చేయడం అవసరం అనుకున్నారట రామారావు గారు! భార్య కమలమ్మ గారు చివరి దశలో పూర్తిగా మంచానికే పరిమిత మయినప్పుడు కమోడ్ కూడా తనే స్వయంగా శుభ్రపరచడం చేసేవారట, రాత్రిపూట మేల్కొని వుంటూ సేవలు చేసేవారట!

గొప్ప గొప్ప నాయకులు కెమేరాల ముందు చేసే చాలా పనులు ఇటువంటి వారికి సర్వసాధారణమయిన విషయాలు. సుందరయ్య గారు సైకిలెక్కి వెళ్లినా, బొజ్జి గారు గుడిసెలో వున్నా,

రాజయ్య గారు నడిచి వెళ్లినా, గుమ్మడి నరసయ్య గారు బస్సెక్కినా, వెనకా ముందూ, కెమెరాలు పెట్టారో లేదో వారికి అక్కర్లేదు. వారి జీవన శైలి ప్రజలతో మమేకమైనప్పుడు, ప్రజలతో వున్నప్పుడు ఒక కమ్యూనిస్టు ఎలా ఉండాలో అలానే వున్నంతకాలం వారికి ప్రజా హృదయాల్లో సుస్థిరమయిన స్థానం ఉంటుంది.

ఒకసారి మార్క్స్ జయంతి సందర్భంగా చలసాని ప్రసాద్ గారి కోసం ఎదురు చూస్తున్నాం. ఆయన కోసం బస్టాండ్‌లో. ఆయన నడుచుకుంటూ వచ్చి గంటన్నర పైగా మాట్లాడి తిరిగి నడిచి వెళ్లిపోయారు. కనీసం బండి మీద లిఫ్ట్ కూడా ఆశించకుండా! ఒకసారి బాలగోపాల్ గారి మీటింగ్‌కని వెళ్ళాం. అది చిన్న పాక. ఇరవై మంది కూడా లేరు. ఈ లోపులో అప్పటి దాకా అందరి మధ్యా కూచుని స్లిప్పర్‌తో ఉన్న ఒక బక్క వ్యక్తి అలా అనర్గళమైన ఉపన్యాసం చెప్పి అలా పాకలోంచి వొంగి బయటకు వెళ్లిపోవడం నలభయ్యేళ్ల నాటి జ్ఞాపకం. ఒకసారి నాగభూషన్ పట్నాయక్ గారితో ఒక రోజు గడిపే సందర్భం వచ్చింది. మెస్ నుంచి నేనే స్వయంగా భోజనం తీసుకొని వెళ్లి ప్లేట్‌లో వడ్డించబోతే ఆయన వారించారు. నేను తిన్నానో లేదో కనుక్కుని నాకు పెట్టి తను తిన్నారు. అక్కడ ప్లేట్ తీసే అమ్మాయి వున్నా తానే ప్లేట్ కడిగి అక్కడ పెట్టారు.

ఆయన్ని ఆహ్వానించడానికి ఒరిస్సాలోని ఒక కుగ్రామం వెళ్ళినప్పుడు ఆయన ఒక చిన్న తాటాకు గుడిసెలో, ఒక నులక మంచం మీద పడుకొని, తాటాకు విసనకర్రతో విసురుకుంటూ వున్నారు. సమ్మోహనమైన ఇంగ్లీష్‌లో కొన్ని గంటలు మాట్లాడుతూనే వున్నారు. కనీసం రెండుసార్లు ఉరిశిక్ష పడిన విప్లవకారుడు ఆయన!

గొప్ప వ్యక్తుల జీవితాలు నిజానికి చాలా గొప్ప పుస్తకాల కంటే కూడా ప్రభావితం చేస్తాయి. ఫిడెల్ కాస్ట్రో తను స్నానాల గదిలోకి వృద్ధాప్యంలో కూడా నీళ్లు మోసుకుపోయేవాడనీ, స్టాలిన్ తన పాత చెప్పుల్ని విడవకుండా తొడుక్కునే వాడనీ, ఛుటే తన బట్టల్ని స్వయంగా వుతుక్కునే వాడనీ, ఇలా చెప్పుకుంటూ పోతే కొన్ని వందల ఉదాహరణలు చూపొచ్చు.

1952 ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ తరపున కాకినాడ నుంచి తొలి పార్లమెంట్ సభ్యులుగా చట్టసభలో అనేక అంశాలపై సాధికారికంగా సమగ్ర చర్చల్లో పాల్గొన్న చెలికాని రామారావు గారి ప్రసంగాలను కొన్నింటిని ఎంపిక చేసి ఒక పుస్తకరూపంలో తీసుకొచ్చారు. నిజానికిది ఒక మహత్తర క్రతువు. రామారావు గారి అధ్యయనం, విషయపరిజ్ఞానం, ఒక విషయంపై సాధికారికంగా మాట్లాడ్డం ఇవన్నీ ఒక ఎత్తైతే వాటిని తెలుగు పాఠకులకు చక్కని భాషలో అందించే ప్రయత్నం చేయడం మరో గొప్ప విషయం.

పుస్తకం చదువుతున్నంత సేపు ఇది అనువాదమేమో అనే స్పృహ కలగకుండా వీటిని అనువాదం చేశారు డా॥ ప్రకాశరావు గారూ, మరియు బి.యస్ శ్రీనివాస్ గారూ. ఎంతో ఆపేక్ష ఉంటే తప్ప ఇంత చక్కని అనువాదం సాధ్యం కాదు.

ముఖ్యంగా వీధిబాలల, యాచక నిరోధక బిల్లులపై, ఆహార కల్తీ, ఔషధాల బిల్లులపై మందుల మాయా ప్రకటనలపై, ఆనాటి కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రభుత్వ చిత్త శుద్ధి గురించి ప్రశ్నించిన విధానం అబ్బురమనిపిస్తుంది. ప్రజా సమస్యల పట్ల, ప్రజల తరపున ప్రజావాణి వినిపించే ఇటువంటి నాయకులు చట్ట సభల్లో ఎందరున్నారు? ఇంచుమించుగా చట్టసభల్లో ప్రజల తరపున మాట్లాడే వారంతా మొక్కుబడిగా ప్రస్తావించడమే తప్ప నిజాయితీగా సమస్యను పరిష్కరించే దిశగా తీసుకెళ్ళిన వారు ప్రధానంగా కమ్యూనిస్టు పార్టీ సభ్యులే! అయినా 1954 నాటి కొన్ని సమస్యలు ఇంచుమించు యధాతథంగా ఉండటం చూస్తూనే ఉన్నాం. చట్టసభల వల్ల ఒరిగేదేమీ ఉండదన్న సత్యం రుజువౌతూ వస్తూనే ఉంది. సమూలమైన మార్పుల దిశగా విప్లవపోరాటాల ద్వారానే సమాజ ప్రక్షాళన సాధ్యం అన్నది వాస్తవం.


మంచిపుస్తకం మిణుకు మిణుకుమంటున్నప్పుడల్లా ఒత్తి ఎగదోసి ఇంత తైలం వేసి దీపం ఆరిపోకుండా చూసే ప్రకాశ్‌రావు గారు ఈ పుస్తక అనువాదంలో యెంతో శ్రమించారు. నిజానికి వారి ఈ అనువాదం రామారావు గారి ఉపన్యాస విధానాన్ని ఒడిసిపట్టి తెలుగులోకి అందించే ప్రయత్నంలో సఫలీకృతం అయినందుకు వారికి అభినందనలు. వారితో పాటూ ఈ కృషిలో భాగమైన బి.యస్. శ్రీనివాస్ గారికి ప్రత్యేక అభినందనలు.

ఇంత విలువైన పుస్తకానికి చిన్న పరిచయం రాసే అవకాశం కల్పించిన స్టాలిన్ గారికి కృతజ్ఞతలు. ❑


**తొలి పార్లమెంటులో**
**డాక్టర్ చెలికాని రామారావు**

కాపీల కొరకు
**చెలికాని రామారావు మెమోరియల్ కమిటి**
**రామచంద్రపురం - 533 255**
**తూర్పు గోదావరి జిల్లా**
**✆ 98493 48162**


# నిజ జనజీవన దృశ్యాల పరంపర



ఎన్ వేణుగోపాల్

***డి.వై.ఎఫ్.ఐ. నాయకులు విప్లవకుమార్, విజయకుమార్‌ల రచన "ప్రయాణం" పుస్తకానికి వేణుగోపాల్ గారి ముందు మాట***

ప్రపంచ ప్రసిద్ధ విప్లవకారుడు చే గెవారా 'మోటర్ సైకిల్ డైరీస్' రెండో కూర్పు వెలువడుతున్నప్పుడు 2003 జూలైలో ఆయన కూతురు అలీదా గెవారా మార్చ్ ఆ పుస్తకానికి రాసిన ముందుమాటలో, "వాస్తవికతలో ఆయన అడుగుజాడలను అనుసరించే అవకాశం మీకెప్పుడైనా దొరికితే, మీరొక విచారకరమైన విషయాన్ని తెలుసుకుంటారు. చాల విషయాలు ఏమీ మారకుండా అలానే ఉన్నాయని, లేదా మరింత దుర్భరంగా మారాయని గుర్తిస్తారు. తర్వాత సంవత్సరాల్లో చే అనే ప్రముఖుడిగా మారిన ఈ యువకుడి లాగనే మనం కూడ మనలో చాల మంది పట్ల అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్న ఈ వాస్తవికతకు స్పందిస్తున్నాం. మరింత న్యాయమైన ప్రపంచాన్ని నిర్మించడానికి సహాయపడాలనే నిబద్ధతతో ఉన్నాం. ఆ స్పందనా, నిబద్ధతా ఉన్న మనకు ఇది ఒక సవాల్" అని రాసింది.




చేగెవారా ఎదుర్కొన్న ఆ సవాల్‌ను, ఐదు దశాబ్దాల తర్వాత ఆయన కూతురు మరొకసారి గుర్తు చేసిన ఆ సవాల్‌ను ఏడు దశాబ్దాల తర్వాత మరో ఇద్దరు యువకులు స్వీకరించిన సాహసగాథ ఇది.

ఆ యాత్ర లాటిన్ అమెరికాలోని ఐదు దేశాలకు విస్తరించగా ఈ యాత్ర ఒకే దేశంలోని ఒకే రాష్ట్రానికి పరిమితమై ఉండవచ్చు. అక్కడి పందొమ్మిది వేల కిమీ దూరం ఇక్కడ అందులో సగం కన్న తక్కువ కావచ్చు. అక్కడి ఏడు నెలల కాలం ఇక్కడ 46 రోజులకు కుదించి ఉండవచ్చు. అలా చూస్తూ పోతే ఎన్ని తేడాలైనా ఉన్నట్టు అనిపిస్తుంది. కాని ఈ రెండు ప్రయాణాల మధ్య ఈ భేదాలన్నిటినీ మించిన సారూప్యతలూ ఎన్నో ఉన్నాయి. అత్యంత మౌలికమైన సాదృశ్యం ఈ రెండు ప్రయాణాల ప్రయాణికులూ తమ కళ్లతో చూసిన, తమ చెవులతో విన్న, తమ హృదయంతో అనుభవించిన నిజ జీవన దృశ్యాల పరంపరను మన కళ్లకూ చెవులకూ హృదయానికీ పంచడానికి ప్రయత్నించారు.

'ది మోటర్ సైకిల్ డైరీస్– నోట్స్ ఆన్ ఎ లాటిన్ అమెరికన్ జర్నీ' పేరుతో చే రాసిన అనుభవాలు ప్రపంచవ్యాప్తంగా అనేక భాషల్లోకి అనువాదమై, లక్షలాది మందికి ఉత్తేజంగా నిలిచాయి. కేవలం పుస్తకంగానే కాక, ఎన్నో కళారూపాల్లోకి కూడ మారి ఆయన చేసినటు వంటి సమాజ అన్వేషణే చేయడానికి ఎందరికో ప్రేరణనిచ్చాయి.

సత్యాన్వేషణకు, జ్ఞానాన్వేషణకు చాల మార్గాలున్నాయి గాని, నిరంతరం మార్పు లకు గురవుతున్న, జీవన్మరణ సంఘర్షణకు లోనవుతున్న, పెనుగులాడుతున్న జన జీవితాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి అవగాహన చేసుకోవడాన్ని మించిన మార్గమేదీ లేదు. ఇంద్రియానుభవ జ్ఞానం ఒక్కటే చాలుననే భావవాదపు చీకటి నీడల్లోకి పోనక్కరలేదు గాని, ఎంత వివేచనాయుత హేతుబద్ధ జ్ఞానానికైనా అత్యవసరమైన పునాది ఇంద్రియానుభవ ప్రత్యక్ష జ్ఞానమే అని అంగీకరించక తప్పదు. ప్రజా జీవితంలో మునిగి తేలకుండా, అనుభవించకుండా ఎంత పుస్తక జ్ఞానమూ, ఎంత తర్కమూ, ఎంత పాండిత్యమూ పరిణతి సాధించలేవు.

తన లాంటి కవి సమున్నత కవితాశిఖరాల మీంచి కమ్యూనిజంలోకి దూకడం ఎంత వాస్తవమో, కష్టాల అగాధాల్లోంచి, కత్తి అంచు వంటి వర్గపోరాటంలోంచి నిరక్షరాస్య కార్మికులు కమ్యూనిజంలోకి ప్రవేశించడమూ అంతే వాస్తవమని అన్నాడు కవి మయకోవస్కీ. ఈ రెండూ ఎక్కడో ఒకచోట కలవవలసి ఉన్నది. సిద్ధాంతమూ జీవితానుభవమూ, హేతుబద్ధ జ్ఞానమూ ప్రత్యక్ష సాన్నిహిత్యమూ, మేధోశ్రమా శారీరక శ్రమా, చదువూ పనీ, సామాజిక పరిశీలనా రాజకీయ కార్యాచరణా, ఆలోచనా ఆచరణా ఇవేవీ పరస్పర వ్యతిరేకమైన ద్వంద్వాలు కావు, అన్యోన్య సంబంధం గల, పరస్పరం ఆశ్రయించిన, చర్య–ప్రతిచర్యలతో పూరించుకోవలసిన ఒక సమగ్ర మొత్తంలో రెండు అవిభాజ్య సగభాగాలు.

ఇక్కడ ఆ రెంటి మేళవింపుగా రాజకీయ కార్యాచరణలో, యువజనోద్యమ నాయకత్వ స్థానంలో ఉన్న ఇద్దరు కార్యకర్తలు సామాజిక పరిశీలనకు పూనుకుని ఒక కష్టతరమైన యాత్ర చేపట్టారు. చే ఒకానొక ప్రేరణ కావచ్చు గాని అంతకన్న ముఖ్యంగా వారు నిర్వహిస్తున్న యువజనోద్యమం ముందుకు ప్రధానమైన సవాలుగా వచ్చిన నిరుద్యోగ సమస్య అధ్యయనం ఒక కీలక అంశం.

"తెలంగాణ వస్తేనే ఉద్యోగాలొస్తయని అప్పుడు ప్రాణాలు బలిదానం చేస్తే... తెలంగాణ వచ్చినా ఉద్యోగాలు వస్తలేవనే ఆత్మవిశ్వాసం సడలిన యువత ఇప్పుడు ఆత్మబలిదానాలకు సిద్ధపడుతుంది. ఇలాంటి పరిస్థితి చూసి డివైఎఫ్ఐ తల్లడిల్లి పోయింది. రెచ్చగొట్టుడు ఉద్యమ పాత్రధారీ, కొలువుల వాగ్దాన ప్రసంగ ఝరీ, కొత్తరాష్ట్రం పీఠంపై కొలువుదీరి ఉన్న బాధ్యత వల్ల కూడా అన్ని బలవన్మరణాల జవాబుదారీ ముమ్మాటికీ ఆయనే. ప్రభుత్వ ఆలనా పాలనా కరువై కాటికి సిద్ధమైతున్న యువతలో భరోసా నింపాలి. అందుకు తెలంగాణలో యువతను ప్రత్యక్షంగా కలిసి మాట్లాడాలి. వారి పూర్వాపరాలను పరిశీలించాలని, వారి గుడిసె మూలాలను, గుండె లోతులను ఆలింగనం చేసుకోవాలని నిర్ణయించుకుంది భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య..". అదీ ఈ ప్రయాణ లక్ష్యం.

ఏదో ఒక అంశం మీద కేంద్రీకరించినప్పటికీ పరిశీలనా క్రమంలో, మార్గమధ్యంలో మరెన్నో అంశాలు దృష్టికి వస్తాయి, అడ్డుపడతాయి, ఆలోచించమని నిలదీస్తాయి, కొత్త అవగాహన లను ఇస్తాయి. ప్రతి పరిశీలనా, ప్రతి అనుభవమూ ఒక వాదనకూ, ఒక నిర్ధారణకూ దారి తీస్తాయి. ఆ వాదనలూ నిర్ధారణలూ అంతకుముందే చదివినదో విన్నదో మనసులో ఉన్న సైద్ధాంతిక అవగాహనను బలోపేతం చేస్తాయి. లేదా కొత్త సైద్ధాంతిక అవగాహన కల్పించుకోవలసిన అవసరాన్ని గుర్తింప జేస్తాయి. అటువంటి అనేకానేక అనుభవాల వైశాల్యంతోనే ఒక సాధారణ పరిశీలన అంతకంతకూ మెరుగైన విశ్లేషణగా మారుతుంది. ఈ పుస్తకంలో ఇద్దరి రచనలూ ఇప్పుడు అటువంటి పరిణత విశ్లేషణలకు అద్దం పడుతున్నాయి.

ఇది కేవలం యాత్రానుభవాల కవిలెకట్ట కాదు. అటువంటి దానిలో తేదీలు, స్థలాలు, కలిసిన మనుషుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఎక్కువలో ఎక్కువ ఎక్కడో ఒకచోట ఆ కలిసిన మనుషులతో పొందిన అనుభవాలు ఉంటాయి. కాని ఇక్కడ ఆ కలిసిన మనుషుల జీవన స్థితిగతులు, వారి అభిప్రాయాలు, వారితో సాగిన చర్చలు, ఆ చర్చల నేపథ్యంలో అక్కడే ప్రకటించిన, లేదా ఇప్పుడు రాస్తున్నప్పుడు ప్రకటించిన తమ సామాజిక రాజకీయాభిప్రాయాలు కూడ వచ్చాయి. అవి మాత్రమే కాదు, ప్రకృతి దృశ్యాల సౌందర్యం గురించీ, మానవ సంబంధాల సున్నితత్వం గురించీ ఎన్నో ఆర్ద్రమైన అనుభూతులతో సహా మానవ సహజమైన మేధో సంబంధమైన, హృదయ సంబంధమైన ఉద్వేగాలన్నీ కలగలసి ఉన్నాయి.

యాత్రలూ ప్రయాణాలూ ఊరికే చూడడానికి పోయేవీ ఉంటాయి, చెప్పడానికి మాత్రమే పోయేవీ ఉంటాయి, వినడానికి మాత్రమే పోయేవీ ఉంటాయి. ఇక్కడ ఈ యాత్ర ప్రధాన లక్ష్యం చూడడమూ, వినడమూ మాత్రమే గాని ఒక రాజకీయ దృక్పథం ఉన్న సంఘ నాయకులుగా చెప్పడం కూడ కలగలిసి ఇది ముప్పేట హారపు అనుభవంగా మారింది. తమ అనుభవాలు చెప్పే క్రమంలో రచయితలు తమ ప్రయాణాన్ని అధ్యయన యాత్ర అని చెప్పుకున్నారు. పుస్తక అధ్యయనాన్ని మించిన సామాజిక అధ్యయనం, మనుషుల అధ్యయనం చేశారు. ఆ అధ్యయన ఫలాన్ని ఇక్కడ మనందరికీ పంచుతున్నారు.

ఈ రెండు వందల ఇరవై పేజీల పుస్తకంలో తెలంగాణలోని రెండు మూడు వందల సమస్యలు, జీవిత పార్శ్వాలు, మానవ సంబంధాలు, ఆలోచనలు, ఉద్వేగాలు కిక్కిరిసి ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. మచ్చుకు చెప్పాలంటే, గ్రామీణ ప్రాంతాల్లో కుల వివక్ష, ప్రభుత్వ పాఠశాలల దుస్థితి, ఆటస్థలాల కొరత, విద్య ప్రైవేటీకరణ, భయానకమైన గ్రామీణ, పట్టణ నిరుద్యోగ స్థితి, ఉద్యోగ కల్పనను నిర్లక్ష్యం చేస్తున్న పాలకులే కుల వృత్తులను ప్రోత్సహించడం, దిక్కు లేక గల్ఫ్ బాట పడుతున్న యువతరం, ప్రగతిశీల ఆలోచనలను రేకెత్తించే పుస్తకాల పట్ల ఆదరణ, చిన్నారి పిల్లల నుంచి, వృద్ధుల నుంచి, సాధారణ ప్రజల వరకు ఎందరెందరో అందించిన ఆదరాభిమానాలు, అనారోగ్య బాధితులై కూడ కార్యకర్తలు పాల్గొన్న తీరు, గ్రామీణ యువతలో మద్యం, సినిమా, క్రికెట్, సెల్‌ఫోన్ వంటి వ్యసనాలను పెంచి పోషిస్తున్న రాజకీయ వ్యవస్థ, ఇసుక వ్యాపారపు మాఫియా, రాజ్య నిర్బంధం, స్థానిక పెత్తందార్ల దౌర్జన్యాలు, ఉత్తర తెలంగాణలో దొరతనాన్నీ, నయాదొరతనాన్నీ పునర్నిర్మించుకోవడానికి జరుగుతున్న ప్రయత్నాలు, ఎన్నో గ్రామాలకు రవాణా సౌకర్యాలు లేకపోవడం, ఆసిడ్‌తో సమానమైన మంచినీళ్లు తాగవలసిన దుస్థితిలో గ్రామాలు, రిజర్వేషన్ల సమస్య, సంఘ్ పరివార్ దుర్మార్గం చాపకింద నీరులా వ్యాపిస్తున్న తీరు, మిషన్ భగీరథ వైఫల్యం, గణాంకాలు, చేగెవారా, భగత్ సింగ్, జోతిబా ఫూలే, సావిత్రీబాయి ఫూలే, అంబేద్కర్, హేమెన్ డార్ఫ్... ఇలా కేవలం జాబితా చెప్పినా ఎన్నెన్ని విషయాలు ఈ యాత్రలో భాగమయ్యాయో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.

ఈ రచయితలిద్దరూ కూడ ఒక పక్క యాత్ర ప్రారంభించే టప్పుడు జీవిత సహచరి ఉద్వేగాలనూ, పిల్లల ఉద్వేగాలనూ, మరొకపక్క పాలనా విధానాల మీద విమర్శనూ కూడ నమోదు చేశారంటే ఎంతో సున్నితమైన విషయాలనూ, ఎంతో గంభీరమైన విషయాలనూ కూడ తమ నిశిత దృష్టి నుంచి తప్పిపోనివ్వగూడదని జాగ్రత్త వహించారని అర్థమవుతుంది. ఇద్దరి రచనాశైలి మధ్య సహజంగానే తేడాలున్నాయి గాని, ఇద్దరూ కూడ చదువరుల ఆసక్తి చెదిరిపోకుండా తాము చెప్పదలచుకున్నది చెప్పడంలో విజయం సాధించారు. కళ్ల ముందరి దృశ్యాన్ని వివరిస్తూనే, ఆ దృశ్యం వెనుక ఉన్న సామాజిక, రాజకీయ, సైద్ధాంతిక అవగాహన ను అందించడానికి ఇద్దరూ గౌరవనీయమైన ప్రయత్నం చేశారు. చాలచోట్ల విజయం సాధించారు.

ముందే చెప్పినట్టు చూసినవీ విన్నవీ చెప్పడం ఒక ఎత్తయితే, రాజకీయ ఉద్యమ నాయకులుగా చెప్పవలసినవి చెప్పడం మరొక ఎత్తు. ఇప్పటికే పెద్దదవుతున్న ఈ ముందుమాటలో అవి వివరించడానికి ప్రయత్నించను గాని, అటువంటి లోతైన ఆలోచనాస్ఫోరకమైన కొన్ని మాటలు ఉటంకించకుండా ఉండలేకపోతున్నాను:

"పాలక పక్షం భావాలే ప్రజాభిప్రాయాలుగా చలామణీ అయితాయనేది నిజం."

"తలకిందుల చరిత్రను నిటారుగా నిలబెట్టాలి."

"చదువు నేటి తరం రాజకీయ సాంస్కృతిక అవసరం."

"వారికి రావాల్సిన పదవులు ఖాళీ అయితే ఆరు నెలల లోపు బై ఎలక్షన్ పెట్టి భర్తీ చేస్తారు. మాకు రావాల్సిన ఉద్యోగాలు ఖాళీ అయితే గట్ల ఎందుకు చేయరు?"

"యువతతో కరచాలనం అంటే కాలపు వేగాన్ని కలుసు కోవడం. యువత గుండెలను తడిమి చూడడమంటే పరుగెత్తే నెత్తురును పట్టి చూడడం. యువజనాన్ని కలవడమంటే ప్రవాహంతో మమేకమవడం."

"రెండు వేల సంవత్సరంలో పుట్టినోళ్లను కూడా బడికి రానియ్యని కుట్రదారులెవ్వర్రా అని గట్టిగా అరవాలనిపించింది."

"ఉత్పత్తి కులాల ఉత్పత్తి విధానాలను సృజన శాస్త్రంగా పరిగణించకుండా వారిని శాస్త్రవేత్తలుగా, క్రియేటర్స్‌గా గుర్తించకుండా శ్రమ ఫలితాలను అనుభవిస్తూ వారి విజ్ఞాన శాస్త్ర సంపదను అండర్ మైన్ చేశారు."

"శ్రమ సౌందర్యారాధనకు బదులు భ్రమ సౌందర్యాన్ని ఆరాధన చేయిస్తున్నారు."

"ఇక్కడ కలలు అణచబడ్డయ్. తొక్కబడ్డయ్. కుంగబడ్డయ్. వేల ఏండ్ల వారి జీవనం వారిని జీవం ఉన్న శవంగా మార్చింది."


"పట్టణానికి ఎంత దూరంగా ఉంటే మనుషులు అంత స్వచ్ఛంగా ఉంటారేమో..." వంటి ఉటంకించదగిన పరిశీలనలూ, ప్రజాభిప్రాయాలూ కోకొల్లలు. ఎంత ప్రశంసనీయమైన కృషిలో కూడ మెరుగుపెట్టవలసినవీ, విమర్శించదగినవీ కొన్నయినా ఉంటాయి. ఇంత మంచి కృషిలో, ఇంత మంచి రచనలో విమర్శనాత్మకమైన అంశాలను ఎంచి చూపడం నాకు ఇష్టం లేదు. కాని రెండు మూడు అంశాలైనా చెప్పక తప్పదు.

కొన్ని సందర్భాలలో అవసరమైన చోట్ల కూడ, ముఖ్యంగా విజయ్ రచనలో, వివరణలు, రాజకీయ, సామాజిక వ్యాఖ్యలు లేకుండా కేవలం సమాచారం రాయడం జరిగింది. కనీసం ఎడిటింగ్ సమయంలోనైనా ఆ ఖాళీలు పూరిస్తే బాగుండేది.

ఈ యాత్రలో ఒకటి రెండు సందర్భాలలో స్థానిక నాయకులు డిజె సౌండ్ ఏర్పాటు చేసినట్టు ప్రస్తావన వచ్చింది. యువత ఏ వ్యసనాలకు గురవుతున్నారని ఈ పుస్తకంలోనే విమర్శ సాగిందో అటువంటి సామ్రాజ్యవాద సంస్కృతిలో ఒకానొక అంశమే డిజె. దాన్ని ప్రగతిశీల సంస్థలు తమ సాంస్కృతిక అవసరాల కోసం వాడుకోవడం అవసరమా, ఉచితమా ఆలోచించాలి.

అలాగే "మా దేహం ముక్కలైనా ఈ దేశంను ముక్కలు కానివ్వం" అనేది అఖండ భారత్ కలలు గనే సంఘ్ పరివార్ నినాదమే గాని మార్క్సిస్టుల నినాదం కాదు. జాతులకు విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికార హక్కు ఇస్తామనేది మార్క్సిస్టుల నినాదం. అసలు ఈ దేశం 1947 వరకు ఆరువందల ముక్కలుగా ఉండేది. వాటిలో కొన్ని అయినా జాతులు అని, వాటికి స్వయంనిర్ణయాధికారం ఇస్తామని మార్క్సిస్టులతో పాటు జాతీయోద్యమం కూడ అన్నది. నిజంగా వలసవాదులు వెళ్లిపోయే సమయం వచ్చేసరికి ఆ అవగాహన మారిపోయి, సామ్రాజ్య వాదులకు, దేశీయ దళారీలకు ఉమ్మడి మార్కెట్ సృష్టించడానికి 'ఒకే జాతి' అనే మాట వచ్చింది.

సోవియట్ యూనియన్ లాగ జాతుల నందనవనంగా ఐక్య సమాఖ్య ఏర్పడితే సరే గాని, జాతుల బందిఖానాగా దేశం తయారయింది. ఇక్కడ ఏదైనా జాతి, ఏదైనా ప్రజాసమూహం తన స్వయంనిర్ణయాధికారం కోరితే దాన్ని వ్యతిరేకించడం మార్క్సిస్టులకు తగిన పని కాదు. మార్క్సిస్టులు కావాలని ముక్కలూ చేయరు, ప్రజలు కోరుకుంటే ముక్కలు కావడానికి అభ్యంతరమూ చెప్పనవసరం లేదు. ఈ సమస్యలు ఉన్నప్పటికీ, మొత్తంగా ఈ యాత్ర, ఈ పుస్తకం చాల గౌరవించ వలసిన, ప్రశంసించవలసిన సంప్రదాయాలకు చిహ్నాలు. అందుకు ఈ ఇద్దరు రచయితలనూ హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ❑




# కార్మికవర్గ చైతన్యపు తొలి మెరుపు
# పారిస్ కమ్యూన్

తెలకపల్లి రవి

ప్రపంచ చరిత్రలో తొలి కార్మిక వర్గ రాజ్యమైన పారిస్ కమ్యూన్ నూట యాభయ్యవ వార్షికోత్సవం మానవ ప్రస్థానంలో మరవరాని ఘట్టం. తాము మాత్రమే పాలించగలమన్న దోపిడీ వర్గాల దురహంకారానికి చరిత్ర ఇచ్చిన తొలి సమాధానం పారిస్ కమ్యూన్. మహా మహోపాధ్యాయులైన మార్క్స్, ఎంగెల్సుల కాలంలోనే వారి మౌలిక భావాల విజయానికి తొలి సంకేతంగా ఆవిర్భవించి అమూల్యమైన పాఠాలు అందించింది పారిస్ కమ్యూన్. అది ప్రపంచ చరిత్ర పరిణామ క్రమంలో కార్మికోద్యమ వికాస గతిలో సంభవించిన విప్లవమే తప్ప యాదృచ్ఛికం కాదు. పారిస్ కమ్యూన్ నూట యాభయ్యవ వార్షికోత్సవం సమయంలో ఆ చరిత్ర ఒక్కసారి రేఖామాత్రంగా దర్శిద్దాం. జేజేలర్పిద్దాం.

ఐరోపా, అమెరికాలలో పెట్టుబడిదారీ విధానం సాధించిన అభివృద్ధి 19వ శతాబ్ది ద్వితీయార్థంలో సామాజికాభివృద్ధికి ప్రాతిపదిక అయింది. అన్ని రకాలైన భారీ ఫ్యాక్టరీలు వెలిశాయి. సమాచార సంబంధాలలో కొత్తగా 'టెలిగ్రాఫ్' ప్రవేశించింది. 1859లో ఛార్లెస్ డార్విన్ జీవపరిణామాన్ని కనుగొన్నాడు. అయితే 1857లో అమెరికా, ఐరోపాలు తొలిసారిగా అధికోత్పత్తి అనే సంక్షోభం ఎదుర్కొన్నాయి. ఆనాటికి అత్యధికంగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశం బ్రిటన్. అయితే ప్రజల పరిస్థితుల్లో తీవ్రమైన వ్యత్యాసాలు ఉండేవి. ఫ్యాక్టరీ యజమానులు, బ్యాంకర్లు, నౌకాధినేతలు భూస్వాములు అపార సంపదలు పోగు పోసుకుంటుంటే, కార్మికులు, ఇతర సామాన్య ప్రజలు దుర్భర జీవితం గడిపేవారు. రైతాంగం పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. వలస దేశాల్లో ప్రజల బాధలు సరేసరి.

19వ శతాబ్దిలో అమెరికాలో పెట్టుబడిదారీ విధానం చాలా వేగంగా పెరిగింది. అయితే ఉత్తర భాగంలో పరిశ్రమలు, పశ్చిమంలో వ్యవసాయం వృద్ధి చెందాయి. దక్షిణాన మాత్రం ఇంకా బానిస విధానం సాగుతుండేది. పేద రైతు కుమారుడు, నిష్కళంక ప్రజాతంత్రవాది అబ్రహం లింకన్ 1861లో దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యాక ఈ ఘర్షణ అంతర్యుద్ధంగా మారింది. దక్షిణాదిన గల బానిస యజమానులు దేశం నుంచి విడిపోయి, ప్రత్యేక సమాఖ్యగా ఏర్పడ్డారు. 1861-1865 మధ్య ఈ రెండు పక్షాల మధ్య భీషణ సంగ్రామం జరిగింది. ప్రజలు ఎక్కువగా దక్షిణాది రాష్ట్రాలకు వ్యతిరేకంగా పోరాడే సైన్యంలో చేరారు. 1863 చివరి నుంచి బానిసలకు పూర్తి స్వేచ్ఛ కల్పిస్తూ లింకన్ చట్టం తెచ్చాడు. 1865 నాటికి దక్షిణాది రాష్ట్రాలు పూర్తిగా ఓడిపోయాయి. ఇది అమెరికా చరిత్రలో మరో విప్లవం. ఆ తర్వాత 4 రోజులకే ఏప్రిల్ 14న లింకన్ హత్యకు గురయ్యాడు.




బ్రిటన్‌లో వలెనే ఇతర చోట్ల కూడా పారిశ్రామికాభివృద్ధి కార్మికవర్గం పెరగడానికి దారి తీసింది. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా, జర్మనీలలో ట్రేడ్ యూనియన్లు ఆవిర్భవించాయి. సమ్మెల సంఖ్య పెరిగింది. సోషలిస్టు గ్రూపులు, బృందాలు ఏర్పడసాగాయి. 1864 సెప్టెంబర్ 28న లండన్‌లో అంతర్జాతీయ కార్మిక సంస్థ అవతరించింది. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ తదితర దేశాల వారు దానిలో పాల్గొన్నారు. మార్క్స్, ఎంగెల్సు ఉద్యమ ప్రధాన నాయకులుగా, మార్గదర్శకులుగా వున్నారు. శాస్త్రీయ కమ్యూనిజం సూత్రాలను చెబుతూనే, కార్మికులను ఐక్యపరిచే విధంగా మార్క్స్ పత్రాలు రూపొందించారు. రాజకీయాధికార స్వాధీనమే కార్మికుల ప్రథమ కర్తవ్యంగా ముందుకు వచ్చిందని తెలిపారు. దురాక్రమణ యుద్ధాలను ప్రతిఘటించాల్సిందిగా కార్మికులకు పిలుపునిచ్చారు. మరోవైపు మార్క్స్ 1867లో 'పెట్టుబడి' మొదటి సంపుటి పూర్తి చేశాడు. ఇదే కాలంలో ఇటలీ ఏకీకరణ జరిగింది. అనేక ఆటుపోట్ల తర్వాత 1870 చివరిలో ఏకీకరణక్రమం పూర్తయింది. జర్మనీ మాత్రం అప్పటికీ ఐక్యం కాలేదు. పైన బూర్జువా వర్గాలు, దిగువన కార్మికవర్గం కూడా ఏకీకరణ కోరుకున్నాయి. మార్క్సు అనుయాయుడు విల్‌హెల్మ్ లీబ్‌క్నెట్ ఆగస్ట్ బెబెల్, వంటి కార్మిక నాయకులు అందుకోసం పోరాటం నడిపారు. అయితే వారికి కార్మికుల్లో మద్దతు పరిమితంగానే వుండేది. ఫెర్సినాండ్ లాసెల్లీ అనే కార్మిక నాయకుడికి ఎక్కువ పలుకుబడి వుండేది. ప్రష్యన్

నియంత బిస్మార్క్ నాయకత్వంలో జర్మనీ ఏకీకరణ జరగాలని లాసెల్లీ కోరుకున్నారు. ఈ సమస్యపై 1870–71లో ఫ్రాన్స్–ప్రష్యన్ యుద్ధం కూడా జరిగింది. దుర్బలమైన మూడవ నెపోలియన్, నాయకత్వంలోని ఫ్రెంచి సైన్యం. 1870 సెప్టెంబర్ 2న లొంగిపోయింది. ఆగ్రహించిన పారిస్ ప్రజానీకం మరో రెండు రోజుల్లో ప్రభుత్వాన్ని కూలదోసింది.

ప్రష్యన్ సైన్యం దిగ్బంధనంలో పారిస్ ప్రజలు ఆరు మాసాల పాటు వీరోచితంగా పోరాడుతూనే వున్నారు. తిండి దొరకని స్థితిలో కూడా, స్త్రీలు, పిల్లలు సహితం ధైర్యంగా నిలబడ్డారు. కాని ఆనాడు అధికారంలో వున్న లూయీ అడాల్ఫ్ థేర్స్ కీలుబొమ్మ ప్రభుత్వం వారికి అండనివ్వకపోగా, వ్యతిరేకచర్యలకు పాల్పడింది. ఫ్రెంచి కార్మికులు, నేషనల్ గార్డ్స్ అనే సైనికులు చందాలు వేసుకుని ఏర్పాటు చేసిన ఫిరంగిని వెనక్కు తీసుకు వచ్చేందుకు 1871 మార్చి 18న థేర్స్ ప్రభుత్వం సైన్యాన్ని పంపింది. దాంతో ఒక్కసారిగా విప్లవం ప్రజ్వరిల్లింది. ముఖ్యంగా మహిళల ప్రేరణతో సైనికులు, ప్రజలు, సైనికులకు ఎదురు తిరిగారు. థేర్స్ వర్సయిల్స్ పారిపోయాడు. పారిస్ అధికార కేంద్రమైన హోటల్ డీవిలాపై ఎర్రజెండా ఎగిరింది. ఆ మరుసటి రోజే వేలాదిమంది పారిస్ కార్మికులు వీధుల్లోకి వెల్లువగా వచ్చారు. ధనవంతులు, భూస్వాములు వర్సయిల్స్‌కు పారిపోయారు. చరిత్రలో మొదటి సారిగా పారిస్‌లో 1871 మార్చి 21న కార్మికవర్గం అధికారం హస్తగతం చేసుకుంది. ఆ పోరాటం పరిస్థితిని బట్టి అప్రయత్నంగా ప్రజ్వరిల్లిందే.

ప్రష్యా దురాక్రమణను అసమర్థుడైన నెపోలియన్ చక్రవర్తి గాని, తర్వాత వచ్చిన థేర్స్ బూర్జువా తొత్తు ప్రభుత్వం గాని గట్టిగా ఎదుర్కోలేని స్థితిలో పారిస్ ప్రజలు చొరవ తమ చేతుల్లోకి తీసుకుని ఆ పాలకులను తోసివేశారు. ప్రష్యాను ఎదుర్కొనేందుకు ఏర్పరిచిన నేషనల్ గార్డు, అది ఎన్నుకున్న కేంద్ర కమిటీ ఇందుకు నాయకత్వం వహించాయి. థేర్స్ ప్రభుత్వం ప్రజలపైకి తుపాకులు మళ్ళించిన తర్వాత సెంట్రల్ కమిటీ రాజకీయాధికారాన్ని కూడా తన చేతుల్లోకి తీసుకుంది. ఆ విధంగా చరిత్రలో కార్మికవర్గ తొలి విప్లవ ప్రభుత్వమేర్పడింది. దీనిలో ప్రముఖులంతా కార్మికులే. కార్మికులు, వృత్తిదారులు, చిత్రకారులు, రచయితలు కూడా కేంద్ర కమిటీ సభ్యులుగా వున్నారు. కార్మికవర్గ పోరాటాలను పక్కదారి పట్టించే సిద్ధాంతకర్తలు కూడా కొందరు దానిలో చోటు సంపాదించారు. పారిస్ కమ్యూన్ చేపట్టిన తొలి చర్య – ప్రజా కంటక ప్రభుత్వ అధీనంలోని సైన్యాన్ని రద్దు చేయడం. కార్మిక వర్గాధికారాన్ని సహించలేని బూర్జువాలు, కులీనుల ప్రేరణపై అధికార వర్గాలు అన్ని బాధ్యతలు వదలిపోయారు. కాని కార్మికవర్గం బెదిరిపోకుండా మరింత ధైర్యంతో అన్ని బాధ్యతలు తానే చేపడుతున్నట్లు ప్రకటించింది. సెంట్రల్ కమిటీ సభ్యులైన కార్మికులు, విద్యార్థులు, జర్నలిస్టులు, వృత్తిదారులు ప్రభుత్వశాఖల నిర్వహణ చేపట్టారు. అనుభవం లేకపోయినా విప్లవోత్సాహం, దీక్షలతో స్వల్పకాలంలోనే విప్లవ ప్రభుత్వం అన్ని విభాగాలను పని చేయించగలిగింది. పారిస్ కమ్యూన్‌కు ఎన్నికలు జరుగుతాయని సెంట్రల్ కమిటీ మొదటే ప్రకటించింది.

మార్చి 26న సార్వత్రిక ఓటింగుతో ఎన్నికలు జరిగాయి. మార్చి 28న అశేష ప్రజల సమక్షంలో హోటల్ దేవిలా భవనంలో పారిస్ కమ్యూన్ అధికారం స్వీకరించింది. పారిస్‌కే పరిమితం గాకుండా మొత్తం ఫ్రెంచి రిపబ్లిక్‌కు వర్తించేలా అది ఎన్నో ప్రగతిశీల శాసనాలు చేసింది. థేర్స్ తొత్తులైన విద్రోహ అధికారులను పూర్తిగా తొలగించి, కొత్తవారిని ఎంపిక చేసి నియమించింది. ప్రభుత్వాధికారులు కూడా ప్రజల నుంచి ఎన్నిక కావాలని ఆదేశించింది. అలాంటి విప్లవాత్మక చర్యలు గతంలో ఎవరూ తీసుకోలేదు. ఆ చర్యల పూర్తి ప్రాధాన్యత, ప్రభావం కమ్యూన్ నాయకులకే సంపూర్ణంగా తెలియదు. మార్క్స్, ఎంగెల్సులు మాత్రమే ఆ విషయం అర్థం చేసుకున్నారు. కార్మికవర్గ నాయకత్వానికి తొలి ఉదాహరణగా పారిస్ కమ్యూన్‌ను ఆయన పరిగణించాడు. కాని అది ఆ దిశలో ఒక ప్రయత్నం మాత్రమే. దాని నాయకులకు తగినంత అవగాహన లేకపోవడమే గాక వారు పరిస్థితులు ఎటు నడిపిస్తే అటు నడిచారు. అయినాసరే– కార్మికవర్గం బూర్జువా అధికార యంత్రాంగాన్ని నాశనం చేయగలదని, చేయాలని, ఆ స్థానంలో మరింత ఉన్నతమైన యంత్రాంగాన్ని ప్రవేశ పెట్టాలని పారిస్ కమ్యూన్ నిరూపించింది. కమ్యూన్ అధికారం చేపట్టిన మరుసటి రోజే రాజకీయ ఖైదీలను విడుదల చేసింది. తాకట్టు వస్తువుల అమ్మకాన్ని నిషేధిస్తూ, 15 ఫ్రాంకుల లోపు విలువ గల వస్తువులను వెంటనే వాటి స్వంతదార్లకు ఇచ్చేయాలని ఆదేశించింది. కౌలు చెల్లించనందుకు గాను భూముల నుంచి తొలగించడాన్ని నిషేధించింది. పేదలకు 10 లక్షల ఫ్రాంకులు భత్యంగా చెల్లించే ఏర్పాటు చేసింది. యజమానులు వదిలివెళ్ళిన పరిశ్రమలను కార్మికులకు, ఉత్పత్తిదార్ల సమాఖ్యలకు అప్పగిస్తూ ఒక చట్టం తెచ్చింది. బూర్జువాలు వదిలిపోయిన ఫ్లాట్లను యుద్ధంలో ఇళ్ళు కోల్పోయిన వారికి, ఇళ్ళు లేని వారికి కేటాయించింది. చర్చిని, ప్రభుత్వాన్ని వేరుపరుస్తూ చట్టం చేసింది. ప్రజలకు విద్యా సౌకర్యం పెంచే చర్యలు చేపట్టింది.

ఇన్ని మహత్తర చర్యలు తీసుకున్నప్పటికి పారిస్ కమ్యూన్ నాయకులు చేసిన పలు విధాలైన పొరబాట్లు బూర్జువాలకు వరప్రసాదమయ్యాయి. థేర్స్ అనుకూల సైనికులు పారిస్ నుంచి వర్సెయిల్స్ తరలివెళ్ళకుండా అడ్డుకోకపోవడం మొదటి తప్పిదం.

☞ మిగతా 39వ పేజీలో

## తణుకులో స్ఫూర్తిదాయకంగా

# కలిదిండి భీమరాజు జయంతి సభ

దేశంలో జరుగుతున్న రైతుల ఆందోళనలను, కార్మికులు సాగిస్తున్న పోరాటాలను, వివక్ష పూరితమైన పౌరసత్వ చట్టాలను, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్యలను, పౌరహక్కులపైనా జరుగుతున్న దాడులను విశ్లేషిస్తూ ప్రత్యామ్నాయ రాజకీయ ఆవశ్యకతపై సీనియర్ పాత్రికేయులు



కె రామచంద్రమూర్తి స్మారకోపన్యాసం చేశారు. ఆయన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. జాతీయ స్ఫూర్తి సంపాదకులు డి.వి.వి.ఎస్.వర్మ అధ్యక్షతన జరిగిన ఈ సభకు పట్టణంలోని వివిధ వర్గాల, పార్టీల ప్రముఖులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.




స్మారకోపన్యాసం చేస్తున్న సీనియర్ పాత్రికేయులు కె. రామచంద్రమూర్తి



## గ్రాంసీ భావజాలంపై అర్థవంతమైన చర్చలు

కలిదిండి భీమరాజు 88వ జయంతి సందర్భంగా మార్చి 21 ఆదివారం ఉదయం 10 గం. నుండి సా 4 గం. వరకు ఇటాలియన్ కమ్యూనిస్టు, మార్క్సిస్టు మేధావి ఆంటోనియో గ్రాంసీ భావజాల ప్రసంగికతపై జరిగిన చర్చాగోష్ఠులలో వివిధ స్రవంతుల మేధావులు, ప్రజా ఉద్యమ కార్యకర్తలు పాల్గొన్నారు

మోదీ తరహా రాజకీయాలను ప్రతిఘటించడానికి, దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాల్ని రూపొందించడానికి ఇటాలియన్ మార్క్సిస్ట్ మేధావి ఆంటోనియో గ్రామ్‌సీ భావజాలం ఉపయోగ పడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు.

మార్క్సిస్ట్ మేధావి, కార్మికోద్యమ నిర్మాత కలిదిండి భీమరాజు జయంతి సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా తణుకులో "గ్రామ్‌సీ భావజాల ప్రాసంగికత" అంశంపై ఆదివారం జరిగిన సదస్సులో రాష్ట్రం నలుమూలల నుండి హాజరైన మేధావులు ప్రసంగించారు.

సదస్సుకు ప్రముఖ పాత్రికేయుడు మందలపర్తి కిషోర్ అధ్యక్షత వహించారు. జాతీయ వేదిక అధ్యక్షుడు డా॥ బి.రమేష్ చంద్రబాబు స్వాగతం చెప్పారు.

కిషోర్ మాట్లాడుతూ మార్క్సిస్ట్ మహోపాధ్యాయులు రూపొందించిన సిద్ధాంతాల్ని సమకాలీన పరిస్థితులకు వర్తింప చేయడం పెనుసవాలనీ అన్నారు.

స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సైద్ధాంతిక పరిభాష రూపొందాలని, అది ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పాలని కిషోర్ పేర్కొన్నారు. భాషలో ప్రజాస్వామ్యసంస్కృతి రావాలన్నారు.

భారత దేశ పరిస్థితులకు గ్రామ్‌సీ భావజాలం ఒక సేంద్రియ జీవ ప్రక్రియగా పనికి వస్తుందని అన్నారు.


"జాతీయస్ఫూర్తి" పత్రికా సంపాదకుడు డి.వి.వి.ఎస్.వర్మ "గ్రామ్‌సీ భావజాల ప్రాసంగికకత" అంశంపై ఒక పత్రాన్ని సదస్సు ముందుంచారు.

వర్మ మాట్లాడుతూ దేశంలోని ప్రస్తుతం ఏర్పడిన కొత్త రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోవడంలో గ్రామ్‌సీ భావజాలం తోడ్పడుతుందని, ప్రత్యామ్నయ రాజకీయశక్తి ఆవిర్భావానికి గ్రామ్‌సీ చెప్పిన పౌరసమాజసమ్మతి రూపొందించాలని వర్మ పేర్కొన్నారు.

☞ మిగతా 34వ పేజీలో

# మోదీ రాజకీయంలో ప్రత్యేకతలు గ్రాంసీ భావజాలం

డి వి వి ఎస్ వర్మ
జాతీయ స్ఫూర్తి సంపాదకులు



*(తణుకు - గ్రాంసీ భావజాల సమాలోచన గోష్టికి రాసిన వ్యాసం)*

మోదీ రాజకీయం మామూలు రాజకీయం కాదు. సంప్రదాయ రాజకీయానికి పూర్తిగా భిన్నమైంది. ఈ ప్రత్యేక తరహా రాజకీయాన్ని ఆవిష్కరించడానికి, విశ్లేషించడానికి సంప్రదాయ రాజకీయ కొలబద్దలు పనికిరావు. ఇటాలియన్ మార్క్సిస్టు ఆంటోనియో గ్రాంసీ రచనలలోని భావజాలం మనకు ఉపకరిస్తుంది. మోదీ రాజకీయాన్ని ప్రతిఘటించడానికి, ప్రత్యామ్నాయ రాజకీయాన్ని రూపొందించడానికి అది దారి చూపిస్తుంది. మోదీ రాజకీయాన్ని అర్థం చేసుకోడానికి మనం కొత్త ఉపకరణాలను రూపొందించుకోవాలి. ప్రతిఘటించడానికి కొత్త మార్గాలను అన్వేషించుకోవాలి.

ఈ పత్రం సర్వసమగ్రమైంది కాదు. ఒక కొత్త తరహా రాజకీయ చర్చకు ప్రేరణ ఇచ్చే ప్రయత్నం మాత్రమే. ఇలాంటి చర్చోపచర్చలు సాగాలి. ఈ అంతర్మథనం నుండి కొత్తదారిని రూపొందించుకునే ప్రయత్నాలు జరగాలి. ఈ అంశాలపై అర్థవంతమైన చర్చను సాగిద్దాం. మన ఆలోచనలకు పదును పెడదాం. ఈ ప్రయత్నంలో అందరినీ పాలుపంచుకోవలసిందిగా కోరుతున్నాం.

## ప్రజలు కష్టాలను భరిస్తున్నారు - మోదీని ఆమోదిస్తున్నారు.

ఇది మన కళ్లముందు కనిపిస్తున్న రాజకీయ వైరుధ్యం, పాలకులు ప్రజల నెత్తిన భారాలు పెడితే వారు దానిని నిరసించాలి. ప్రతిఘటించాలి. పాలకులు ప్రజాదరణ కోల్పోవాలి లేదా పరాజయం పొందాలి. కాని ప్రస్తుత పరిస్థితి దీనికి భిన్నంగా వుంది. పప్పులు నూనెల ధరలు విపరీతంగా పెరిగాయి. పెట్రోలు, డీజిల్ ధరలు సెంచరీ చేస్తున్నాయి. నిరుద్యోగం కోవిడ్‌కి ముందే తారాస్థాయికి చేరింది. తర్వాత ఉపాధి స్థితి అధ్వాన్నం అయింది. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు మద్దతు ధర పెరగకపోగా ఉన్నదీ ఉండగొట్టబడుతుంది. కొత్త వ్యవసాయ చట్టాలు, కొత్త కార్మిక చట్టాలు, కొత్త పౌరసత్వ చట్టాలు అన్నీ ప్రజావ్యతిరేకమైనవే. పౌరహక్కుల మీద, ప్రజాస్వామ్య వ్యవస్థల మీద నిత్యం దాడులు జరుగుతున్నాయి. రూపాయినోట్ల రద్దుతో కుదేలైన ఆర్థికవ్యవస్థ ఎన్ని ఉద్దీపనలు యిస్తున్నా తిరోగమనంలోనే వుంది. కోవిడ్ కాలంలో ప్రజలు పడ్డ, పడుతున్న కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. నిత్యజీవితంలో ప్రజలు ఇన్ని కష్టాలను భరిస్తున్నారు. దేశంలో ఉల్లిపాయల ధరలు పెరిగితే ప్రభుత్వాలు పడిపోయిన దేశంలో ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ప్రజలు కష్టాలను భరించడానికి సిద్ధం అవుతున్నారు. కాని మోదీని వదిలించుకోవాలని భావించడం లేదు.

2020 జనవరిలో ఇండియాటుడే నిర్వహించిన “మూడ్ ఆఫ్ ది నేషన్” సర్వేలో మోదీ జనాకర్షణ కించిత్తు కూడా తగ్గలేదని, ఎన్నికలు జరిగితే 302 సీట్లు గెలుస్తారని వెల్లడించింది. ప్రజలు మోదీ పాలనలో కష్టాలను భరించడానికి ఎందుకు సిద్ధం అవుతున్నారు? మోదీ పట్ల మోజును ఎందుకు వదులుకోవడం లేదు? మోదీ రాజకీయంలోని ఈ ప్రత్యేకతను ఎలా అర్థం చేసుకోవాలి అన్న దానిని మనం చర్చించాలి.

## మోదీ ప్రభంజనం వెనక...

సంప్రదాయ రాజకీయమా? సంక్షోభకాలపు ప్రత్యేక రాజకీయమా?

2014 ఎన్నికలలో మోదీ ఘన విజయం సాధించారు. ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికలలో అధికార మార్పిడి సహజం. ఈ అధికార మార్పిడి సంప్రదాయ రాజకీయ పరిణామంగానే జరిగిందా? లేక సంక్షోభకాలపు ప్రత్యేకత వల్ల జరిగిందా అన్నది మరో చర్చనీయాంశం.

2014 ఎన్నికల నాటికి దేశంలో రాజకీయ సంక్షోభం లేదా నాయకత్వ సంక్షోభం చోటు చేసుకుంది. మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం అవినీతి కుంభకోణాల పరంపరలో చిక్కుకుంది. అవినీతికి వ్యతిరేకంగా లోక్‌పాల్ చట్టం కోసం అన్నా హజారే



ప్రారంభించిన ఉద్యమం ఢిల్లీని కదిలించింది, దేశవ్యాపిత ఉద్యమ రూపం ధరించింది. రాజకీయాలకు దూరంగా వుండే మధ్యతరగతి వర్గాలు ఈ రాజకీయ ఉద్యమంలో పాత్రధారులయ్యారు. సోనియా గాంధీ చేతిలో కీలుబొమ్మ ప్రధానిగా మన్మోహన్‌ను నిర్ణయాలు తీసుకోలేని అసమర్థునిగా భావించారు. అలాగే ముంబై పేలుళ్లపై పాకిస్తాన్‌తో ధీటుగా వ్యవహరించలేదన్న విమర్శలు చేశారు. ఎన్నికల నాటికి పాలక పార్టీ "నాయకత్వ సంక్షోభం" లో పడింది.

ఇలాంటి రాజకీయ సంక్షోభాలపై ఆంటోనియో గ్రాంసీ తన రచనలలో చాలా లోతైన విశ్లేషణలు చేశారు. పాలక పార్టీ తన అధికారాన్ని కొనసాగించలేని స్థితి మరో పక్క ప్రతిపక్షాలు దానిని తొలగించలేని స్థితి వున్నప్పుడు రాజకీయ సంక్షోభంలో అనిశ్చితి ఏర్పడుతుంది. అలాంటి అనిశ్చితి పరిస్థితులలో రాజకీయ రంగంలో సమ్మోహనాశక్తులకు ద్వారాలు తెరుచు కుంటాయి. ఈ అనిశ్చితిని తొలగించగల హీరోలకోసం, ప్రజల వెదుకులాట ప్రారంభం అవుతుంది. ఇది స్థూలంగా గ్రాంసీ విశ్లేషణ సారాంశం.

2014 నాటికి కాంగ్రెస్ పార్టీ అధికారానికి నూకలు చెల్లాయి. కాని దాని స్థానాన్ని ఏ పార్టీ ఆక్రమించగల స్థితిలేదు. అలాగే ప్రాంతీయ పార్టీలు, వామపక్షాలు అధికారం చేపట్టగల స్థితి కనిపించలేదు. గ్రాంసీ పేర్కొన్నట్లు ఇలాంటి అనిశ్చితి కాలంలో ప్రజలు హీరోల కోసం వెదుకులాడడం సహజం.

అయితే దీనిని మోదీ గాని బి.జె.పి పార్టీ గాని ముందుగానే పసిగట్టిన దాఖలాలు లేవు. మోదీ తన ఎన్నికల ప్రచారంలో హిందూత్వాన్నీ, రామాలయాన్ని తెర వెనుకనే వుంచారు అందరికీ మంచి రోజులు. అందరికీ అభివృద్ధి యువతకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, విదేశాలలో ఉన్న అవినీతి సొత్తు తెచ్చి తలా 15 లక్షల పంపిణీ వంటి సంప్రదాయ పార్టీల నినాదాలనే ఎన్నికల ప్రచారంలో ముందుకు తెచ్చారు. గుజరాత్‌లో సాధించిన విజయాలనే దేశం అంతా సాధిస్తానన్న ప్రచారాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. అయితే ఈ నినాదాలు ఆయన విజయానికి ఎంత వరకు దోహదం చేశాయో తెలియదు కాని ప్రజలు, ప్రత్యేకించి యువత ఆయన వాగ్దానాల కోణం నుండి కాకుండా దేశాన్ని రక్షించే, నడిపించే హీరోగా ఓట్ల ప్రభంజనాన్ని సృష్టించారు.

ఈ ఎన్నికల్లో ఆయన గెలుపునకు వాడిన నినాదాలకంటే "నాయకత్వ సంక్షోభం" కాలపు ప్రజల మనోస్థితి ప్రధానపాత్ర వహించిందని భావించవచ్చు. ఇది మోదీ సృష్టించిన ప్రభంజనం కాదు. సంక్షోభకాలంలో ప్రజల మనోస్థితి సృష్టించిన ప్రభంజనం. అందువల్ల మోదీ బలం ఆయన ప్రచారం చేసిన నినాదాలలో కంటే ప్రజల మనోభావాల స్థితిలో వుందన్న అంశాన్ని మనం పరిశీలించాలి.

## మోదీని హీరోని చేసింది ఎవరు ?

పౌరసమాజంలో భావజాల ఆధిపత్యం లేదా ప్రాబల్యం నిర్వహించే పాత్రపై గ్రాంసీ తన హెజమనీ సిద్ధాంతంలో విపులంగా చర్చించారు. పాలకవర్గాలు తన పాలన సాగించడానికి బలప్రయోగ పద్ధతులతోపాటు పౌరసమాజ సమ్మతిని పొందడం కూడా సాధనం చేసుకుంటారు. ఈ పౌర సమాజ సమ్మతిని ప్రభుత్వేతర పౌర సంస్థలన్నింటి ద్వారా అంటే పాఠశాలలు, మత సంస్థలు, సాంస్కృతిక సంస్థలు వగైరాలన్నింటినీ వినియోగించు కుంటారు. ఈ భావజాల ప్రాబల్యాన్ని సాధించడంలో సవర్గ మేధావుల పాత్రను ఆయన వివరించారు. ఇది పాలక వర్గాల హెజమనీకి దానికి ప్రత్యామ్నాయంగా రూపొందే కౌంటర్ హెజమనీ సాధనలోనూ కీలకపాత్ర పోషిస్తుంది. ఈ విశ్లేషణ నేపథ్యంలో మోదీని హీరోని చేసిన అంశాలను పరిశీలించడం అవసరం.

2017లో అమెరికాకు చెందిన అసోసియేషన్ ఫర్ పబ్లిక్ సీనియర్ (AB) సంస్థ భారతప్రజల రాజకీయ అభిప్రాయాల మీద సర్వే నిర్వహించింది. దేశంలో ఎలాంటి మినహాయింపులు లేని ప్రజాస్వామ్య ప్రభుత్వమే వుండాలన్న స్పష్టమైన నిబద్ధతను ప్రకటించిన వారు కేవలం 8 శాతం వున్నారు. సర్వే చేసిన వారిలో 67 శాతం మంది ప్రజాస్వామ్యం పట్ల కొంత విశ్వాసం ప్రకటించినప్పటికీ వారు ప్రజాస్వామ్య రహిత ప్రభుత్వాల పట్ల కూడా సానుకూలతను వ్యక్తం చేశారు. 55 శాతం మంది నిరంకుశ ప్రభుత్వాలను సమర్థించారు.

27 శాతం మంది "బలమైన నాయకుడు" అవసరం అన్నారు. అంతే కాదు 53 శాతం మంది సైనికపాలన అవసరంగా భావించారు. భారతదేశానికి పాకిస్థాన్ అత్యంత ప్రమాదకరమైన దేశంగా భావించారు. ఈ సర్వే 2017లో నిర్వహించినా ఇలాంటి భావాలు చాలకాలంగా ప్రజలలో వ్యక్తం అవుతూనే వున్నాయి.

దీనికి తోడు బి.జె.పి మాతృసంస్థ రాష్ట్రీయ స్వయక్ సేవక్ సంఘ్ గత 95 ఏళ్లుగా చరిత్రనీ, సంస్కృతిని వక్రీకరిస్తూ మతవిద్వేష భావజాలాన్ని, గత కాలపు హిందూ వైభవాలనీ, మత జాతీయవాదాలు వగైరాలను నూరిపోస్తూనే వుంది. పైగా హీరోల చుట్టూ చరిత్రరచన, పురాణాలనే చరిత్రగా ప్రచారం నేటికీ నడుస్తూనే వుంది.

రాజకీయరంగంలో "నాయకత్వ సంక్షోభం" తలెత్తినప్పుడు హీరోల కోసం వెదుకులాటలు ప్రారంభమైనప్పుడు పౌరసమాజం లోని ఈ భావజాలం కీలకపాత్ర పోషిస్తుంది.

ఈ భావజాలానికి తగిన ప్రతినిధిగా మోదీ కనిపించారు. ఆయనను ఈ భావజాలమే హీరోని చేసింది. దేశాన్ని ఐక్యపరిచిన

వ్యక్తిగా ప్రాచుర్యంలో వున్న "సర్దార్ పటేల్"కు నివాళిగా ప్రపంచంలోనే అతి పెద్ద విగ్రహనిర్మాణాన్ని మోదీ ప్రకటించారు. మోదీలో "ఉక్కుమనిషి"ని అందులో చూశారు. గుజరాత్ అభివృద్ధి నమూనా ప్రచారంతో "మోదీ" వికాశ్‌పురుష్" అయ్యాడు. గుజరాత్ అల్లర్లలో "ముస్లింలను ఉక్కుపాదంతో" అణిచివేసిన "ప్రతీకారేచ్ఛకు" ప్రతిరూపం అయ్యారు. భార్యను విడనాడి భరతమాత సేవకు అంకితమైన "సర్వసంగపరిత్యాగి" 'భారత్‌మాతాకి జై" అంటూ దేశం కోసమే జీవిస్తున్న హీరోగా ప్రచారం సాగింది.

మొత్తం మీద పౌరసమాజంలో రూపొందిన ఈ భావజాలం కోరుకున్నది "దేశరక్షకుడైన ఉక్కుమనిషిని" దేశానికి ప్రమాదకారి అయిన పాకిస్థాన్‌కు తగిన బుద్ధిచెప్పగల హిందూజాతీయవాదిని, గతకాలపు వైభవాలను పునరుద్ధరించే హీరోనే.

మోదీ విజయం తర్వాత ప్రజలు ఆయన పాలనను ఈ కళ్లద్దాలతోనే చూస్తున్నారు. ఇతర విషయాలో మోదీ వైఫల్యాలు వారికి అంతగా పట్టకపోవడానికి ఇదే కారణం.

## ప్రజా సమస్యలకు దూరం - జనాకర్షణకు మార్గం

మోదీ ఒక సాధారణ రాజకీయవాదిగా వ్యవహరించడం లేదు. ప్రభుత్వ పాలన తనకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తు న్నారు. ఆయన ప్రసంగాలలో ప్రజలు నిత్యజీవితంలో పడుతున్న కష్టాలను ప్రస్తావించడం లేదు. వాటిని ఆర్థికమంత్రికి, ఇతర శాఖలకు వదిలేశారు. వాటివల్ల వచ్చే అసంతృప్తికి తాను గురి కాకుండా జాగ్రత్తపడుతున్నారు. తాను హిందూ జాతీయవాదినని ప్రకటించుకున్నారు. తానొక సన్యాసిగా, సంసార జంఝాటం లేనివాడిగా, భౌతిక వస్తువుల సంపద పట్ల ఆసక్తిలేని వానిగా అందరి దృష్టినీ ఆకర్షించుకున్నాడు. ఆయన భారతదేశాన్ని కేవలం రాజకీయవేత్తగా కాకుండా సామాజికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా నడిపించే నేతగా కనిపించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన తపస్సు గురించి, యజ్ఞం గురించి, గతకాలపు హిందూ వైభవం గురించి అనేక ప్రస్తావనలు చేస్తున్నారు. కష్టాలు పడకుండా సుఖాలు, ముక్తి దక్కదన్న భావన కల్పిస్తున్నారు. ఈ మార్గంలో ఆయన అభిమానులని కాకుండా భక్తులను సృష్టించు కుంటున్నారు. భక్తులకు కష్టాలు దేవుడు పెట్టే పరీక్షలు. కష్టాలను అనుభవిస్తారే తప్ప ఆరాధనని వదులుకోరు పైగా మరింత పెంచుకుంటారు. దేశానికి మోదీ అవసరం అన్న నినాదానినుండి పుట్టుకొచ్చిందే.

ఒకే దేశం, ఒకే ప్రజ, అనే నాయకుడు అన్న నినాదం అంతిమంగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేస్తుంది. వైవిధ్యాన్ని తొలగిస్తుంది. నియంతృత్వానికి, ఫాసిజానికి ద్వారాలను తెరుస్తుంది.

అందువల్ల మోదీ రాజకీయాన్ని మరింత లోతుగా అధ్యయనం చెయ్యాలి. మోదీ పాలనాపరంగా బలహీనుడే, ప్రజల మీద భారాలు మోదే సాధారణ రాజకీయవేత్తే, కార్పొరేట్ దోపిడీకి ద్వారాలు తెరిచేవారే. ఆయన బలం ఈ రాజకీయ విధానాలలో లేదు. పౌరసమాజంలో నెలకొన్న భావజాలంలో వుంది. దానిని తన ఆకర్షణగా మార్చుకునే పరిభాషలో వుంది. అందువల్ల మోదీ రాజకీయం మీద ఆర్థిక అంశాల పోరుతో సరిపోదు.

మోదీ రాజకీయం మీద పోరు పౌర సమాజంలో భావజాలం మీద జరగాలి. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటా కొత్త రూపంలో, సరికొత్త నినాదాలతో జరగాలి. అలాంటి ప్రజా ప్రత్యామ్నాయ భావజాలం మీద మన చర్చను కొనసాగిద్దాం. ❑

## గ్రాంసీ భావజాలంపై అర్థవంతమైన చర్చలు

**(31వ పేజీ తరువాయి)**

సి.పి.ఐ. రాష్ట్ర సహాయ కార్యదర్శి జే.వి.వి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ దేశంలో వామపక్ష రాజకీయాలు మరింత ముందుకు వెళ్ళడానికి గ్రామ్‌సీ రచనలు ఉపయోగ పడతాయని పేర్కొన్నారు.

గ్రామ్ సీ ప్రతిపాదించిన అంశాలను అధ్యయనం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.


ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకుడు కే. శాంతారావు, సి.పి.ఎం. జిల్లా నాయకుడు జి.వి. నరసింహారావు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి, సి.పి.ఐ. జిల్లా సహాయ కార్యదర్శి కోనాల భీమారావు, సీనియర్ పాత్రికేయుడు డి.సోమసుందర్, డా. రాజబాబు, కే.వి. సుబ్బరాజు, రవిమారుత్, కటారి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు.

మధ్యాహ్నం "గ్రామ్‌సీ – ఉప శ్రేణుల ఐక్యత" అంశం పై జరిగిన సదస్సుకు కొప్పర్తి వెంకట రమణమూర్తి అధ్యక్షత వహించారు.

ప్రొఫెసర్ ఎన్.అంజయ్య, ఎం.కిషోర్, డా. రామ్ ప్రసాద్, పి.మురళీకుమార్, రవిమారుత్, డి.వి.వి.ఎస్.వర్మ తదితరులు మాట్లాడారు. ❑

# గ్రాంస్కీ ఆలోచనలు : ప్రత్యామ్నాయ రాజకీయాలు - పార్టీ వ్యవస్థలు

కొండూరి వీరయ్య



*(తణుకు - గ్రాంసీ భావజాల సమాలోచన గోష్టికి రాసిన వ్యాసం)*

ఇటలీ కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఆ పార్టీ పోరాటాలు, కృషి, మార్క్సిస్టు పతాకాన్ని సమున్నతంగా నిలిపి ఉంచటంలో అందించిన తోడ్పాటు వంటి అనేక అంశాల గురించి పునర్మూల్యాంకనం జరుగుతోంది. గ్రాంస్కీ కృషిని అధ్యయనం చేయకుండా అటువంటి పునర్మూల్యాంకనం చేయటం అసాధ్యం. గ్రాంస్కీ జైలు నోట్స్ మరియు లేఖలు మొత్తం ఐదు సంపుటాలుగా విడుదల చేయాలని నిర్ణయం అయితే ఇప్పటి ఇంగ్లీషులో లభ్యమవుతోంది. మూడు భాగాలే. ఇంకా రెండు భాగాలు ఇంగ్లీషులోకి అనువాదం కావల్సి ఉంది. అవి కూడా విడుదలైతే గ్రాంస్కీ మేధోవ్యక్తిత్వాన్ని మరింత స్పష్టంగా అధ్యయనం చేయటం, అంచనా వేయటం సాధ్యమవుతుంది.



రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జైలు నోట్స్ పుస్తకరూపంలో వెలుగు చూశాక విప్లవాత్మక మేధావిగా గ్రాంస్కీ కీర్తి ప్రతిష్టలు అనూహ్య స్థాయికి చేరుకున్నాయి. ఏంగెల్స్ మరణానంతరం బెర్న్‌స్టీన్ నాయకత్వంలో పెచ్చరిల్లిన మితవాద ధోరణులను ఎదుర్కొని మార్క్సిస్టు మౌలిక సూత్రాలను సజీవంగా నిలిపి ఉంచే మేధో ఉద్యమానికి నాయకత్వం వహించిన రోసా లగ్జెంబర్గ్, జార్జి లూకాస్ వంటి వారి కోవకు చెందిన మార్క్సిస్టు మేధావి గ్రాంస్కీ. పాతతరానికి చెందిన సాంప్రదాయక మార్క్సిస్టు మేధావి. క్రియాశీల రాజకీయ ప్రచారాందోళనకారుడు, పోరాటశీలి. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నిర్వహణలోనూ, ప్రత్యేకించి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఇటలీ విభాగానికి నాయకత్వం వహించాడు. మొదటి ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకించటంలో, నూతన తరహా పార్టీ నిర్మాణం కోసం సాగిన ప్రయత్నాల్లోనూ చివరకు రెండో ఇంటర్నేషనల్ నుండి విడగొట్టుకోవటంలోనూ గ్రాంస్కీ లెనిన్‌తో గొంతు కలిపాడు. సోషల్ డెమొక్రసీ పార్టీల స్థానంలో పెట్టుబడిదారీ విధానాన్ని సమూలంగా కూకటి వేళ్లతో సహా పెకలించేసే విప్లవానికి మార్గం సుగమం చేయగల విప్లవాత్మక పార్టీ నిర్మాణం కోసం కృషి ప్రారంభించాడు. లెనిన్ తరహాలోనే గ్రాంస్కీ కూడా ఆధునిక పారిశ్రామిక కార్మికవర్గం నుండి ఎంపిక చేసిన సాంప్రదాయక మేధావులను విప్లవాత్మక కార్యాచరణతో మమేకమయ్యే మేధావులుగా తీర్చిదిద్దటానికి కావల్సిన పద్ధతులను రూపొందించాడు.

ఆయా దేశాల నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా నిర్దిష్ట కార్యాచరణను రూపొందించాలన్న లెనిన్ సూత్రాన్ని ఇటలీ నిర్దిష్ట పరిస్థితులకు వర్తింపచేసి నిర్దిష్ట కార్యాచరణను రూపొందించే సమయంలోనే జైలు పాలయ్యాడు. నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనం అన్న సూత్రాన్ని తక్షణ వర్తమాన ఉద్యమ దశలు, వ్యూహాలు, ఎత్తుగడలకే పరిమితం చేయడానికి గ్రాంస్కీ పరిమితం చేయలేదు. ఆయా దేశాల జాతీయతను నిర్మించటంలో కీలకపాత్ర పోషించిన చరిత్ర, తాత్విక నేపథ్యం, ఆర్థిక ప్రత్యేకతలు, సాంస్కృతిక, రాజకీయ నిర్దిష్ట లక్షణాలు, విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లటంలో లేదా ఆటంకపర్చటంలో ఈ ప్రత్యేకతలు పోషించే పాత్రలను నిర్దిష్టంగా అధ్యయనం చేయాలన్న కర్తవ్యాన్ని తనకు తాను నిర్దేశించుకున్నాడు. అటువంటి నిర్దిష్ట అధ్యయనం కృషి ఫలితమే జైలునోట్సు. ఈ నిర్దిష్టతలను ఓ వైపున ఇటలీ ప్రత్యేక పరిస్థితులు, చరిత్ర, తాత్విక నేపథ్యాలకు వర్తింప చేస్తూనే అన్ని దేశాలకూ వర్తింపచేయటానికి కావల్సిన విస్తృత సైద్ధాంతిక ప్రాతిపదికను సిద్ధం చేశాడు.

పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాలో ఆర్థిక సామాజిక సాంస్కృతిక అసమానతలు అంతర్భాగం మాత్రమే కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయోజనాలు ముందుకు తీసుకెళ్లటంలో వ్యూహాత్మక పాత్రను కూడా పోషిస్తాయి. అందువల్లనే ఇటలీలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిలో అనివార్యంగా చోటు చేసుకుంటున్న అసమాన అభివృద్ధి మూలాలను విశ్లేషించటానికి గ్రాంస్కీ ప్రత్యేక శ్రద్ధ పెట్టాడు. ఇటలీ జాతీయతను రూపొందించటంలో కీలక పాత్ర పోషించిన సాంస్కృతిక నిర్దిష్టతలపై దృష్టి కేంద్రీకరించటం గ్రాంస్కీని సమకాలీన మార్క్సిస్టు మేధావులకంటే భిన్నంగా నిలిపిన అంశం. అందుకే గ్రాంస్కీ జైలు నోట్స్‌లో మానవాభివృద్ధి శాస్త్రం, కళలు, సాహిత్యం , రాజకీయ తాత్వికత, సామాజిక సాంస్కృతిక సిద్ధాంతాలు, పాత్రికేయ వృత్తి వంటి

అనేక అంశాలపై చర్చ, విశ్లేషణ, వ్యాఖ్యానం కనిపిస్తాయి. ప్రత్యేకించి దక్షిణాది సమస్య అన్న గ్రాంస్కీ భావన పెట్టుబడిదారీ ప్రపంచీకరణ నేపథ్యంలో అసమాన అభివృద్ధి గురించి జరుగుతున్న సమకాలీన చర్చలకు పూర్వరంగంగా కనిపిస్తుంది. రాజకీయ స్వాతంత్ర్యం ఆర్థిక స్వయంప్రతిపత్తి, అభివృద్ధి నమూనాల స్వయంప్రతిపత్తికి అనివార్యంగా దారి తీయదని, రాజకీయ స్వాతంత్ర్యం, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అమల్లో ఉన్నంత మాత్రాన సామాజిక ఆర్థిక సమానత్వం అనివార్యత కాబోదన్న తాజా చర్చకు పూర్వరంగంగా చెప్పుకోదగ్గ వ్యాఖ్యానాన్ని కూడా ఆయన జైలు నోట్స్‌లో చూడొచ్చు.

మాఖియావెల్లి గురించి గ్రాంస్కీ చేసిన అధ్యయనం సమాజంలో మేధావుల పాత్ర గురించి నూతన కోణాన్ని ఆవిష్కరించింది. వెరసి గ్రాంస్కీ రచనలు 1920-30 దశకాల నాటి సమకాలీన ఇటలీ నేపథ్యాన్ని అధిగమించి 21వ శతాబ్దంలో రాజ్యము, రాజ్యాంగయంత్రము, ఆధిపత్య వ్యవస్థల నిర్మాణం, ప్రత్యాధిపత్య వ్యవస్థల ప్రతిఘటన, ప్రత్యామ్నాయ బౌద్ధిక, భౌతిక సాంస్కృతిక వారసత్వం వంటి మార్క్సిస్టు పరిభాషలో 'ఉపరితలం' పరిధి, నిడివి, లోతులను విస్తృతం చేసే అంశాలకు విస్తరించింది. అందువల్లనే దాదాపు వందేళ్ల తర్వాత కూడా సమకాలీన ప్రాసంగికత కలిగిన అంశాలుగానే ఉన్నాయి. ప్రత్యేకించి పెట్టుబడిదారీ విధానం ఆధునిక దోపిడీ పద్ధతులు, నియంత్రణ రూపాలు, ఆధిపత్య వ్యవస్థలను తెరమీదకు తెస్తున్న ప్రపంచీకరణ దశలో మరింత ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి.

గ్రాంస్కీ రచనల్లో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ వివాదాలు, బోల్షివిక్ విప్లవానంతర పరిస్థితులపై తలెత్తిన సైద్ధాంతిక విబేధాలు, విశ్లేషణలో భిన్నాభిప్రాయాలు వంటివెన్నో కనిపించినా అంతిమంగా ఆయన ఓ నాయకుడు. అరెస్టు అయ్యే సమయానికి ఇటలీ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, ఉద్యమ నిర్మాణం, వ్యూహకల్పన, దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యతల్లో ఉన్న వ్యక్తి. అటువంటి బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న గ్రాంస్కీ రచనలను కేవలం మేధో మధనంగా చర్చించుకోవటానికి పరిమితం కావటం కంటే ఉద్యమ నిర్మాణానికి, నిర్వహణకు ఈ రచనలు దారిదీపాలుగా ఉపయోగపడతాయా అన్న కోణంలో చర్చించుకోవటం మరింత అర్థవంతంగానూ, ప్రయోజనకరం గానూ ఉంటుంది.

గ్రాంస్కీ రచనలపై వచ్చిన వందల రచనలు, వేల వ్యాఖ్యానాల్లో ఓ కోణం మరుగునపడింది. అది రాజకీయ ఉద్యమం, ఉద్యమ నిర్మాణ కోణం. మార్క్సిజం ఆశించిన సామాజిక మార్పు సాధనకు కావల్సిన వ్యూహకల్పన చేయగలిగిందీ, వ్యూహకల్పనకు అనుగుణంగా ఉద్యమ సైన్యాలను నడిపించాల్సిందీ పార్టీ నిర్మాణం. ఆ నిర్మాణానికి దిశా నిర్దేశం చేయాల్సిన రాజకీయ అవగాహన. మానవ సంబంధాలన్నింటినీ మార్మిక సంబంధాలు, ద్రవ్య సంబంధాలుగా మార్చేస్తున్న సమకాలీన పెట్టుబడిదారీ వ్యవస్థ నాయకత్వంలో ఆవిష్కృత మవుతున్న నూతన సామాజిక పరిణామాలు, వాటి చట్టబద్ధత కోసం తెరమీదకు వస్తున్న రాజకీయ పరిభాష, ఆర్థిక అసమానతల శిఖరంపై కూర్చున్న కుబేరులు, వారి సంపద పోగుపడే మార్గాలు, అవకాశాలు, వీటన్నింటినీ ఈ అసమాన సామాజిక వ్యవస్థకు పునాదిగా ఉంటూ దోపిడీకి గురవుతున్న చారిత్రక కూటమి, ఈ కూటమి మధ్య తక్షణ, తాత్కాలిక, శాశ్వత ఐక్యతకు ఎదురవుతున్న ఆటంకాలు, అవగాహనలు వంటి వాటినన్నింటినీ సమగ్రంగా సమర్థవంతంగా లోతుగా, దార్శనికతతో విశ్లేషించటం ద్వారానే అటువంటి నిర్దిష్ట రాజకీయ అవగాహనను సంపాదించుకోగలం. రాజకీయ అవగాహనను ధృవీకరించుకోగలం. అంటే వ్యవస్థను మార్చాలనుకుంటున్న పార్టీ నిర్మాణంలో ఉండాల్సిన పదును, అదును, అనుసరించే ఎత్తుగడలు, రూపొందించే వ్యూహాల్లో సమకాలీనత, సమకాలీనతతో పాటు ప్రాసంగికత అనివార్యమైన అవసరాలు. లక్షణాలు. ఈ విషయంలో గ్రాంస్కీ రచనల నుండి మనం నేర్చుకోవల్సింది ఏమిటన్నదే నేటి ఉద్యమాలు, ఉద్యమ నాయకత్వాల ముందున్న ప్రశ్న.

ఎందుకంటే విప్లవ శక్తులు నేడున్న దశ నుండి పురోగమించాలంటే పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క సామాజిక, రాజకీయ, ఆర్థిక, సైద్ధాంతిక ఆధిపత్యాన్ని సవాలు చేయాలి. అటువంటి సవాలు చేయటానికి విముక్తి కాంక్షించే శక్తుల ముందున్న ఏకైక అవకాశం ఆయుధం సైద్ధాంతిక నిబద్ధత, లక్ష్యశుద్ధి, పెట్టుబడిదారీ వ్యవస్థ 'ఇతరులు' అన్న జాబితాలోకి నెట్టేసిన వివిధ ఆర్థిక సామాజిక తరగతులు, వారికి ప్రాతినిధ్యం వహించే సంస్కృతులు, సామాజిక నిర్మాణాలను వడపోసి విప్లవోద్యమాన్ని విప్లవోద్యమ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లటానికి ఉపకరించే వాటిని గుర్తించాలి. క్రోడీకరించాలి. ఈ చారిత్రక కూటమి (పెట్టుబడిదారీ వ్యవస్థలో దోపిడీకి గురయ్యే వారందరూ) రూపొందించే కార్యాచరణకు ఆయుధంగా మల్చాలి. ఈ ప్రయత్నంలో చారిత్రక కూటమి తనదైన సైద్ధాంతిక ఆధిపత్యాన్ని, స్పష్టతను, లక్ష్యాన్ని ఓ సామాజిక సమాజం ముందుంచగలుగుతుంది.

ఇక్కడ రెండు అంశాలను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ చారిత్రక కూటమి స్థిరమైనది కాదు. నిశ్చలమైనది కాదు. ఈ కూటమిలో కనిపించే నిశ్చలత్వం సముద్రానికుండే నిశ్చలత్వం వంటిదే. ఆ నిశ్చలత్వం పునాదిలో ఉత్తుంగ తరంగాలు ఎగసి పడుతూనే ఉంటాయి. ఇక్కడ రాజకీయ నిర్మాణాలకు దిశా నిర్దేశం చేయగలిగిన, చేయాల్సిన వారిది ఓ ప్రత్యేక బాధ్యత ఉంటుంది. ఎగసిపడుతున్న తరంగాల్లో చారిత్రక కూటమి లక్ష్యాలు, లక్షణాలు,

స్వభావాలతో మమేకం కాగలిన తరంగాన్ని గుర్తించటం. అటువంటి తరంగాలను ఉమ్మడి ఉద్యమ లక్ష్యాల దిశగా నడిపించటం. తరచూ ఈ విషయంలో జరిగే పొరపాట్లే ఉద్యమ విస్తరణ, కొనసాగింపులపై ప్రభావం చూపుతూ ఉంటాయి. ఇది మొదటి అంశం. ఇక రెండో అంశం కార్మికవర్గ నాయకత్వానికి సంబంధించిన అంశం. చారిత్రక కూటమి గురించి ప్రస్తావించిన ప్రతిసారీ కరుడుకట్టిన మార్క్సిస్టు మేధావులమని చెప్పుకునే వారు ముందుకు తెచ్చే సమస్య కార్మికవర్గ నాయకత్వం ఉండదా అన్న ప్రశ్నను ముందుకు తెస్తూ ఉంటారు. ఫ్రెంచి విప్లవం మొదలు ఆధునిక ప్రజాస్వామిక విప్లవాల వరకూ ఏ విప్లవాన్ని కేవలం కొద్దిమందిగా ఉన్న వ్యక్తుల బృందం విజయవంతం చేసిన దాఖలాలు లేవు. ఇక్కడ కార్మికవర్గం నాయకత్వం అన్నది తనదైన సంపద ఏమీ లేని నిరంతరం దోపిడీకి గురయ్యే తరగతిగా చూడాలి. కేవలం కార్మికవర్గాన్ని శ్రమ అమ్ముకుంటే తప్ప మనుగడ సాగించలేని సమూహం అన్న విస్తృతార్థంతో చూడటానికి బదులు పారిశ్రామిక వస్తూత్పత్తి క్రమంలో అంతర్భాగంగా ఉన్న సమూహం అన్న అవగాహనకు పరిమితం చేసినప్పుడే ఇటువంటి ప్రశ్న ఉత్పన్నమవుతుంది. సమాజాన్ని సమూలంగా మార్చేసే ప్రయత్నమే విప్లవం. ఈ విప్లవం ఓ సంఘటన కాదు. ఓ ప్రక్రియ అన్న అవగాహనను జీర్ణించుకోవాలి. అప్పుడే ఈ పరిణామాన్ని ముందుకు తీసుకెళ్లటానికి కావల్సిన విప్లవాత్మక నిర్మాణాలను ఏయే సామాజిక తరగతుల నుండి ప్రోది చేసుకోవాలో అర్థం చేసుకోవాలి. అటువంటి ఉమ్మడి లక్ష్యం దిశగా రూపొందే ఉమ్మడి నిర్మాణాలన్నీ విప్లవోద్యమ నిర్మాణాన్ని ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఈ పని చేయగలిగినపుడే విప్లవోద్యమానికి నాయకత్వం వహించగలిగిన రాజకీయ నాయకత్వం, దాని అజమాయిషీలో రూపొందే నిర్మాణం సజీవంగా గతితార్కికంగా పని చేయలగుతుంది. గ్రాంస్కీ పదే పదే ప్రయోగించే చారిత్రక కూటమి పదబంధం మాటున ఉన్న అర్థం అవగాహన ఇది.

ఇక్కడ నాయకత్వ స్థానంలో ఉన్న వాళ్లు అర్థం చేసుకోవాల్సిన మరో పాఠాన్ని కూడా గ్రాంస్కీ జైలు నోట్స్‌లో మనం చూడొచ్చు. సహజంగా నాయకత్వ స్థానాల్లో ఉన్న వాళ్లు నిర్ణయాలు ప్రకటించటం, వాటిని అమలు చేయటం విప్లవోద్యమ నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్న వారి బాధ్యతగా ఉండటం మనం గమనిస్తూనే ఉంటాము. అదే సమయంలో నిర్ణయాలకు, వాటి అమలుకు మధ్య పెరుగుతున్న అంతరాన్ని కూడా గమనిస్తూనే ఉంటాము. నాయకత్వం చేసే నిర్ణయాలు విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళటంలో ఎంత అవసరమో, అటువంటి నిర్ణయాలకు రావటానికి నాయకత్వం ప్రాతిపదికగా పరిగణించిన నిర్దిష్ట పరిస్థితులు, వాటిని విశ్లేషించి మదింపు చేయటానికి అనుసరించిన పద్ధతులు, వేసుకున్న ప్రశ్నలు కూడా అంతే కీలక పాత్ర పోషిస్తాయి. నిర్మాణ వ్యవస్థ నిర్ణయాల వెనకనున్న ఈ మేధో ప్రక్రియ వివిధ దశల నిర్మాణంలో ఉన్న వారికి చేరితేనే వాటి ఆధారంగా వచ్చిన నిర్ణయాల అమలు జయప్రదంగా జరుగుతుంది. నిర్ణయాలకు, అమలుకు మధ్య అంతరం తగ్గుతూ వస్తుంది. తద్వారా క్షేత్రస్థాయి కార్యకర్త, శిఖరాగ్రస్థాయి నాయకుని మధ్య లక్ష్యం పట్ల స్పష్టతలో ఉన్న అరమరికలు తొలగిపోతాయి.

ఉద్యమ నిర్మాణంలో యాదృచ్ఛికత గురించి తలెత్తిన అపోహలను తొలగించే ప్రయత్నం గ్రాంస్కీ పార్టీ నిర్మాణం గురించిన వ్యాఖ్యల్లో కనిపిస్తుంది. ఆధునిక రాజు అన్న విమర్శనాత్మక రచన ఈ కోవకు చెందినదే. ఏమి చేయాలి అన్న రచనలో లెనిన్ స్పాంటేనిటీ గురించి ఇచ్చిన వివరణకు వికృత వ్యాఖ్యానం ఇచ్చిన అనేక మంది రచయితల వాదనలను గ్రాంస్కీ ఈ విమర్శలో తిప్పికొడతాడు. ఓ ఆలోచన యాదృచ్ఛికంగా ప్రజలందరినీ ఆవహించినంత మాత్రాన దానికి నిర్దిష్ట దిశా నిర్దేశం, మార్గదర్శనం చేయటానికి కావల్సిన వేదిక, కార్యాచరణ ప్రణాళిక లేకపోతే ఫలితాన్నివ్వదనీ, విప్లవాన్ని సుసాధ్యం చేయకపోగా అసాధ్యంగా మారుస్తుందని హెచ్చరిస్తాడు. చారిత్రక కూటమికి అటువంటి కార్యాచరణ వేదికను పార్టీ నిర్మాణం రూపంలో చరిత్ర అందించిందని గుర్తు చేస్తాడు.

పార్టీ అంటే ఓ సామాజిక వ్యక్తీకరణ అనీ పార్టీలో ప్రతి విభాగమూ తమ పరిధిలోని తాను ప్రాతినిధ్యం వహించే వివిధ సమూహాల మధ్య అనుబంధాన్ని బలోపేతం చేసే వేదికగా ఉంటుందని వ్యాఖ్యానిస్తాడు. దీంతో పాటు అనుబంధ సామాజిక సమూహాలతో కూడా ఈ వేదిక నెలకొల్పుకునే సంబంధాలే అంతిమంగా చారిత్రక కూటమి నిర్మాణానికి దారితీస్తాయని విశ్లేషిస్తాడు. సాధారణ రాజకీయ పరిభాషలో మాట్లాడుకుంటే ఈ చారిత్రక కూటమే ఐక్యసంఘటన. రాజకీయ పార్టీల మధ్య పోరాటం ఉచ్ఛస్థితికి చేరుకున్నప్పుడు సాంస్కృతిక రంగంలో పోరాటం అగ్రభాగాన ఉంటుందని గ్రాంస్కీ వక్కాణిస్తాడు. సాంస్కృతిక పోరాటంలో తిరుగుబాటు శక్తులు పాత సమాజం లోని పురోగామి నైతిక విలువలను అందిపుచ్చుకుని ఆధునిక సమాజపు అధునాతన నైతిక విలువల పునాదిని బలోపేతం చేయటం ద్వారా పురోగామి సాహిత్య, సాంస్కృతిక, నైతిక విలువల సమాహారాన్ని సిద్ధం చేసుకోవాలని ప్రతిపాదిస్తాడు. ఈ కోణంలో కనీసం భారతదేశంలో విముక్తి కోరే శక్తుల ప్రత్యేకించి వామపక్షాల కృషి బలహీనంగా ఉంది. సాంస్కృతిక రంగపు రాజకీయ ప్రాధాన్యతను గుర్తించటంలో తగిన విధంగా సాంస్కృతిక సైన్యాన్ని సిద్ధం చేసుకోవటంలో పార్టీ నాయకత్వ స్థానాల్లో ఉన్న వారి స్వీయమానసిక ధోరణులు పెద్ద అవరోధంగా మారాయని తెలుగు రాష్ట్రాల కమ్యూనిస్టు ఉద్యమానుభవాలు తెలియచేస్తున్నాయి. ఈ విషయంలో రాజకీయ నిర్మాణంలో

సామాజిక మేధావుల గురించిన గ్రాంస్కీ అభిప్రాయాలను, సాంస్కృతిక రంగంలో రాజకీయ కర్తవ్యం గురించిన ఆయన అభిప్రాయాలను వేరు చేసి చూడలేము.

ప్రత్యాధిపత్య సంస్కృతి నిర్మాణంలో జరిగే పోరాటానికి కావల్సిన సామాజిక మేధావులను గుర్తించటం, వారికి రాజకీయ లక్ష్యాల గురించిన శిక్షణ ఇవ్వటం, వారి సేవలు వినియోగించు కోవటం రాజకీయ నిర్మాణంలో కీలకమైన కర్తవ్యాలుగా ఉండాలని గ్రాంస్కీ ప్రతిపాదిస్తాడు. సామాజిక మేధావులు సాగించే పోరాటం కేవలం సాంస్కృతిక రంగానికి మాత్రమే పరిమితం కాదనీ, రాజకీయ రంగంలోనూ, ఆర్థిక విశ్లేషణలోనూ, కార్మిక పోరాటాల్లోనూ, సాంస్కృతిక కళా రంగాల్లోనూ, విద్యారంగం లోనూ, చారిత్రక అనుభవాలను అధ్యయనం చేసి మదింపు వేసే రంగంలోనూ సాగే పోరాటమని స్పష్టం చేస్తాడు. తద్వారా బూర్జువా వర్గం అందించే చైతన్యాన్ని విప్లవాత్మక చైతన్యంగా మల్చటంలో ఈ ప్రత్యాధిపత్య నిర్మాణం దిశగా సాగే సాంస్కృతిక పోరాటం కీలక పాత్ర పోషిస్తుందని విశ్లేషిస్తాడు. సమకాలీన భారతదేశంలో మనువాద హిందుత్వశక్తుల సాంస్కృతికాధిపత్యం, సాంస్కృతికాధిపత్య నిర్మాణ వ్యవస్థలు, సాంస్కృతిక రంగంలో కృషికి, రాజకీయ రంగంలో పురోగతికి మధ్య ఉన్న అవినాభావ సంబంధాలను అనుభవపూర్వకంగా చూస్తున్నాము. అంటే రాజకీయ పోరాటంలో ముందు పీఠిన ఉన్న సామాజిక మేధావులు బూర్జువా మీడియా, సాంస్కృతిక ఆధిపత్యాన్ని సార్వత్రికం చేసే సాధనాలుగా ఉన్న విద్యాలయాలు, సినిమా రంగం, సాంస్కృతిక సంస్థలు, క్రీడా సంఘాలు, సామాజిక వేదికలు వంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా బూర్జువా ఆధిపత్యాన్ని వ్యవస్థీకృతం చేయటానికి సాగిస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాడాలంటూ జైలు నోట్స్ ద్వారా గ్రాంస్కీ కర్తవ్యబోధ చేస్తున్నాడు. వీటన్నింటినీ కలిసి లూయిస్ అల్థూసర్ అనే మార్క్సిస్టు మేధావి "భావజాలం, భావజాలాన్ని సార్వత్రికం చేసే స్వచ్ఛ రాజ్యాంగయంత్రం' అని క్రోడీకరిస్తాడు.

విప్లవ పార్టీ తగినంతమంది కార్యకర్తలు, సానుభూతిపరుల సైన్యాన్ని కలిగి ఉన్నప్పుడు ఎన్నికల రంగానికి ఆవలనున్న అన్ని రంగాల్లో సమగ్ర కృషి సాగిస్తాయి. విప్లవ పార్టీ కార్యకలాపాలు వ్యాప్తి, సార్వత్రికత సదరు పార్టీ సైన్యం బలాబలాలపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేస్తాడు. అందుకే బూర్జువా ఆధిపత్యాన్ని సమగ్రంగా ఎదుర్కోవాలంటే విశాల జనబాహుళ్య పార్టీ నిర్మాణం అవసరమని సూత్రీకరిస్తాడు. 1919లో ఇటలీ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావంతో మొదలు తాను జైలుకెళ్లే వరకూ ఈ అవగాహనతోనే పార్టీ నిర్మాణంలో నిమగ్నమవుతాడు గ్రాంస్కీ.

అప్పటికే ఇటలీ వామపక్ష ఉద్యమంలో సైతం భిన్న అభిప్రాయాలు, దృక్పథాలు, ప్రాధాన్యతలు కలిగిన వివిధ ఉద్యమ శక్తులు తమ కార్యకలాపాలు కొనసాగిస్తూ ఉన్నాయి. బూర్జువా దోపిడీని అంతమొందించాలన్న మౌలిక లక్ష్యం విషయంలో ఏకీభావం ఉన్నా ప్రయాణించే మార్గాలు, తక్షణ శతృవు, ప్రధమ శతృవు, వర్గశతృవు వంటి అనేక అంశాలపై భిన్నాభిప్రాయాలు కలిగిన ఉద్యమాలవి. అప్పటికే మొదటి ప్రపంచ యుద్ధం ముగింపుకు రానున్న తరుణంలో యుద్ధానంతర ప్రపంచంలో కమ్యూనిస్టు శక్తులు అనుసరించాల్సిన ఎత్తుగడలు, నిర్మించాల్సిన ఐక్యసంఘటన స్వరూప స్వభావాల గురించిన భిన్నాభిప్రాయాలు కూడా తోడయ్యాయి. వామపక్ష కమ్యూనిజం ఓ బాలారిష్టం అన్న తన రచనలో లెనిన్ మొదటి ప్రపంచ యుద్ధానంతర కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ సుదీర్ఘకాలం నిలకడగా ప్రయాణించగల దశకు చేరుకున్నదన్న వాస్తవాన్నీ, జర్మనీ వంటి దేశాల్లో యుద్ధ కాలంలో ఉవ్వెత్తున ఎగిసిన ప్రజా ప్రతిఘటనను సొమ్ము చేసుకుని బూర్జువా శక్తులను గద్దె దించటానికి ఉన్న అవకాశాలను వామపక్ష శక్తులు చేజార్చుకున్న విషయాన్నీ గుర్తించటంలో యూరోపియన్ దేశాల కమ్యూనిస్టు ఉద్యమాలు విఫలమవటాన్ని తీవ్రంగా విమర్శిస్తాడు. ఈ పరిస్థితుల్లో ఇతర దేశాల్లో విప్లవోద్యమం పురోగమించాలంటే ముందుకొచ్చిన అనేక నూతన సవాళ్లను అధిగమించాల్సి ఉందన్న వాస్తవాన్ని వివరిస్తాడు. ఈ పరిస్థితుల్లో గ్రాంస్కీ ఐక్య సంఘటన ఎత్తుగడలను కేవలం రాజకీయ పోరాట రంగానికి పరిమితం చేయకుండా ప్రతి దేశంలోనూ బూర్జువా ఆధిపత్యాన్ని సవాలు చేయటానికి తరతమ స్థాయిల్లో సిద్ధమవు తున్న శక్తుల మధ్య ఉండాల్సిన ఐక్య సంఘటనగా నిర్వచిస్తాడు. సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక, తాత్విక రంగాలు, చరిత్రను పునర్వ్యాఖ్యానించే ప్రయత్నాల మధ్య కూడా ఐక్య సంఘటన అవసరమన్న వ్యాఖ్యానాన్ని జోడిస్తాడు గ్రాంస్కీ. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ లెనిన్ పెట్టుబడిదారీ వ్యవస్థ నిలకడత్వాన్ని సంతరించుకుంటున్న దశలో కమ్యూనిస్టు పార్టీల ఎత్తుగడ రాజ్యాధికారం కోసం పోరాడే ఎత్తుగడ నుండి పౌర సమాజంలో ప్రగతిశీల ప్రజాతంత్ర శక్తులందరినీ కూడగట్టి కార్మిక సంఘాలు, సోషల్ డెమొక్రసీ పార్టీలతో ఐక్యకార్యాచరణను పెంపొందించు కునే లక్ష్యంతో సాగాలని ప్రతిపాదిస్తాడు.

ఈ విషయంలో లెనిన్ అవగాహన, గ్రాంస్కీ అవగాహనల మధ్య సారూప్యత, ఏకత్వం స్పష్టంగా కనిపిస్తుంది. గ్రాంస్కీ దృష్టిలో పార్టీ యొక్క మౌలిక కర్తవ్యం, లక్ష్యం రాజ్యాధికారం చేపట్టడమే. ఈ దిశగా సాగే తుది పోరాటంలో పార్టీ, పార్టీ నాయకత్వంలో నడిచే జనబాహుళ్యం ఉక్కు క్రమశిక్షణతో సమరం సాగించాల్సి ఉంటుందని విశ్లేషిస్తాడు. భావజాల రంగంలో సాగే కృషిలో మాత్రం జనబాహుళ్యాన్ని భాగస్వాములను చేయటం ద్వారా భావాల మధ్య ఐక్యసంఘటనను రూపొందించాలని, తద్వారా బూర్జువా సాంస్కృతిక ఆధిపత్యాన్ని సవాలు చేసే ప్రత్యాధిపత్య వ్యవస్థల నిర్మాణం సాధ్యమని ప్రతిపాదిస్తాడు. పార్టీ నిర్మాణం గురించి రాస్తూ గ్రాంస్కీ:

పార్టీ అవసరం ఎప్పుడు తలెత్తుతుంది? రాజ్యాధికార సాధన స్థితి ఆసన్నమైనప్పుడు, రాజ్యాధికారం కోసం సాగే పోరాటం విజయ సాధన దిశగా ప్రయాణం సాగించగలదన్న నమ్మకం కలిగినప్పుడు, లేదా కనీసం రానున్న కాలంలో విప్లవ సాధనకు అవకాశాలు ఉన్నాయన్న అంచనాకు వచ్చినప్పుడు పార్టీ అవసరమవుతుంది. అయితే విప్లవం విజయం సాధించటానికి పార్టీ ఒక్కటే చాలదు. విప్లవం విజయవంతం సాధించాలంటే కనీసం మూడు అంశాలు ఏకకాలంలో సంభవించాలి, అవి :

1. క్రమశిక్షణతో కూడి విశాల జన బాహుళ్యం, పార్టీ వ్యవస్థ లోని సామాజిక మేధావులతో కలిసి సమానంగా లక్ష్యసాధన పోరాటంలో నిమగ్నం కావాలి. సృజనాత్మక కలిగిన కొద్దిమంది నాయకత్వ బృందంతో విప్లవం సాధ్యం కాదు. అటువంటి బృందం లేకుండా పార్టీని నడపటం అసాధ్యం అన్న భ్రమలకు తావుండరాదు. అదే సమయంలో పార్టీని నడపటంలో అటువంటి వారికి సముచిత స్థానం ఉంటుంది.

2. నాయకత్వ స్థానాల్లో పని చేయగలిగిన వారికి తగిన తర్ఫీదునివ్వటం, వారి సామర్థ్యాలను పెంపొందించేందుకు తగిన అవగాహన కల్పించటం.

3. ఈ రెండు దశలని, అంటే జనబాహుళ్యానికి, నాయకత్వ స్థానాలకు మధ్య సమన్వయం, సంయమనం సాధించటానికి కావల్సిన యంత్రాంగం.

ఈ మూడు అంశాలు సమపాళ్లలో మేళవించినప్పుడే పార్టీ వ్యవస్థ సక్రమంగా పని చేస్తుందని గ్రాంస్కీ అభిప్రాయపడ్డాడు.

జనబాహుళ్యాన్ని పోరాట సైన్యంగా తీర్చిదిద్దటం నిస్సందేహం ప్రాధాన్యత గలిగిన కర్తవ్యం. అటువంటి సైన్యం ద్వారా పార్టీ మనుగడ సాగించటానికి కావల్సిన నిర్మాణాన్ని తీర్చిదిద్దటం సాధ్యమవుతుంది. అంతర్గత బహిర్గత శత్రువులను అధిగమించటం సాధ్యమవుతుంది. ఈ దిశగానే రెండో ప్రపంచ యుద్ధానంతర పరిస్థితుల్లో ప్రత్యేకించి వర్ధమాన దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు కార్యకర్తల శిక్షణా శిబిరాలు నిర్వహించి మార్క్సిస్టు మౌలిక సూత్రాల పట్ల క్షేత్రస్థాయి కార్యకర్తలకు ప్రాథమిక అవగాహన కల్పించేందుకు ప్రయత్నం చేయటం ఓ సంస్థాగత రూపాన్ని సంతరించుకుంది.

రాజ్యాధికారాన్ని సాధించి, దీర్ఘకాలం తమ చేతుల్లో ఉంచుకోవాలనుకునే ఏ వర్గమైనా తన ప్రయోజనాలను, లక్ష్యాలను, ఆకాంక్షలను సార్వత్రిక సామాజిక ప్రయోజనాలు, లక్ష్యాలు, ఆకాంక్షలుగా వ్యక్తీకరించటానికి కావల్సిన రీతిలో పని చేసే సమీకృత మేధావుల బృందాన్ని తయారుచేసుకుంటుంది. వీళ్లనే గ్రాంస్కీ ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్ అన్నాడు. ప్రభుత్వ విద్యావ్యవస్థ, విశ్వవిద్యాలయాలు, వాటిలో సాగే పరిశోధనలు రాజ్యం, ప్రభుత్వం తరపున అటువంటి కర్తవ్య నిర్వహణకు ఉపయోగపడే సమీకృత మేధావులను తయారు చేయటంలో శక్తివంతమైన సాధనాలుగా పని చేస్తాయి. చేస్తున్నాయి. పాలకవర్గ ప్రయోజనాలు కాపాడే విలువలనే సమాజపు నైతిక విలువలుగా మార్చే క్షేత్రాలే ఈ విద్యాలయాలు. బోధనాంశాలు, వివిధ వ్యవస్థలు, సంస్థల మధ్య సంబంధాలు, పరిపాలన యంత్రాంగాల జమిలి కృషి ద్వారా ఉద్దేశ్యపూర్వకంగానే దోపిడీ వ్యవస్థకు అనుకూలమైన సామాజిక విలువల ఉత్పత్తి పునరుత్పత్తి సాగిస్తుంది. ఈ కృషిని భవిష్యత్తులో సైతం కొనసాగించటానికి కావల్సిన పద్ధతిలో వృత్తిపరమైన మేధావులను కూడా రాజ్యాంగ యంత్రం సిద్ధం చేసుకుంటుంది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధితో ముడిపడి ఉన్న విభాగాల్లో ఇటువంటి సైన్యం తయారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతూనే ఉంటుంది. దానికి తగిన వనరుల సమీకరణ కూడా రాజ్యమే చేస్తుంది. వీటికోసం ప్రత్యేక శాస్త్ర పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేసి అజమాయిషీ చేస్తుంది. మరోవైపు రోజువారీ రాజ్యాంగయంత్ర భారాన్ని నిర్వహించటానికి కావల్సిన పరిపాలనా నిపుణులు, అక్కౌంటెంట్లు, ఆర్థిక నిపుణులు, ద్రవ్య యాజమాన్య నిపుణులు వంటి వారిని కూడా తయారు చేస్తుంది. ఈ దోపిడీ విలువల ఉత్పత్తి పునరుత్పత్తితో ముడిపడి ఉన్న సేవలు, దోపిడీ వ్యవస్థలు నిరాటంకంగా కొనసాగటానికి కావల్సిన శాస్త్ర సాంకేతిక రంగాలతో ముడిపడి ఉన్న సేవలకు ఇతర సామాజిక సేవలకంటే మెరుగైన వేతనాలు ముట్టజెప్పటానికి కూడా పాలకవర్గం, దాని పనుపున పనిచేసే రాజ్యాంగయంత్రం సిద్ధంగా ఉంటుంది. ఈ విలువలను సార్వత్రిక విలువలుగా మార్చటానికి కావల్సిన సాంస్కృతిక ఉత్పత్తులను కూడా పాలక వర్గం సిద్ధం చేస్తుంది. సుదీర్ఘకాలం భావజాల రంగంలో పాలక వర్గం కొనసాగించే ఆధిపత్యమే ఈ వర్గ ప్రయోజనాలను కాపాడే సామాజిక విలువలను సామెతలుగా, పొడుపు కథలుగా, వ్యంగ్య వ్యాఖ్యానంగా అభివృద్ధి చేస్తుంది. తెలుగు సాహిత్యంలో సైతం ఇటువంటి సామెతలు, పొడుపు కథలు గణనీయంగానే ఉన్నాయి. సామెతలు – వాటి ఆవిర్భావం – అవి వ్యక్తీకరించే వర్గ ప్రయోజనాలు, లేదా ప్రాతినిధ్యం వహించే విలువల గురించి అధ్యయనం, లోతైన పరిశీలన మరింత ఆసక్తికరంగా ఉంటుంది.

పార్టీ వ్యవస్థలో పనిచేసే సమీకృత మేధావులు కూడా అదే విద్యావ్యవస్థలు, సామాజిక వ్యవస్థల ద్వారా శిక్షణ పొందిన వారే కావటంతో వారికి కూడా ఆయా రంగాల్లో ప్రావీణ్యం ఉంటుంది. సమాజాన్ని మార్చటానికి కంకణం కట్టుకున్న పార్టీల ముందు భావజాల రంగంలో జరిగే కృషిలో రెండు రకాల ప్రశ్నలు తలెత్తుతాయి. బూర్జువా విద్యా విధానం, విద్యా వ్యవస్థలోని అనేక అంశాలను తన రోజువారి పని విధానంలో అనుసరించటం,

వర్తింపచేసుకోవటం మొదటి సమస్య. ఆధిపత్య భావజాల రంగంలో రాజ్యాంగయంత్రం పనుపున పనిచేసే సమీకృత మేధావులు, ప్రత్యామ్నాయ సమాజం కోసం పనిచేసే సమీకృత మేధావుల పనివిధానంలో అనేక సారూప్యతలున్నా రెండో కోవకు చెందిన మేధావులు ఆధిపత్య భావజాలాన్ని ప్రతిఘటించే ప్రత్యాధిపత్య సంస్కృతిని నిర్మించే క్రమంతో పాటు దానికి సంబంధించిన వ్యవస్థలను నిర్మించటం, నిర్వహించటం రెండో రకమైన సమస్య. దీనికి గాను రాజకీయార్ధ శాస్త్రానికి సంబంధించిన విశేషమైన అవగాహన, సాంస్కృతిక రూపాలు, వాటి సారం గురించిన అవగాహన కలిగి ఉండాలి. పార్టీ మేధావులు అందుబాటులో ఉన్న ఆధిపత్య వ్యవస్థలు అందించే విజ్ఞానం, అవగాహన పరిధికి మించి జ్ఞాన సముపార్జన చేయగల సామర్థ్యం కలిగినవారై ఉండాలి. తద్వారా పార్టీ శ్రేణులు తమ వర్గ ప్రయోజనాలను వ్యక్తీకరించగల సామర్థ్యం కలిగిన వారిగా తయారు చేయటమే కాదు. సమాజంలో ఆయా వర్గాల నిర్మాణంలో ఉన్న సంక్లిష్టతల పట్ల సరైన అవగాహనను కూడా కల్పించాలి.

అయితే ఇటువంటి ప్రత్యాధిపత్య సంస్కృతిని నిర్మించటంలో పని చేసే సమీకృత మేధావులే రాజ్యాంగయంత్రానికి సవాలు విసరగలుగుతారు. కనుకనే అటువంటి వారిని లక్ష్యంగా ఎంచుకుని రాజ్యాంగయంత్రం దాడులకు పాల్పడుతుంది. ప్రత్యేకించి ఫాసిస్టు శక్తులు లేదా ఫాసిస్టు స్వభావం ఉన్న శక్తులు రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకున్నప్పుడు ప్రతిపక్షాలను, ప్రశ్నించే కలాలు, గళాలను నయానో భయానో తమ గుప్పిట్లో పెట్టుకుంటాయి. ఉదారవాద ప్రజాస్వామిక స్వభావం కలిగిన రాజ్యాంగ యంత్రం సైతం ఫాసిస్టు శక్తుల చేతుల్లో బందీ అయినప్పుడు ఉగ్రవాదంపై దాడి పేరుతోనో దేశభక్తి పేరుతోనో, జాతీయ భద్రతకు ముప్పు అనే సాకుతోనో వామపక్ష శక్తులు, ఆలోచనలు, అవగాహనలపై రెట్టించిన శక్తితో దాడి చేస్తాయి. 1920–40 దశకాల్లో ఇటలీ, జర్మనీ, స్పెయిన్లలోనూ, 1950–70 దశకాల్లో అమెరికాలోనూ, 1980–90 దశకాల్లో లాటిన్ అమెరికా దేశాల్లోనూ, తాజాగా భారతదేశంలోనూ వామపక్షాలపై సాగుతున్న దాడులు పైన ప్రస్తావించిన గ్రాంస్కీ విశ్లేషణలకు చక్కని ఉదాహరణ. వృత్తి విప్లవకారులుతో కూడిన పార్టీ విప్లవోద్యమానికి చుక్కానిగా పని చేయాలన్న లెనిన్ ప్రతిపాదనకు, కార్మికవర్గమే స్వయంచైతన్యంతో విప్లవోద్యమానికి నాయకత్వం వహించాలన్న రోసా లగ్జెంబర్గ్ ప్రతిపాదనకు గ్రాంస్కీ ప్రతిపాదించిన పార్టీ నిర్మాణ సూత్రాలు, నిర్మాణ వ్యవస్థలు సమదూరంలో ఉంటాయి. ఈ నేపథ్యంలో పార్టీ నిర్మాణం గురించి గ్రాంస్కీ ఆలోచనలను మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంది. ❑

## కార్మికవర్గ చైతన్యపు తొలి మెరుపు పారిస్ కమ్యూన్

**(29వ పేజీ తరువాయి)**

చేజిక్కిన అధికారంతో వర్సెయిల్స్‌పై దండయాత్ర జరిపి థేర్స్‌ను పూర్తిగా లొంగతీసుకోకుండా ఉదాసీనత వహించడం రెండో తప్పిదం. ఈ అవకాశం తీసుకుని ఆ శక్తులు మళ్లీ సమీకృతం కాగలిగాయి. ఇతర పట్టణాలలో కూడా కమ్యూన్లు ఏర్పడినప్పటికి వాటిని సంఘటితపరచాల్సిన అవసరాన్ని గుర్తించలేదు. పారిస్ మిగిలిన దేశం నుంచి విడగొట్టబడిన స్థితిలో రైతాంగం మద్దతు కూడగట్టుకోవలసిన అవసరాన్ని అర్థం చేసుకోలేదు. కొద్దిపాటి నిధుల కోసం తప్ప ఆర్థికశక్తికి కేంద్రమైన బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్‌ను కమ్యూన్ స్వాధీనం చేసుకోనేలేదు. మరోవంక థేర్స్ ఆ బ్యాంకు నిధులు బాగా ఉపయోగించుకున్నాడు. ఈ పొరబాట్లు, లోపాలు, తప్పు అంచనాలకు చారిత్రక కారణాలున్నాయి. పారిస్ కార్మికులకు నాడు వున్న అనుభవం, పరిమితి అంతే. పైగా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధికి నాటికి ఇంకా అవకాశాలు ఉన్నాయి. కార్మికోద్యమం కొంత పెరిగినా, సామాజిక సూత్రాల గురించి, పోరాటం గురించి దానికి సంపూర్ణమైన అవగాహన లేదు. ఈ నేపథ్యంలో థేర్స్ ప్రభుత్వం నెమ్మదిగా కూడగట్టుకుని, ఏప్రిల్ రెండో భాగంలో పారిస్‌పై దాడి ప్రారంభించింది. కమ్యూనార్డులు ఎంతో వీరోచితంగా పోరాడినా పరిస్థితులు వారికి ప్రతికూలంగా వున్నాయి. ఆఖరుకు థేర్స్ వారిని అణచివేసేందుకు నిర్లజ్జగా బిస్మార్క్‌కు లొంగిపోయాడు. మే 22న సైన్యాలు పారిస్‌లో ప్రవేశించాయి. 28కి యుద్ధం ముగిసిపోయింది. ఓడిపోయిన కార్మికులను బూర్జువాలు ఘోర హింసలకు గురిచేశారు. ఎందరో వీరులను విచారణ లేకుండా కాల్చి చంపారు. ఆ మారణకాండలో 17 వేల నుంచి 30 వేల మంది వరకు చనిపోయి వుంటారని రకరకాల అంచనాలు తెల్పాయి. వేలకు వేల మందిని అరెస్టు చేసి న్యూ కెలడోనియాలో భయానక చాకిరీ శిక్ష విధించారు. 72 రోజులలోనే ఓటమిపాలైనా పారిస్ కమ్యూన్ ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలో ఉజ్వల ఘట్టంగా నిలిచిపోయింది.

సువ్యవస్థితంగా ఏర్పడిన సోవియట్, తూర్పు యూరోప్‌ల లోనే సోషలిజం విచ్ఛిన్నమైనపుడు అత్యంత ప్రాథమిక రూపంలో ఆవిర్భవించిన కమ్యూన్ కుట్రలకు గురవడంలో ఆశ్చర్యం లేదు. ఏమైనా అది కార్మికవర్గ చైతన్యపు తొలి మెరుపు. ఎరుపు. ❑

/'వెయ్యేళ్ల చరిత్ర' నుంచి/

RNI Regn No. 52879/93


# రత్న నర్సింగ్ హోమ్

# Ratna Nursing Home

రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద, సజ్జాపురం

**తణుకు**

*Consulting Doctors*

**డా॥ వల్లూరి సోమశేఖర్**
M.B.B.S., D.C.H, M.D. (Gen Medicine)
Regd. No. 16999

**డా॥ బిక్కిన ఘనశ్యామ్**
M.B.B.S., M.D. (Gen Medicine)
Regd. No. 78473

**డా॥ వల్లూరి సుబ్బలక్ష్మి**
M.B.B.S., D.G.O.
Regd. No. 18121

**డా॥ బిక్కిన అమృత రత్న**
M.B.B.S., M.S., (OBG/Gynea)
Regd. No. 85666


**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : D V V S Varma**